SRI GAYATRI AYURVEDIC MULTI SPECIALITY CENTRE
GIAYS
శ్రీ గాయత్రి ఆయుర్వేదిక్ మల్టీస్పెషాలిటీ సెంటర్

D.No. 58-15-124, Santhinagar, NAD 'x' Road, Visakhapatnam-530016. Ph : 9247011553
Email: srigayatriayurvedavskp@gmail.com

APTEL RNI NO: 62061/2015

# వార్తావళి

తెలుగు దినపత్రిక


వివాహ మరియు గృహ సంబంధమైన
శుభ ముహూర్తములు మరియు
పుట్టిన తేది, సమయం, పుట్టిన ప్రాంతం
నక్షత్రములు బట్టి జాతకములు వ్రాయబడును
బులుసు వెంకట సుబ్రహ్మణ్యం
M.A. Astrology
#135/B,Sector-3, Ukkunagaram, Vizag-32
e*mail : bulusu333@gmail.com
Ph : 70320 34001, 85001 59006

విశాఖపట్నం : మంగళవారం 8 సెప్టెంబర్ 2020 | ఎడిటర్ : బులుసు వెంకట సుబ్రహ్మణ్యం | VAARTAVALI TELUGU DAILY | పేజీలు : 8 | రూ. 1.00 | సంపుటి 5 | సంచిక 201

## 'సంపూర్ణ పోషణ'కు సీఎం జగన్ శ్రీకారం



**అమరావతి, వార్తావళి, సెప్టెంబర్ 7 :** వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్, వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రారంభించారు. ఈ పథకాల్లో ఇస్తున్న ఆహార పదార్థాల మెనూపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్న సీఎం.. పదార్థాల రుచి చూశారు. అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడంతోపాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందచేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే అమలులో ఉన్న వైఎస్సార్ అమృత హస్తం, మధ్యాహ్న భోజన పథకం, బాలామృతం, వైఎస్సార్ బాల సంజీవనికి అదనంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేయనున్నారు.

**వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ పథకం..**

4 రాష్ట్రంలోని 77 గిరిజన, సబ్‌ప్లాన్ మండలాల పరిధిలోని 8 ఐటీడీఏలు, 52 ఐసీడీఎస్ ప్రాజెక్టులతో పాటు 8,320 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. 66 వేల మంది గర్భిణులు, బాలింతలకు నెలలో 25 రోజులపాటు వేడి పాలు, అన్నం, పప్పు, కూరగాయలు లేదా ఆకుకూరలు, గుడ్డు అందజేస్తారు. టేక్ హోమ్ న్యూట్రిషన్ కిట్ కింద నెలకు 2 కిలోల మల్టీ గ్రెయిన్ ఆటా, అర కిలో వేరుశనగ చిక్కీ, అరకిలో రాగి పిండి, అరకిలో బెల్లం, అరకిలో ఎండు ఖర్జూరం పంపిణీ చేయనున్నారు. ఒక్కో లబ్ధిదారుడిపై నెలకి రూ.1,100 చొప్పున మొత్తం రూ.87.12 కోట్లు ఖర్చు చేయనున్నారు.

**వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం..**

ఈ పథకాన్ని 77 గిరిజన మండలాలు మినహా రాష్ట్రవ్యాప్తంగా 47,287 అంగన్వాడీ కేంద్రాల్లో అమలు చేయనున్నారు. 5.80 లక్షలమంది గర్భిణీలు, బాలింతలకు నెలలో 25 రోజులు వేడి పాలు, అన్నం, పప్పు, కూరగాయలు లేదా ఆకుకూరలు, కోడి గుడ్లు సరఫరా చేస్తారు. టేక్ హోం న్యూట్రిషన్ కిట్ కింద నెలకు 250 గ్రాముల వేరుశనగ చిక్కీ, కిలో రాగి పిండి, 250 గ్రాముల బెల్లం, మరో 250 గ్రాముల ఎండు ఖర్జూరం, కిలో సజ్జ పిండి అందిస్తారు. దీని కోసం ఒక్కొక్కరిపై నెలకు రూ.850 చొప్పున మొత్తం రూ.591.60 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేయనుంది.

**ఏపీలో విద్యాలయాలకు అనుమతి**


కేంద్రప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఏపీ అన్‌లాక్-4 మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ నెల 21 నుంచి 9, 10, ఇంటర్ విద్యార్థులు విద్యాలయాలకు వెళ్లేందుకు అనుమతిని స్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనికోసం తల్లిదండ్రుల రాతపూర్వక అంగీకారం తప్పనిసరి చేసింది. అంతేకాకుండా అదే రోజునుంచి పీజీ, పీహెచ్‌డీ విద్యా ర్థులు కూడా కళాశాలలకు వెళ్లవ చ్చని తెలిపింది. నైపుణ్యాభివృద్ధి కేంద్రా లు తెరచుకునేందుకు అనుమతి నిచ్చింది. 100 మందికి మించ కుండా సామాజిక, విద్య, క్రీడలు, మతపరమైన, రాజకీయ సమావేశాలు నిర్వహించుకో వాలని సూచించింది. ఈ నెల 20 నుంచి పెళ్లిళ్లకు 50 మందిని, అంత్యక్రియలకు 20 మందికి అనుమతి ఇవ్వాలని నిర్ణయించింది. 21 నుంచి ఓపెన్ ఎయిర్ థియేటర్లకు అనుమతి ఇచ్చినప్పటికీ సినిమా హాళ్లు, స్విమ్మింగ్‌పూల్స్, ఎంటర్‌టైన్‌మెంట్ పార్కులకు అనుమతి నిరాకరించింది.

**సెప్టెంబర్ 11 నుంచి వైఎస్సార్ ఆసరా..**

ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నారు ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి. ఏపీ సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన రెండవ ఏడాది నుంచి వైఎస్సార్ ఆసరా కింద డ్వాక్రా రుణాలను నాలుగు విడతల్లో మాఫీకి సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ ఆసరా పథకం కింద ఈ నెల 11న తొలివిడత డ్వాక్రా రుణాల నగదు చెల్లించనున్నారు. నాలుగు విడతల్లో మహిళల ఖాతాలకు ప్రభుత్వం జమచేయనుంది. మహిళల పేరిట ఇళ్ల పట్టాల మంజూరు ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. వైఎస్సార్ చేయూతతో 45 ఏళ్లు పైబడిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మహిళల ఖాతాలకు నేరుగా రూ.18,750 చొప్పున జమచేశారు. డ్వాక్రా మహిళలు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణ మొత్తాలను నాలుగు విడతల్లో వైఎస్సార్ ఆసరా పథకం కింద చెల్లింపులకు ప్రణాళిక రూపొందించారు. తొలివిడత లబ్ధిని అందజేసేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు.



## దేశ ఆకాంక్ష నెరవేర్చడంలో విద్యావిధానం ముఖ్య సాధనం: మోడీ



**ఢిల్లీ:** జాతీయ విద్యావిధానంలో అధ్యయనం చేయడం కాకుండా నేర్చుకోవడంపై ఫోకస్ చేస్తుందని ప్రధాని మోడీ తెలిపారు. విమర్శనాత్మక ఆలోచనలపై ఫోకస్ చేయడం ద్వారా.. విద్యార్థులు క్రియేటివిటీ పెరుగుతుందన్నారు. గవర్నర్లతో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో కలిసి ప్రధాని మోడీ జాతీయ విద్యా విధానం 2020పై వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రసంగించారు. జాతీయ విద్యా విధానాన్ని మరింత బలోపేతం చేశామని మోడీ పేర్కొన్నారు.

**టెక్నికల్, వొకేషనల్..**

సమాచారం, విజ్ఞానం మరింత సరళతరం అయ్యిందని మోడీ అన్నారు. ప్రస్తుతం కొన్ని వీడియోల ద్వారా సమాచారం ఎంత వేగంగా వెళుతుందనే విషయాన్ని ప్రస్తావించారు. టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందిందనే విషయాన్ని పేర్కొన్నారు. టెక్నికల్, వొకేషనల్ అన్ని విద్యా విధానాల్లో సమూల మార్పులు తీసుకొచ్చామని మోడీ తెలిపారు. జాతీయ విద్యా విధానం కోసం 2 లక్షల మంది నుంచి అభిప్రాయం తీసుకున్నామన్నారు. విధానం రూపొందించడానికి 5 ఏళ్ల సమయం పట్టిందని చెప్పారు.

**దేశ ఆకాంక్ష నెరవేర్చడంలో కీ రోల్**

దేశ ఆకాంక్ష నెరవేర్చడం కోసం విద్యా విధానం ముఖ్య సాధనం అని ప్రధాని మోడీ ఉద్ఘాటించారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక సంస్థలు విద్యా విధానంలో ఇక కలుగజేసుకోబోవు అని తేల్చిచెప్పారు. ఇదివరకు జోక్యం చేసుకోవడం వల్లే ఇబ్బందులు వచ్చాయని పరోక్షంగా చెప్పారు. దీంతో విద్యార్థులతోపాటు, పేరంట్స్, టీచర్స్‌కు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. విద్యా ప్రమాణాలు పెరగడంతో.. అంతర్జాతీయ యవనికపై భారత్ సత్తా చాటుతోందని మోడీ అభిప్రాయపడ్డారు. సాధారణ మధ్యతరగతి కుటుంబాలకు కూడా దీంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు.

**జ్ఞానం, నైపుణ్యం డెవలప్..**

ఓ గ్రామంలో టీచర్ లేదా విద్యా వేత్తలు కూడా జాతీయ విద్యావిధానంపై దృష్టిసారిస్తున్నారని మోడీ తెలిపారు. గత విద్యా విధానం నుంచి అభివృద్ధి చూడాలని అభిలషిస్తున్నారని చెప్పారు. యువతలో జ్ఞానం, నైపుణ్యం మరింత పెంపొందించేందుకు ఆస్కారం ఉంటుందని చెప్పారు. 1986లో జాతీయ విద్యావిధానం ప్రకటించిన సంగతి తెలిసిందే. దాదాపు 34 ఏళ్ల తర్వాత విద్యా వ్యవస్థలో సమూల మార్పులను ప్రవేశపెడుతూ.. మోడీ సర్కార్ శ్రీకారం చుట్టింది.

**పాఠకులకు విజ్ఞప్తి**

www.vaartavali.com వెబ్‌సైట్‌లో వార్తావళి దినపత్రిక ఇంటర్నెట్ పేపర్ వస్తుందని చెప్పడానికి వార్తావళి దినపత్రిక యాజమాన్యం తెలియపరుస్తున్నది. ఈ అవకాశాన్ని పాఠకులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవల్సిందిగా కోరుతున్నాము.

## ఆకాశానికి 'హైపర్' పంచ్: డీఆర్‌డీవో విజయం




చైనా నుంచి ఎదురయ్యే హైపర్‌సోనిక్ ఆయుధ ముప్పును ఎదుర్కొనేందుకు భారత్ కూడా మెల్లగా ముందడుగు వేస్తోంది. భవిష్యత్తులో యుద్ధతంత్రాన్ని శాసించే ఈ టెక్నాలజీలో కూడా భారత్ కీలక దశను దాటింది. ఇప్పటికే పొరుగున డ్రాగన్ చెంతకు ఈ టెక్నాలజీ చేరి కొన్నేళ్లవుతుంది. దీంతో భారత్ కూడా పావులు కదిపింది. ఫలితంగా నేడు భారత్ కూడా దీనిని విజయవంతంగా పరీక్షించింది. ఏదైనా ఆయుధం శబ్దవేగానికి ఐదు రెట్ల వేగంతో ప్రయాణిస్తే దానిని హైపర్‌సోనిక్‌గా ఆయుధంగా పేర్కొంటారు. అంటే మాక్5 స్పీడ్ అన్నమాట. ఈహైపర్‌సోనిక్ ఆయుధాల్లో బాలిస్టిక్ క్షిపణుల్లో ఉండే వేగం.. క్రూజ్ క్షిపణుల్లో వలే మార్గం మార్చుకొనే లక్షణాలు ఉంటాయి. అందుకే ఇది అత్యంత ప్రమాదకరమైన ఆయుధంగా భావిస్తారు. వీటిల్లో అత్యంత శక్తివంతమైన స్క్రాంజెట్ ఇంజిన్లను వాడటంతో విపరీతమైన వేగాన్ని అందుకొంటాయి. ఈ ఇంజిన్లు వాతావరణం నుంచి ఆక్సిజన్‌ను పీల్చుకొని దానిలోని హైడ్రోజన్ ఇంధనంతో కలిపి శక్తిని సృష్టిస్తాయి. దీని సాయంతో అవి మాక్5 స్పీడ్‌ను అందుకొంటాయి. హైపర్‌సోనిక్ ఆయుధాలను ప్రత్యేక పరిస్థితుల్లో వినియోగిస్తారు. ముఖ్యంగా బాలిస్టిక్ క్షిపణులను మార్గం మధ్యలోనే ధ్వంసం చేసే అత్యాధునిక రక్షణ వ్యవస్థలను ఛేదించుకొని లక్ష్యాలను ధ్వంసం చేయడానికి వినియోగిస్తారు. వీటి ద్వారా అణ్వాయుధాలను కూడా ప్రయోగించవచ్చు. సుదూర లక్ష్యాలను ఛేదించవచ్చు. 2011లో అమెరికా విజయవంతంగా అడ్వాన్స్‌డ్ హైపర్‌సోనిక్ ఆయుధాన్ని పరీక్షించింది. ఇది 3,700 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని ఛేధించింది. అమెరికాలోని లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ దీనిని అభివృద్ధి చేస్తోంది. చైనా, రష్యాలు కూడా ఈ టెక్నాలజీలో బాగా ముందంజలో ఉన్నాయి.


## సచివాలయాల్లో రవాణా సేవలు




**అమరావతి, వార్తావళి, సెప్టెంబర్ 7 :** ఇక నుంచి లైసెన్సు, ఫిట్నెస్, వెహికల్ ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్ల జారీ డ్రైవింగ్ లైసెన్సు రెన్యువల్, వెహికల్ ట్రాన్స్ ఫర్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం వాహనదారులు నిన్నటి మొన్నటి వరకు రవాణా శాఖ కార్యాల యాల చుట్టూ ప్రదక్షణ చేసేవారు. కానీ నేడు ఈ సేవలన్నీ గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అందనున్నాయి. ఇప్పటి వరకు ఇంటర్నెట్ సర్వీస్ సెంటర్లు, మీ సేవ ద్వారా అందించే రవాణా సేవలన్నీ ఇకపై సచివాలయాల ద్వారానే అందించనున్నారు.

**అందుబాటులో 58 సేవలు:** రాష్ట్ర రవాణా శాఖ ఇప్పటి వరకు 85 రకాల సేవలు అందిస్తున్నది. వీటిల్లో సాధారణ ప్రజలకు అవసరమయ్యే 58 సేవలను గ్రామ, వార్డు సచివాలయాల నుంచి అందించనున్నారు. ఆన్లైన్ సేవలు, సర్టిఫికెట్ మంజూరు సచివాలయాల ద్వారానే జరుగుతాయని అధికారులు చెబుతున్నారు, ప్రధానంగా ఎఎస్ఆర్, డ్రైవింగ్ లైసెన్సుల ఆన్లైన్ దరఖాస్తులు, వాహనం చేతులు మారినప్పుడు ఇచ్చే బదిలీ ధ్రువ ప్రతం, వాహన యాజమాన్యాన్ని ధ్రువీకరించే ఓనర్ షిప్ రిజిస్టేషన్, వెహికల్ పర్మిట్, వాహన నాణ్యతను ధ్రువపరిచే ఫిట్నెస్ వంటి సేవలు ఇకపై సచివాలయాల్లో అందుబాటులోకి రానున్నాయి. టెస్టింగ్‌కు మాత్రం విధిగా రవాణా శాఖ కార్యాలయాలకు వెళ్లాల్సిందే.

## ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు కరోనా నెగెటివ్



**చెన్నై:** సుప్రసిద్ధ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు తాజాగా చేసిన పరీక్షల్లో కరోనా నెగెటివ్ వచ్చింది. ఈ విషయాన్ని ఆయన తనయుడు ఎస్పీ చరణ్ స్వయంగా వెల్లడించారు. ఈ మేరకు ఇన్‌స్టా వేదికగా వీడియోను పంచుకున్నారు. "నాన్న ఆరోగ్యం గురించి వారాంతంలో అప్‌డేట్ ఇవ్వకలేకపోయా క్షమించండి. ప్రస్తుతం ఆయన ఊపిరితిత్తుల పనితీరు మెరుగ్గా ఉంది. దాంతో వెంటిలేటర్ తొలగిస్తారని మేము భావించాం. అయితే, ఇంకా ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ ఉండటంతో వెంటిలేటర్ తీయడం సాధ్యపడలేదు. తాజాగా చేసిన పరీక్షల్లో నాన్నకు కరోనా నెగెటివ్ వచ్చింది" అని ఎస్పీ చరణ్ అన్నారు.

## త్వరలో జియో యూనివర్సిటీ..




'జియో' అంబానీలకు బాగా కలిసొచ్చిన పేరు. రిలయన్స్ సామ్రాజ్యంలో 'జియో' పేరుతో ముఖేష్ అంబానీ మొదలు పెట్టిన టెలికాం వ్యాపారం భారతదేశంలో డిజిటల్ విప్లవం సృష్టించింది. దీంతో ఆ తర్వాత క్రమంలోనే 'జియో మార్ట్' జియో ఆన్ లైన్ బిజినెస్ లలోకి ఎంట్రీ ఇచ్చారు. ఇప్పుడు మరో రంగంలోకి రిలయన్స్ దిగబోతోంది. త్వరలోనే జియో యూనివర్సిటీని స్థాపించబోతున్నట్టు జియో బోర్డు డైరెక్టర్ ఈశా అంబానీ తెలిపారు. పిల్లల ఆలోచన విధానాన్ని తీర్చిదిద్దే గొప్ప అవకాశం స్కూళ్ల ద్వారా వస్తుందని తెలిపింది.అందుకే ప్రపంచ స్థాయి యూనివర్సిటీలకు ధీటుగా జియో యూనివర్సిటీని నిర్మిస్తున్నామని అంబానీ కూతురు తెలిపింది. ఇక్కడ అన్ని రంగాలకు సంబంధించిన విద్య అందుబాటులో ఉంటుందని తెలిపింది. ఇప్పటికే రిలయన్స్ కు ధీరూభాయ్ స్కూల్స్ రిలయన్స్ ఫౌండేషన్ స్కూల్స్‌ను నడుపుతున్నారు.

## జీఎస్టీ అంటేనే ఆర్థిక వ్యవస్థ సర్వనాశనం



**దిల్లీ:** మోదీ నేతృత్వంలోని ఎన్‌డీయే ప్రభుత్వ విధానాలను లక్ష్యంగా చేసుకొని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న విమర్శల పరంపర కొనసాగుతోంది. తాజాగా వస్తు సేవల పన్ను(జీఎస్టీ)ని ఉద్దేశించి ఆయన సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. దేశ జీడీపీ కుచించుకుపోవడానికి కారణమైన వాటిలో జీఎస్టీ అమలు కూడా ఒకటని విమర్శించారు. దీని వల్ల చిరు వ్యాపారాలు ఛిన్నాభిన్నామయ్యాయని తెలిపారు. తద్వారా లక్షలాది ఉద్యోగుల, యువకుల భవిష్యత్తు గందరగోళంలో పడిందన్నారు. రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలు సైతం సంక్షోభంలో కూరుకుపోయాయన్నారు. 'జీఎస్టీ అంటేనే ఆర్థిక వ్యవస్థ సర్వనాశనం' అంటూ ట్విటర్ వేదికగా మండిపడ్డారు. దేశంలో 15-20 మంది బడా వ్యాపారవేత్తలకు ప్రభుత్వం పన్ను ఎగ్గొట్టే అవకాశం కల్పించిందని రాహుల్ ఆరోపించారు. వారెలా కావాలనుకుంటే అలా జీఎస్టీ విధానంలో మార్పులు చేయించుకుంటున్నారంటూ ఆరోపించారు. అదే రైతులు, కార్మికులు, చిరువ్యాపారులకు మాత్రం ఆ అవకాశం లేదన్నారు. జీఎస్టీ విఫల ప్రయోగమేకాక దేశ ఆర్థిక వ్యవస్థపై మూకుమ్మడి దాడి అని ఆరోపించారు. నేడు కేంద్రం జీఎస్టీ ఆదాయం సమకూర్చకపోవడంతో ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వాలు వేతనాలు ఇవ్వలేకపోతున్నాయని చెప్పుకొచ్చారు. జీఎస్టీ వల్ల పేద, మధ్య తరగతి ప్రజలతో పాటు చిన్న, మధ్య తరహా వ్యాపారులు సైతం తీవ్రంగా దెబ్బతిన్నారన్నారు.

**విలేకరులు కావలెను**

'వార్తావళి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు పశ్చిమగోదావరి, అనంతపురం, విశాఖ పశ్చిమం, తూర్పు, పాడేరు, అరకు ప్రాంతాల్లో నియోజకవర్గాల వారీగా జిల్లా ఇన్‌చార్జ్‌లుగా కమీషన్ పద్ధతిలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను. ఆసక్తి గల వారు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

7032034001, 8500159006

త్వరలో 'వార్తావళి' తెలుగు దినపత్రిక యూ ట్యూబ్ చానల్ ప్రారంభమవుతుంది.
ఎపిలో వివిధ జిల్లాల్లో, నియోజకవర్గాల వారీగా విలేకరులు కావెలెను.
యూ ట్యూబ్ చానల్‌లో పనిచేయుటకు ఆసక్తి గల అభ్యర్థులు కావలెను.
bulusu555@gmail.com
మెయిల్‌కి తమ బయోడాటా పంపించగలరు.
YouTube

# ఇంగ్లాండ్‌లో కత్తిపోట్ల కలకలం! పెద్ద ఘటనగా ప్రకటించిన బర్మింగ్‌హామ్ పోలీసులు



**ఇంగ్లాండ్:** బర్మింగ్‌హామ్ సిటీ సెంటర్లో వరుస కత్తిపోట్ల ఘటన కలకలం రేపింది. నగరంలోని సిటీ సెంటర్ ప్రాంతంలో కొందరు దుండగులు అక్కడేవున్న స్థానికులపై వరుస కత్తిపోట్లకు పాల్పడినట్లు వెస్ట్‌మిడ్‌లాండ్ పోలీసులు వెల్లడించారు. దుండగులు వరుసగా చాలామందిపై కత్తులతో దాడులకు పాల్పడి గాయపరిచినట్లు గుర్తించారు. అయితే, ఈ దాడులకు గల కారణాలు మాత్రం తెలియాల్సి ఉంది. గాయపడిన క్షతగాత్రులను వెంటనే సమీప ఆసుపత్రులకు తరలించారు. వీరిలో ఎంతమందికి ప్రాణాపాయం ఉందనే విషయాన్ని పోలీసులు వెల్లడించలేదు. కానీ, దీన్ని అతి పెద్ద ఘటనగానే బర్మాంగ్‌హామ్ పోలీసులు ప్రకటించారు. దాడులకు గల కారణాలను కనుగొనే పనిలో నిమగ్నమయ్యారు. తాజా ఘటనతో అప్రమత్తమైన పోలీసులు, సమీపంలోని రోడ్లన్నీ మూసివేసి దుండగుల కోసం గాలింపుచర్యలు చేపట్టారు. అంతేకాకుండా ఈ ప్రాంతంలో భారీగా భద్రతా ఏర్పాట్లు చేశారు. నగరంలో ఒక్కోసారి స్వల్ప ఘర్షనలు జరిగినప్పటికీ, ఈ తరహా సంఘటన మాత్రం ఎన్నడూ చూడలేదని ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు.

# ఆ రెండిటి మధ్య అత్యంత అరుదైన పోరు



**దిస్ఫూర్ :** రాయల్ బెంగాల్ టైగర్, అడవి పందికి మధ్య గొడవ జరిగితే ఏది గెలుస్తుంది? కచ్చితంగా పెద్దపులే అంటారందరూ. కానీ, మనం చెప్పుకోబోయే సంఘటనలో గెలుపు రెండిటిదీ కాదు.. చావుది. రెండిటికి మధ్య జరిగిన గొడవలో ఆ రెండూ మృత్యువాతపడ్డాయి. ఈ సంఘటన అస్సాంలోని జోర్‌హట్‌లో ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే.. అస్సాం, జోర్‌హట్ కొహోరా రిజర్వ్ ఫారెస్ట్‌లో కొన్ని రోజుల క్రితం రాయల్ బెంగాల్ టైగర్, అడవి పందుల మధ్య భీకర పోరు జరిగింది. పులి కడుపు భాగంలో, పంది శరీరం మొత్తం తీవ్రమైన గాయాలయ్యాయి. దీంతో ఆ రెండూ అక్కడికక్కడే మృత్యువాతపడ్డాయి. గత శనివారం కుళ్లిపోయిన స్థితిలో రెండు జంతువుల్ని గుర్తించారు అటవీ శాఖ సిబ్బంది. దీనిపై అటవీ శాఖ అధికారి ఒకరు మాట్లాడుతూ.. " కొహోరా రిజర్వ్ ఫారెస్ట్‌లో ఇలాంటి సంఘటన జరగటం ఇదే మొదటిసారి. అడవి పందితో పోట్లాడి రాయల్ బెంగాల్ టైగర్ మృత్యువాత పడింది" అని చెప్పారు.

# శత్రువు కంటికి చిక్కకుండా సరిహద్దుకు

## హిమాచల్ నుంచి లద్దాఖ్‌కు వ్యూహాత్మక రహదారి సిద్ధం!



**దిల్లీ:** సరిహద్దుల్లో చైనాతో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో వ్యూహాత్మక రహదారుల నిర్మాణాలను మన దేశం వేగవంతం చేసింది. ఇందులో భాగంగా సరిహద్దు రహదారుల సంస్థ (బీఆర్‌వో) అధిక సంఖ్యలో మానవ వనరులను సమకూర్చుకొని, అత్యాధునిక యంత్రాలతో రేయింబవళ్లు పనులు కొనసాగిస్తోంది. దీంతో హిమాచల్‌ప్రదేశ్ నుంచి లద్దాఖ్ వరకు కీలక రహదారి ఒకటి దాదాపుగా (30 కిలోమీటర్లు మినహా) పూర్తి కావొచ్చింది. సైనికులను సురక్షితంగా సరిహద్దులకు చేర్చగల వీలుండటం దాని ప్రత్యేకత. నిమ్ము-పదమ్-దార్చాగా పేర్కొనే ఈ రహదారి పొడవు 258 కిలోమీటర్లు. సరిహద్దుల్లో నిర్మిస్తున్న మూడో వ్యూహాత్మక రహదారి ఇది. మంచు కొడల మధ్య నుంచి వెళుంది కాబట్టి పొరుగు దేశాలు నిమ్ము-పదమ్-దార్చా రహదారిని గుర్తించలేవని బీఆర్‌వో తెలిపింది. కాబట్టి సైనికులను సురక్షితంగా సరిహద్దులకు చేర్చడం వీలవుతుందని వెల్లడించింది.

# బెంగళూరులో మహిళకు రెండోసారి కరోనా!



**బెంగళూరు:** 'కరోనా బారిన పడిన వారికి రెండోసారి మహమ్మారి సోకుతుందా?'ఈ ప్రశ్నకు విభిన్న సమాధానాలొస్తున్నాయి. కొందరు రెండోసారి కూడా వస్తుందంటే.. మరికొందరు ఆ అవకాశం చాలా తక్కువ అంటున్నారు. కానీ, ఈ మహమ్మారి రెండోసారి కూడా సోకిన ఉదంతాన్ని ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా గుర్తించినట్లు హాంకాంగ్ శాస్త్రవేత్తలు ప్రకటించడం, నెదర్లాండ్స్, బెల్జియంలోనూ ఇలాంటి రెండు కేసులు వెలుగు చూసినట్లు వార్తలు రావడంతో ఇది తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. తాజాగా బెంగళూరులోనూ 27 ఏళ్ల మహిళకు రెండోసారి కరోనా సోకినట్లు వైద్యులు గుర్తించారు. ఆమెకు గత జూలైలో కరోనా పాజిటివ్ రాగా చికిత్స చేయడంతో నయమైంది. నెల రోజుల తర్వాత ఆమెకు రెండోసారి కరోనా నిర్ధారణ అయ్యింది. " కరోనా లక్షణాలతో 27 ఏళ్ల మహిళ జులై మొదటి వారంలో ఆస్పత్రిలో చేరారు. ఆమెకు పరీక్షలు నిర్వహించిన తర్వాత పాజిటివ్ అని తేలింది. చికిత్స చేసిన అనంతరం మళ్లీ పరీక్షలు నిర్వహిస్తే నెగటివ్ రిపోర్టు వచ్చింది. జులై 24న ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశాము. నెల రోజుల తర్వాత ఆగస్టు చివరిలో మళ్లీ అదే లక్షణాలతో ఆస్పత్రికి వస్తే.. పరీక్షలు నిర్వహించాం. పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది" అని బెంగళూరులోని ఫోర్టిస్ ఆస్పత్రి వైద్యుడు ప్రతీక్ పాటిల్ మీడియాకు తెలిపారు. బెంగళూరులో రెండోసారి కరోనా సోకిన మొదటి వ్యక్తి ఈమే కావొచ్చని చెప్పారు. తాజా కేసులో రెండోసారి మహిళకు యాంటీబాడిస్ పరీక్షలో నెగటివ్ తేలిందని వైద్యులు వెల్లడించారు. దీనిని బట్టి వైరస్ సంక్రమించిన తర్వాత ఆమెకు వ్యాధి నిరోధక శక్తి పెరగకపోవడమైనా ఉండాలి. లేదంటే అభివృద్ధి చెందిన యాంటీబాడీస్ నశించిపోయి ఉండాలని వారు అభిప్రాయపడ్డారు. అయితే, కరోనా సోకిన వారందరికీ ఇది రెండోసారి సంక్రమిస్తుందని చెప్పలేమన్నారు. కరోనా ఇన్‌ఫెక్షన్ సోకిన కొందరికి వ్యాధి లక్షణాలు పూర్తిగా నయమైన కొన్ని వారాల తర్వాత తిరిగి 'పాజిటివ్'గా తేలుతున్న ఉదంతాలు ఇటీవల వెలుగు చూస్తున్నాయి. అయితే, అది వారి శరీరాల్లో ఇంకా మిగిలి ఉన్న వైరస్ అవశేషాలు లేక ఇన్‌ఫెక్షన్ తిరగబెట్టిందా లేక అది కొత్తగా సోకిన ఇన్‌ఫెక్షనా అన్నదానిపై శాస్త్రవేత్తల్లో స్పష్టత లేదు.

# దావూద్ మనిషినంటూ సీఎం ఇంటికి ఫోన్!



**ముంబయి:** దావూద్ మనిషిని అంటూ మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే నివాసానికి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేయడం కలకలం రేపింది. బాంద్రాలోని ఉద్ధవ్ వ్యక్తిగత నివాసమైన 'మాతోశ్రీ'కి శనివారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో రెండుసార్లు ఈ ఫోన్ వచ్చింది. దీంతో సీఎం నివాసం వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. దుబాయ్ నుంచి దావూద్ తరఫున మాట్లాడుతున్నానని, ఉద్ధవ్‌తో దావూద్ ఇబ్రహీం మాట్లాడాలని అనుకుంటున్నారన్నది ఆ ఫోన్ సారాంశం. అయితే, ఆ ఫోన్ ఎత్తిన వ్యక్తి సీఎంకు ఫోన్ ఇవ్వలేదు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎలాంటి కేసూ నమోదు చేయలేదు. ఫోన్ చేసిన వ్యక్తి ఎవరనేది తెలియరాలేదు.

# కరోనా కేసుల్లో ప్రపంచంలో 2వ స్థానం..!

## 24గంటల్లో 90వేల కేసులు, 1016 మరణాలు


## దేశవ్యాప్తంగా 32లక్షల మంది రికవరీ, 71వేల మరణాలు



**దిల్లీ:** భారత్‌లో కరోనా వైరస్ మహమ్మారి విలయతాండవం కొనసాగుతూనే ఉంది. నిత్యం 90వేలకు పైగా పాజిటివ్ కేసులు బయటపడుతున్నాయి. గడిచిన 24గంటల్లో అత్యధికంగా 90,802 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. 90వేల మార్కును దాటడం వరుసగా ఇది రెండోసారి. అంతకుముందురోజు కంటే మరో 170 కేసులు అదనంగా నమోదయ్యాయి. దీంతో సోమవారం ఉదయానికి భారత్‌లో కరోనా కేసుల సంఖ్య 42లక్షల 4వేల (42,04,613)కు చేరింది. ఈ సంఖ్యతో భారత్ కరోనా కేసుల్లో బ్రెజిల్‌ను దాటేసి ప్రపంచంలోనే రెండో స్థానానికి చేరింది. బ్రెజిల్‌లో ఇప్పటి వరకు 41లక్షల 37వేల కేసులు నమోదయ్యాయి. భారత్‌లో నమోదైన మొత్తం కేసుల్లో ఇప్పటికే 32లక్షల మంది కోలుకోగా మరో 8లక్షల 82వేల యాక్టివ్ కేసులు ఉన్నాయి. నిన్న మరో 69వేల మంది బాధితులు వైరస్ నుంచి కోలుకున్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. ప్రస్తుతం దేశంలో కరోనా బాధితుల రికవరీ రేటు 77శాతంగా ఉంది. ఇక దేశంలో కరోనా మరణాల సంఖ్య పెరగడం ఆందోళన కలిగిస్తోంది. దేశవ్యాప్తంగా ప్రతిరోజు సరాసరి వెయ్యి కొవిడ్ మరణాలు చోటుచేసుకుంటున్నాయి. నిన్న మరో 1016 మంది కరోనా రోగులు మృత్యువాతపడ్డారు. దీంతో ఇప్పటి వరకు దేశంలో కరోనా మరణాలసంఖ్య 71,642కు చేరింది. కొవిడ్ మరణాల్లో మాత్రం భారత్ ప్రపంచంలోనే మూడోస్థానంలో కొనసాగుతోంది.

# యూనిసెఫ్‌కు వ్యాక్సిన్ పంపిణీ బాధ్యత!

## ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత వేగవంతమైన ఆపరేషన్




**ఐరాస:** కరోనా మహమ్మారి నుంచి రక్షించే వ్యాక్సిన్ కోసం యావత్తు ప్రపంచం ఆశగా ఎదురుచూస్తోంది. ఇప్పటికే పలు టీకాలు తుది దశకు చేరుకోవడంతో ఆ ఆశలు రెట్టింపయ్యాయి. అయితే.. ప్రతి దేశపు అవసరాల్ని తీర్చే స్థాయిలో వ్యాక్సిన్ డోసులు ఎలా తయారు చేస్తారు? చేసిన వాటిని ఎలా పంపిణీ చేస్తారు? ముందు ఎవరికి ఇస్తారు? అన్న అంశాలపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సరైన నిర్వహణ లేకపోతే.. పేద దేశాలు తీవ్ర గడ్డు పరిస్థితులు ఎదుర్కోక తప్పదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ గురుతర బాధ్యతను యూనిసెఫ్ తన భుజాల మీదకు ఎత్తుకుంది. వ్యాక్సిన్ సేకరణ, పంపిణీ ప్రక్రియల్ని స్వయంగా నిర్వహించనుంది. ఇప్పటికే అనేక వ్యాధులకు సంబంధించి ఏటా 2 బిలియన్ డోసుల వ్యాక్సిన్లను ఈ సంస్థ కొనుగోలు చేస్తోంది. వీటిని దాదాపు 100 దేశాల్లో పిల్లలకు అందజేస్తోంది.

### ప్రపంచంలోనే అతిపెద్ద ఆపరేషన్..

తాజాగా కరోనా వ్యాక్సిన్ అభివృద్ధి, పంపిణీలో పరస్పరం సహకరించుకునేందుకు ఏర్పడ్డ కొవాక్స్ అనే 150 దేశాల కూటమి తరఫున యూనిసెఫ్ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టనుంది. ప్రపంచంలోనే ఇప్పటి వరకు ఇదే అతిపెద్ద, అత్యంత వేగవంతమైన ఆపరేషన్‌గా నిలవనున్నట్లు అంచనా వేస్తున్నారు. దీనికి రివాల్వింగ్ ఫండ్ ఆఫ్ ది ప్యాన్ అమెరికన్ హెల్త్ ఆర్గనైజేషన్(పీఏహెచ్‌వో) సహకారం తీసుకోనుంది. ఇందులో భాగంగా 92 దిగువ, దిగువ-మధ్యాదాయ దేశాలకు యూనిసెఫ్ తన సహకారంతో వ్యాక్సిన్ డోసుల్ని అందుబాటులో ఉంచనుంది. ఇక కొవాక్స్‌లో భాగంగా ఉన్న మరో 80 అధికాదాయ దేశాలకు వ్యాక్సిన్ కొనుగోలులో సమన్వయకర్తగా వ్యవహరించనుంది.

### అన్ని దేశాలకు సమానం అవకాశం..

ఈ బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ప్రభుత్వాలు, ఉత్పత్తిదారులు, పంపిణీ వ్యవస్థల సహకారంపైనే ఆధారపడి ఉందని యూనిసెఫ్ కార్యనిర్వాహక సంచాలకులు హెన్రియెటా ఫోరే తెలిపారు. వ్యాక్సిన్ అందుబాటులోకి రాగానే ప్రతి దేశ అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని అత్యంత భద్రంగా, వేగంగా టీకా అందేలా యూనిసెఫ్ జాగ్రత్తలు తీసుకుంటుందన్నారు. వ్యాక్సిన్‌ను అందిపుచ్చుకోవడంలో ప్రతిదేశానికి సమాన అవకాశాల్ని కల్పిస్తామన్నారు. ఈ క్రమంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ, గవీ ది వ్యాక్సిన్ అలయన్స్, ద కోలేషన్ ఫర్ ఎపిడెమిక్ ప్రిపేర్డ్‌నెస్ ఇన్నోవేషన్స్, పీఏహెచ్‌వో, ప్రపంచ బ్యాంక్, బిల్ అండ్ మిలిందా గేట్స్ ఫౌండేషన్ సహా మరికొన్ని ఇతర భాగస్వామ్య సంస్థల సహకారం తీసుకోకున్నట్లు తెలిపారు.

### నిధుల సమీకరణే కీలకం..

ఇప్పటి వరకు 28 తయారీ సంస్థలు 2023 వరకు తమ కరోనా వ్యాక్సిన్ తయారీ వార్షిక ప్రణాళికను తెలియజేశాయని హెన్రియెటా తెలిపారు. అయితే, భారీ స్థాయి ఉత్పత్తికి పెట్టుబడులు కూడా చాలా అవసరమని సంస్థలు అభిప్రాయపడ్డాయి. ఇక క్లినికల్ ట్రయల్స్ విజయవంతమైన వెంటనే జరగాల్సిన 'అడ్వాన్స్ పర్చేజ్ అగ్రిమెంట్స్', నిధుల సమీకరణ, నియంత్రణ, ధ్రువీకరణ వంటి ప్రక్రియలు కూడా ఓ కొలిక్కి వచ్చాయని యూనిసెఫ్ తెలిపింది. వ్యాక్సిన్ కోసం సొంతంగా నిధులు సమకూర్చుకునే సామర్థ్యం ఉన్న దేశాలు సెప్టెంబరు 18 నాటికి కొవాక్స్ కూటమిలో చేరాలని సూచించింది. తద్వారా భారీ ఎత్తున వ్యాక్సిన్ ఉత్పత్తికి సహకారం లభిస్తుందని అభిప్రాయపడింది.

# సురక్షితమని తేలేవరకు అనుమతి తీసుకోం!

## సంయుక్త ప్రకటన చేసే యోచనలో వ్యాక్సిన్ తయారీ సంస్థలు



**వాషింగ్టన్:** కరోనా వైరస్‌పై పోరులో భాగంగా ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు వ్యాక్సిన్ కోసం ఎదురు చూస్తున్న విషయం తెలిసిందే. ఈ సమయంలోనే వ్యాక్సిన్ పరిశోధనలో ముందున్న మూడు కంపెనీలు ఓ సంయుక్త ప్రకటన చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా తమ వ్యాక్సిన్ సురక్షితమైందని, సమర్థంగా పనిచేస్తుందని నిరూపితమయ్యే వరకూ ప్రభుత్వం ఆమోదం కోసం సంప్రదించవద్దని ఫైజర్, మోడెర్నా, జాన్సన్ జాన్సన్ కంపెనీలు ప్రజా ప్రతిజ్ఞ చేయనున్నట్లు సమాచారం. క్లినికల్ ప్రయోగాలతోపాటు వ్యాక్సిన్ తయారీలో అత్యున్నత శాస్త్రీయ పద్ధతులు, నైతిక ప్రమాణాలు పాటిస్తున్నామని చెప్పడంలో భాగంగానే ఈ ప్రజా ప్రతిజ్ఞ చేసేందుకు సిద్ధమైనట్లు ది వాల్‌స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. దీనికి సంబంధించిన ముసాయిదాను ఉటంకించిన సదరు వార్తా సంస్థ, రానున్న వారంలోనే ఈ కంపెనీలు హామీ ప్రకటన చేయనున్నట్లు తెలిపింది. అమెరికాలో సార్వత్రిక ఎన్నికలు నవంబర్ 3న జరగనున్న నేపథ్యంలో వ్యాక్సిన్ కోసం ఆయా కంపెనీలపై అక్కడి ప్రభుత్వం ఒత్తిడి తెస్తుందనే ఆందోళన మొదలైంది. వీటిని ఖండించిన వైట్‌హౌజ్ కూడా అలాంటి ఒత్తిడి ఏమీ లేదని స్పష్టంచేసింది. ఈ ఆరోపణల నేపథ్యంలోనే వ్యాక్సిన్ అభివృద్ధి కంపెనీలు ఈ సంయుక్త ప్రకటనకు సిద్ధమైనట్లు సమాచారం.

# నావల్నీ విషప్రయోగం కేసుపై రష్యా స్పందన



**మాస్కో :** రష్యా విపక్ష నేత అలక్సీ నావల్నీపై విషప్రయోగం జరిగిందనే ఆరోపణలపై దర్యాప్తును అడ్డుకునేందుకు జర్మనీ ప్రయత్నిస్తోందని రష్యా ఆరోపించింది. నవాల్నీ కేసుపై రష్యా వివరణ ఇవ్వాలని లేనిపక్షంలో ఆంక్షలు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని బెర్లిన్ హెచ్చరించిన నేపథ్యంలో మాస్కో స్పందించింది. రష్యన్ ప్రాసిక్యూటర్లు ఆగస్ట్ 27న పంపిన వినతిపై స్పందించడంలో జర్మన్ అధికారులు విఫలమయ్యారని రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మరియ జఖరవ ఆరోపించారు. సోవియట్ యూనియన్‌లో తయారయ్యే విషపూరిత రసాయనం నోవిచోక్‌ను నావల్నీపై మాస్కో ప్రయోగించిందనే ఆరోపణలపై రష్యా వివరణ ఇవ్వాలని జర్మన్ విదేశాంగ మంత్రి హీకో మాస్ డిమాండ్ చేసిన అనంతరం రష్యా ప్రతినిధి ఈ వ్యాఖ్యలు చేశారు. జర్మనీ ప్రభుత్వం తమ ప్రకటనలపై చిత్తశుద్ధితో ఉంటే రష్యా ప్రాసిక్యూటర్ జనరల్ కార్యాలయం పంపిన వినతపై సత్వరమే బదులిచ్చేదని మరియ ఎద్దేవా చేశారు. జర్మనీ డబుల్ గేమ్ ఆడుతోందా అనే సందేహాలు తలెత్తుతున్నాయని వ్యాఖ్యానించారు. గత నెలలో విమానంలో అస్వస్థతకు గురైన నావల్నీ ప్రస్తుతం సైబీరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా నావల్నీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వ్యతిరేక రాజకీయ శిబిరంలో ఉన్నారు. సైబీరియాలోని టోమ్స్క్ నగరం నుంచి మాస్కోకి విమానంలో వెళుతుండగా అనారోగ్యానికి గురవడంతో ఓమ్స్క్ నగరంలో విమానాన్ని అత్యవసర ల్యాండింగ్ చేసినట్లు నావల్నీ అధికార ప్రతినిధి కిరా యర్మిష్ ట్విట్టర్ ద్వారా వెల్లడించారు.

# ఇరాన్‌తో చర్చలు ఫలవంతం

## హటామితో రాజ్‌నాథ్ సింగ్



**టెహ్రాన్:** ఇరాన్ రక్షణ మంత్రి అమీర్ హటామితో భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ భేటీ అయ్యారు. ద్వైపాక్షిక సహకారం, ప్రాంతీయ భద్రత తోపాటు అఫ్గానిస్తాన్‌లో ప్రస్తుత పరిస్థితి తదితర అంశాలపై చర్చించారు. పలు అంశాలపై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నామని, ఈ చర్చలు ఫలవంతమయ్యా యని రాజ్ నాథ్ ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. రాజ్‌నాథ్ రష్యాలో మూడు రోజుల పర్యటన ముగించుకొని అక్కడి నుంచి శనివారం ఇరాన్‌కు వచ్చారు. ఇరాన్ రక్షణ మంత్రి వినతి మేరకే ఈ భేటీ జరిగిందని రక్షణ శాఖ తెలిపింది. ఇరువురు నేతలు సాంస్కృతిక, భాషా, పౌర సంబంధాలు తదితర అంశాలపై సుహృ ద్భావ వాతావరణంలో చర్చలు జరిపారని చెప్పింది. ప్రాంతీయ భద్రత, శాంతి పరిరక్షణ కోసం ఇరు దేశాల అధికారులు పరస్పరం సం ప్రదింపులు జరుపుతూనే ఉన్నారంది. 'ఈ రీజియన్‌లోని దేశాలతో భారత్ స్నేహ సంబంధాలను కోరుకుంటుంది. విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించుకునేందుకు , ద్వైపాక్షిక సంబంధాల్లో ఇతరుల జోక్యం నివారణకు కృషి చేస్తాం'అని రాజ్‌నాథ్ చెప్పారు. అంతర్యుద్ధం తో అతలా కుతలమవుతున్న అఫ్గానిస్తాన్‌లో పరిస్థితిపై భారత్ ఆం దోళ న వ్యక్తం చేసిన నేపథ్యంలో ఇరాన్ మంత్రితో భేటీ ప్రాధాన్యం సంత రించుకుంది. తాలిబాన్లు అమెరికాతో శాంతి ఒప్పందం కుదు ర్చు కు న్న తర్వాత రాజకీయ సుస్థిరత ఏర్పాటుపై భారత్ మరింత దృష్టిసారించింది.




## పాము పిల్లని నోట్లో పెట్టుకుని కొరికేసిన బాలుడు..



ఇంట్లో ఊహ తెలియని పిల్లలున్నప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. వారికి మంచీ చెడూ తెలియదు కాబట్టి చేతికి చిక్కిన వస్తువులను అమాంతం నోట్లో పెట్టుకొని మింగేస్తారు. అలా ఓ చిన్నారి ఏకంగా వస్తువులు కాదు కదా ఏకంగా పాము పిల్లనే నోట్లో పెట్టుకుని కొరికి నమిలేశాడు. నోట్లో పెట్టుకొని కొరికేసిన కాసేపటికే బాబు స్పృహ కోల్పోయాడు. బాబుని గమనించిన తల్లిదండ్రులు వెంటనే హాస్పిటల్‌కు తరలించారు. పాము చిన్నది కావడంతో విషం పెద్దగా శరీరంలోకి ప్రవేశించలేదని వైద్యులు తెలిపారు. చిన్నారి ప్రాణాలకే ముప్పు లేదన్నారు. ప్రస్తుతం బాలుడికి ట్రీట్‌మెంట్ ఇస్తూ అబ్జర్వేషన్‌లో పెట్టారు. పిల్లల విషయంలో జాగ్రత్త పాటించకపోతే వారి ప్రాణాలకే ముప్పు అని వైద్యులు తెలిపారు. ఈ సంఘటన ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ భోలాపూర్‌లో జరిగింది.

## స్పందన కార్యక్రమానికి 186 వినతులు

### జిల్లా రెవిన్యూ అధికారి బి.దయానిధి



**శ్రీకాకుళం, వార్తావళి, సెప్టెంబర్ 7 :** స్పందన కార్యక్రమానికి 186 వినతులు వచ్చినట్లు జిల్లా రెవిన్యూ అధికారి బలివాడ దయానిధి పేర్కొన్నారు. సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయంలోని స్పందన విభాగంలో స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రెవిన్యూ శాఖకు చెందినవి 33 కాగా, పౌర సరఫరాల శాఖవి 24, ఇతర శాఖలకు సంబంధించి 129 వినతులు ఉన్నాయన్నారు. కరోనా నేపథ్యంలో ప్రజలు జిల్లా ప్రధాన కేంద్రానికి రాకుండా ఫోన్ లేదా ఇ-మెయిల్ ద్వారా వినతులు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్ పిలుపునిచ్చిన సంగతి విదితమే. అందులో భాగంగా సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఫోన్ చేసి 186 మంది తమ ఫిర్యాదులను తెలియజేసారని చెప్పారు. వాటి వివరాలు ఇలా.. బూర్జ మండలం మామిడివలస నుండి కేదారినాథ్ సాహు ఫోన్ చేసి మాట్లాడుతూ యన్.టి.ఆర్. జలసిరి పథకం ద్వారా బోర్ కొరకు 25 వేల రూపాయల డిమాండ్ డ్రాఫ్ట్ ను చెల్లించడం జరిగింది. కాని అప్పటినుండి ఇప్పటివరకు అది పనిచేయడం లేదని ఫిర్యాదు చేసారు. ఎచ్చెర్ల మండలం ముద్దాడ నుండి యస్.మోహనరావు మాట్లాడుతూ తాను ప్రైవేటు పాఠశాలలో పనిచేసేవాడినని, కాని ఇప్పుడు తీసివేసారని, అందువలన ఎటువంటి జీవనాధారం లేకుండా పోయిందని చెప్పారు. కావున తనకు ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయం హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ అప్పారావు, స్పందన విభాగం భాస్కరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులను కాపాడుకోవాలిసిన బాధ్యత అందరిపై ఉంది

### డాక్టర్ ప్రసాద్



**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 7 :** ప్రస్తుత పరిస్థితుల్లో కరోనా నుండి వృద్ధులను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని ప్రముఖ వైద్యులు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పూర్వపు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వి.ఎస్.ప్రసాద్ అన్నారు సోమవారం అట్టాడ బీఎన్ఆర్ ఆశ్రమం లోని వృద్ధులకు ఉచిత వైద్య చికిత్స నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కరోనా వలనే రాష్ట్రంలో దేశంలో చాలా పెద్దస్థాయిలో వృద్ధులు మరణించారని ప్రజలు పూర్తిస్థాయిలో తమ ఆరోగ్యం పరిరక్షణకు సిద్ధంగా ఉండాలని,వైద్యరంగంలో అనేక మార్పులు వస్తున్నా అనుకున్న స్థాయిలో ప్రజలుకి చేరువ కాలేక పోతున్నామని, యువ తరం అభివృద్ధి చెందాలంటే వృద్ధులు అభిప్రాయాలను ఆచరణలో పెట్టాలని డాక్టర్ ప్రసాద్ అన్నారు బీఎన్ఆర్ ఆశ్రమం మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండటంతో ఇక్కడ వృద్ధులు ఆరోగ్యంగా ఉన్నారని ప్రతినెలా తనవంతు బాధ్యతగా చికిత్స చేస్తానని తెలిపారు, ఆశ్రమం నిర్వహకురాలు డాక్టర్ బాల భార్గవి మాటలాడుతూ ఈరోజు స్వర్గీయ బి.వరలక్ష్మి పేరున ఆమే భర్త చంద్రశేఖర్ వృద్ధులకు పండ్లు,దుస్తులు,అందచేశారని బీఎన్ఆర్ ఆశ్రమం ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తమ అభిమతమని అందుకే ప్రశాంత వాతావరణంలో ఆశ్రమం నిర్మించామని తెలిపారు,వృద్ధులకి పండ్లు,దుస్తులు, పంపిణీ అనంతరం డాక్టర్ వి.ఎస్.ప్రసాద్‌కి కమిటీ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ బుజ్జి,రాయి పద్మావతి, రెడ్డిపల్లి వెంకట్రావు, నమ్మి శ్రీను, పోటుపురెడ్డి సూర్యనారాయణ, మట్టా గోవింద్,బంటుపల్లి రమణారావు, రాజాన సత్యనారాయణ, పాల్గొన్నారు.

## జగన్ సర్కార్‌కు ఏపీ హైకోర్టు నుంచి మరో స్టే



**అమరావతి, వార్తావళి, సెప్టెంబర్ 7 :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సారథక్యంలోని రాష్ట్ర ప్రభుత్వానికి మరో ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం ఉద్యోగులపై కొనసాగుతోన్న సీఐడీ అధికారుల దర్యాప్తుపై ఏపీ హైకోర్టు స్టే మంజూరు చేసింది. వారిపై తదుపరి విచారణను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. దీనితో నిమ్మగడ్డ రమేష్ కుమార్ తొలగింపు, పునర్నియామకం వ్యవహారానికి తెర పడినట్టుగా భావిస్తున్నారు. ఈ విషయంలో ప్రతి అంశంలోనూ రాష్ట్ర ప్రభుత్వానికి చుక్కెదురైంది. ఈ వ్యవహారంలో హైకోర్టు నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి మరో స్టే జారీ అయింది. నిమ్మగడ్డ పిటీషన్‌పై విచారణ.. స్టే.. ఎన్నికల కమిషన్ కార్యాలయం ఉద్యోగులపై సీఐడీ విచారణ కొనసాగుతోన్న విషయం తెలిసిందే. దీన్ని నిలిపివేయాలంటూ నిమ్మగడ్డ రమేష్ కుమార్ ఇటీవలే హైకోర్టులో పిటీషన్‌ను దాఖలు చేశారు. ఎన్నికల కమిషన్ విధుల్లో ప్రభుత్వం జోక్యం చేసుకుంటోందని పేర్కొన్నారు. తన కార్యాలయం ఉద్యోగులపై సీఐడీ కేసు నమోదు చేసిన విషయాన్ని ఆయన హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల కమిషన్, ఉద్యోగులపై ప్రభుత్వం వేధింపు చర్యలకు పాల్పడుతోందని, ఇందులో భాగంగా వారిపై సీఐడీ ద్వారా కేసు నమోదు చేసిందని పేర్కొన్నారు. హార్డ్ డిస్క్.. పెన్‌డ్రైవ్ సాంబమూర్తి వినియోగించిన కంప్యూటర్ హార్డ్‌డిస్క్‌లోని కొంత కీలక సమాచారాన్ని సీఐడీ అధికారులు తమ వెంట తీసుకెళ్లారని, ఇది రాజ్యాంగ విరుద్ధమని నిమ్మగడ్డ తన పిటీషన్‌లో పేర్కొన్నారు. సాంబమూర్తిని సీఐడీ అధికారులు ఉద్దేశపూరకంగా వేధిస్తున్నారని, ఎన్నికల కమిషన్ నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులను తిరిగి ఇచ్చేలా సీఐడీ, ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి. రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి, పంచాయతీరాజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, సీఐడీ అదనపు డీజీ, తదితరులను ప్రతివాదులుగా పేర్కొన్నారు. కేంద్రానికి రాసిన లేఖ.. ఇదే అంశంపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం సహాయ కార్యదర్శి సాంబమూర్తి మరో పిటిషన్ దాఖలు చేశారు. ఈ రెండింటినీ ఏపీ హైకోర్టు విచారణకు స్వీకరించింది. సోమవారానికి వాయిదా వేసింది. దీనిపై కొద్దిసేపటి కిందటే విచారణను ముగించింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం ఉద్యోగులపై కొనసాగుతోన్న సీఐడీ విచారణపై స్టే ఇచ్చింది. తదుపరి విచారణను నిలిపివేయాలని పేర్కొంది. తనను తొలగించడాన్ని తప్పు పడుతూ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ఏపీ ప్రభుత్వంపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు లేఖ రాసిన విషయం తెలిసిందే. తదుపరి విచారణ నిలిపివేయాలంటూ.. ఆ లేఖ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తయారైందని, ఆయన దాన్ని తెప్పించుకుని కేంద్రానికి పంపారంటూ వైసీపీ నాయకులు విమర్శలు చేశారు. ఈ కేసు విచారణలో ఎన్నికల కమిషన్ సహాయ కార్యదర్శి సాంబమూర్తిని సీఐడీ అధికారులు విచారణకు పిలిపించారు. నిమ్మగడ్డ రమేష్ కుమార్ కేంద్రానికి పంపిన లేఖ బయటికి ఎలా వచ్చింది? ఎక్కడి నుంచి వచ్చింది, దాన్ని ఆయనే స్వయంగా రాశారా లేక ఎవరైనా పంపారా అనే కోణాల్లో సీఐడీ అధికారులు విచారణ కొనసాగించారు. ఈ విచారణపై తాజాగా ఏపీ హైకోర్టు స్టే మంజూరు చేసింది.

## కోవిడ్ నియంత్రణ సూచికల్లో ముందుండాలి

### జిల్లా కలెక్టర్ డా.హరిజవహర్ లాల్



**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 7 :** కోవిడ్ నియంత్రణ కోసం ప్రభుత్వం రూపొందించిన పలు సూచికల్లో జిల్లా మొదటి రెండు స్థానాల్లోనే వుండాలని జిల్లా కలెక్టర్ డా.ఎం.హరిజవహర్ లాల్ స్పష్టంచేశారు. నెలాఖరులోగా ఈ దిశగా ఫలితాలు సాధించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. కోవిడ్ నియంత్రణ సూచికల్లో జిల్లా పనితీరుపై అధికారులతో సోమవారంలోని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. నెలాఖరుకల్లా జిల్లాలో పాజిటివ్ కేసులు పదిశాతంకు మించకుండా చర్యలు చేపట్టాలన్నారు. కోవిడ్ నుండి కోలుకునే వారి శాతం 80 కు పెరగాలని చెప్పారు. మరణాల రేటు 0.2 కు తగ్గాలని పేర్కొన్నారు. జిల్లాలోని కోవిడ్ ఆసుపత్రులు, కేర్ సెంటర్ల ద్వారా వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న సేవలపై 90శాతం సంతృప్తి వ్యక్తం అయ్యేలా ఆయా సేవల్లో మెరుగుదల రావాలన్నారు. కోవిడ్ నియంత్రణలో టెస్టింగ్ కు ఎంతో ప్రాధాన్యత వుందని, పెద్ద సంఖ్యలో వ్యాధి లక్షణాలు వున్న వారి నుండి శాంపిల్స్ సేకరించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరపడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతిరోజు జిల్లాలో ఐదు వేల కరోనా నిర్ధారణ పరీక్షలు జరపాలన్నారు. ప్రతిరోజూ ఆర్.టి.పి.సి.ఆర్. ద్వారా వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం కనీసం 1500 శాంపిల్స్ సేకరణ చేయాలని, ట్రూనాట్ ద్వారా 500. ర్యాపిడ్ ఏంటిజెన్ టెస్టుల ద్వారా 2500 పరీక్షలు చేయాలని ఆదేశించారు. పాజిటివ్ గా వచ్చి ఇళ్లలోనే వుంటూ చికిత్స పొందుతున్న వారి పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వారికి వైద్య సిబ్బంది ద్వారా తగిన సూచనలు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్(సంక్షేమం) జె.వెంకటరావు, డి.ఎం.హెచ్.ఓ.డా.రమణ కుమారి, సి.పి.ఓ. విజయలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ డి.డి. సునీల్ రాజ్ కుమార్, అదనపు డి.ఎం.హెచ్.ఓ. డా.రవికుమార్, డి.సి.హెచ్.ఎస్. డా.నాగభూషణరావు, డా.గోపాలకృష్ణ, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సీతారామ రాజు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఐదు నెలల తర్వాత పట్టాలెక్కిన మెట్రో రైళ్లు.. ప్రయాణికులు మాత్రం నిల్!!



కరోనా వైరస్ మహమ్మారి కట్టడి కోసం కేంద్రం లాక్డౌన్ విధించింది. దీంతో గత ఐదు నెలలుగా దేశ వ్యాప్తంగా ప్రజా రవాణా బంద్ అయింది. వీటిలో మెట్రో రైల్ సర్వీసులు కూడా ఉన్నాయి. ఈ క్రమంలో సోమవారం నుంచి తొలుత మెట్రో రైల్ సర్వీసులకు కేంద్రం అనుమతి ఇచ్చింది. దీంతో సోమవారం నుంచి మెట్రో రైళ్లు పట్టాలెక్కాయి. అంటే 169 రోజుల తర్వాత ఢిల్లీ, చెన్నై, హైదరాబాద్, బెంగుళూరు వంటి నగరాల్లో మెట్రో పరుగులు తీసింది. మార్చిలో విధించిన లాక్‌డౌన్ నుంచి మెట్రో సర్వీసులు బంద్ అయ్యాయి. కరోనా వైరస్ నేపథ్యంలో పలు నగరాల్లోని మెట్రో సర్వీసులన్నీ రద్దు అయ్యాయి. అయితే అన్‌లాక్4 దశలో భాగంగా సోమవారం నుంచి ఢిల్లీ, నోయిడా, లక్నో, బెంగుళూరు, చెన్నై, కొచ్చి, హైదరాబాద్ నగరాల్లో మెట్రో సర్వీసులు ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమైన ఈ మెట్రో సర్వీసులు తొలి విడతలో భాగంగా మియాపూర్ - ఎల్బీనగర్ కారిడార్‌లో ప్రయాణికులకు మెట్రో రైళ్లు సేవలు అందిస్తున్నాయి. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు మెట్రో సర్వీసులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. దశవారీగా మూడు కారిడార్లలో మెట్రో సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈరోజు ఎల్బీనగర్ - మియాపూర్ కారిడార్‌లో ప్రారంభమవగా, రేపు నాగోల్ నుంచి రాయదుర్గం వరకు, ఈ నెల 9 నుంచి జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ కారిడార్‌లో సర్వీసులు అందుబాటులోకి వస్తాయి. కాగా, కంటోన్మెంట్ జోన్లుగా ఉన్న ప్రాంతాల్లో మెట్రో స్టేషన్లను అధికారులు మూసివేశారు. గాంధీ దవాఖాన, భరత్‌నగర్, మూసాపేట, యూసఫ్‌గూడా మెట్రో స్టేషన్లను మూసివేశారు. కరోనా నేపథ్యంలో ప్రయాణికులు సామాజిక దూరం పాటించేలా స్టేషన్లు, రైళ్లలో మార్కింగ్ ఏర్పాటు చేశారు. నగదు రహిత రూపంలో ప్రయాణం చేసేందుకు మాత్రమే అనుమతిస్తున్నారు. ఆన్‌లైన్, స్మార్ట్‌కార్డ్, క్యూఆర్‌కోడ్ టికెట్లతో మాత్రమే ప్రయాణికులకు అనుమతిస్తున్నారు. మెట్రో స్టేషన్‌లోకి రావాలంటే మాస్క్ తప్పనిసరి చేశారు. లేనట్లయితే అధికారులు జరిమానా విధిస్తున్నారు. ప్రతి ప్రయాణికుడిని స్క్రీనింగ్ చేసిన తర్వాతే స్టేషన్‌లోకి అనుమతిస్తున్నారు.

## లాక్ డౌన్ సమయంలో చేసుకున్న విమాన టికెట్ల బుకింగ్ డబ్బులు వాపస్




**కువైట్ సిటీ:** లాక్ డౌన్ సమయంలో టికెట్లు బుక్ చేసుకున్న వారికి ఛార్జీల డబ్బులను పూర్తిగా చెల్లించేందుకు డీజీసీఏ అంగీకరించింది. దేశీయ, విదేశీ ప్రయాణాలకు సంబంధించి మార్చి 25 నుంచి మే 3 మధ్య టికెట్లు బుక్ చేసుకున్న వాళ్లందరికీ ఆయా విమాన సంస్థలు వెంటనే డబ్బులు చెల్లిస్తాయని డీజీసీఏ సుప్రీం కోర్టుకు తెలిపింది. లాక్ డౌన్ సమయంలో దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దు కావటంతో అప్పట్లో టికెట్లు బుక్ చేసుకున్న వాళ్లంతా నష్టపోయిన విషయం తెలిసిందే. అయితే..విమాన సర్వీసులను రద్దు చేసినా ప్రయాణికులకు తిరిగి డబ్బులు చెల్లించటంపై విమానయాన సంస్థలు ఎలాంటి ప్రకటనా చేయలేదు. దీంతో కువైట్ లోని ప్రవాసీ లీగల్ సెల్ అనే ఎన్జీవోలు గత జూన్ 12 సుప్రీం కోర్టును ఆశ్రయించారు. రద్దు చేసిన డొమస్టిక్, ఇంటర్నేషనల్ ఫ్లైట్స్ కి సంబంధించి టికెట్లు బుక్ చేసుకున్నవాళ్లందరికీ పూర్తిగా డబ్బులు చెల్లించాలని తమ పిటిషనర్లు కోర్టును కోరారు. ఒకవేళ ఉన్నఫళంగా ప్రయాణికుల టికెట్ డబ్బులను తిరిగి చెల్లించలేని పక్షంలో భవిష్యత్తులో ఉచితంగా టికెట్లు ఇచ్చేలా ప్రస్తుత ఛార్జీ డబ్బులను క్రెడిట్ రూపంలో ప్రయాణికులకు అందించాలని తమ పిటిషన్ లో విజ్ఞప్తి చేశారు. మార్చి 31, 2021 వరకు క్రెడిట్ గడువు కొనసాగించాలని, ఒకవేళ అప్పటికే సదరు ప్రయాణికుడు..ప్రయాణం చేయాల్సిన అవసరం లేకపోవటం వల్ల టికెట్ బుక్ చేసుకోకుంటే..అతనికి 0.75% వడ్డీతో కలుపుకొని టికెట్ డబ్బులను విమానయాన సంస్థలు చెల్లించాలని కోరారు. పీటిషనర్ల అభ్యర్థనపై స్పందించిన అత్యున్నత న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వంతో పాటు విమానయాన సంస్థలకు నోటీసులు ఇచ్చింది. అదే సమయంలో లాక్ డౌన్ నాటి పరిస్థితుల దృష్టిలో ఉంచుకొని పిటిషనర్ దారులతో చర్చించి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించింది. సుప్రీం నోటీసులపై స్పందించిన కేంద్ర ప్రభుత్వం, డీజీసీఏ ప్రయాణికులకు టికెట్ ఛార్జీలను పూర్తిగా చెల్లించేందుకు సుముఖత వ్యక్తం చేసింది. అదేసమయంలో భారతకు సర్వీసులు నడిపిన విదేశీ విమానయాన సంస్థలకు కూడా ఇదే తరహా షరతులు వర్తించేలా ఆదేశించాలంటూ కోర్టును కోరింది.

## బాబుపై బొత్స పంచ్ అదిరింది



త్వరలోనే ఎన్నికలు వస్తాయని, వైసీపీ ప్రభుత్వం పనైపోతుందని చంద్రబాబు తన నోటికొచ్చినట్టు ఏదో మాట్లాడేశారు. ఫ్రీగా జూమ్ దొరకడంతో బాబు మాటలకు హద్దు-అదుపు ఉండడం లేదు. ఈ క్రమంలో మరో 24 నెలల్లో జగన్ సర్కార్ పనైపోతుందంటూ బాబు చేసిన అర్థంలేని వ్యాఖ్యలపై వైసీపీ మండిపడింది. తాజాగా దీనిపై మంత్రి బొత్స సత్యనారాయణ స్పందించారు. తనదైన శైలిలో బాబుపై పంచ్ వేశారు. "ప్రజాస్వామ్యంలో ఐదేళ్లకు ఒకసారి ఎన్నికలు అవుతాయి. కానీ మధ్యలోనే ఎన్నికలు రావాలనేది చంద్రబాబు ఆశ. అలా ఎందుకొస్తాయి. పోనీ ఒకవేళ వచ్చాయనే అనుకుందాం. ఇంకో ఐదేళ్లు చంద్రబాబు ప్రతిపక్షంలోనే ఉంటారు. అంతకుమించి పెద్ద మార్పు ఏం జరగదు. ఇది జగమెరిగిన సత్యం. బాబు ఏం ఉద్ధరించారని ఆయనకు జనం ఓట్లేస్తారని అనుకుంటున్నారో నాకైతే అర్థం కావడం లేదు." ఇలా బాబు గాలి తీసి పడేశారు బొత్స. మరోవైపు ఉచిత విద్యుత్ విధానంపై చంద్రబాబు చేస్తున్న ఆరోపణల్ని కూడా సక్సెస్ ఫుల్ గా తిప్పికొట్టారు బొత్స. జీవో నంబర్ 22ను ఉపసంహరించుకోవాల్సిన అవసరం లేదని.. మరో 30-35 ఏళ్ల పాటు రైతులకు ఉచిత విద్యుత్తుకు ఢోకా లేదని ప్రకటించారు. ఇకపై రైతులకు ఉచిత విద్యుత్ అంశానికి సంబంధించి ప్రభుత్వం రైతుల పేరిట ప్రత్యేక బ్యాంక్ ఖాతాలు తెరుస్తుంది. రైతులు ఎంత విద్యుత్ వాడితే ఆ మేరకు కరెంట్ బిల్లు మొత్తాన్ని ఆ ఖాతాలో ప్రభుత్వం జమచేస్తుంది. అది అట్నుంచి అటు నేరుగా సదరు విద్యుత్ సంస్థ ఖాతాకు చేరుతుంది. కేంద్ర సంస్కరణల్లో భాగంగా తీసుకురాబోతున్న ఈ విధానం వల్ల మరింత పారదర్శకత, జవాబుదారీతనం వస్తుంది. ఈ ప్రాజెక్టును ప్రయోగాత్మకంగా త్వరలోనే శ్రీకాకుళం జిల్లాలో ప్రవేశపెట్టబోతున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలనేది లక్ష్యం.

## అంబులెన్స్ బైక్ నడిపిన ఎమ్మెల్యే



సినీ నటి, నగరి ఎమ్మెల్యే, ఏపీఐఐసీ ఛైర్‌పర్సన్ ఆర్కే. రోజా చేసే ప్రతిపని వైరల్ అవుతోంది. ఏపీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి మంత్రివర్గంలో చోటు దక్కించుకోలేక పోయిన ఆమె.. ఏపీఐఐసీ ఛైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. అయినప్పటికీ, ఆమె ప్రతి నిత్యం మీడియాతో టచ్‌లో ఉంటున్నారు. తాజాగా అంబులెన్స్ బైక్ నడిపి మరోమారు వార్తలకెక్కారు. ఈ వివరాలను పరిశీలిస్తే, శ్రీసిటీ హీరో మోటార్ సంస్థ (నగరి).. పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రులకు రెండు అంబులెన్స్ బైక్‌లను ఎమ్మెల్యే ఆర్కే రోజా చేతులమీదుగా అందజేశారు. అనంతరం జెండా ఊపి వాటిని ప్రారంభించిన ఎమ్మెల్యే స్వయంగా నడిపి అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో శ్రీసిటీ హీరో మోటార్స్ మేనేజర్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోజా మీడియాతో మాట్లాడుతూ, సులభతర వాణిజ్యం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)లో రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలపడం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్.జగన్ దేశానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఇన్నాళ్లూ ప్రతిపక్ష నేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ రాష్ట్రం నుంచి పరిశ్రమలు వెళ్లిపోతున్నాయంటూ దుష్ప్రచారం చేశారు. వీరిద్దరి అబద్ధాలకు చెంపపెట్టులా పారిశ్రామికవేత్తలు సీఎం వైఎస్ జగన్‌పై సంపూర్ణ విశ్వాసాన్ని ప్రకటించారు. ఈ ర్యాంకును కూడా టీడీపీ తమ ఘనతేనని చెప్పుకోవడం వారి నీచ రాజకీయాలకు నిదర్శనమంటూ ధ్వజమెత్తారు.

## 2021 మొదట్లోనే చంద్రయాన్-3 ప్రయోగం.. జితేంద్ర సింగ్



చంద్రయాన్-2ను 2019 జూలై 22న ప్రయోగించారు. సెప్టెంబర్ 7వ తేదీన విక్రమ్ ల్యాండర్ చంద్రుడిపై కుప్పకూలింది. కానీ ఆర్బిటార్ మాత్రం డేటాను పంపిస్తూనే వుంది. మరోవైపు 2008లో ప్రయోగించిన చంద్రయాన్-1 పంపిన ఫోటోలు తాజాగా ఓ కొత్త విషయాన్ని తేల్చాయి. చంద్రుడి ధ్రువాలు తుప్పుపట్టిపోతున్నట్లు ఆ ఫోటోలు వెల్లడించాయి. నాసా శాస్త్రవేత్తలు కూడా దీన్ని ధ్రువీకరించారు. కాగా.. చంద్రయాన్-2ను 2019లో ఇస్రో ప్రయోగించిన విషయం తెలిసిందే. వాస్తవానికి చంద్రయాన్-3ని 2020లో లాంచ్ చేయాలనుకున్నారు. కానీ కరోనా వైరస్ వల్ల ఆ ప్లాన్ కాస్త జాప్యం అయ్యింది. లాక్‌డౌన్ వల్ల చంద్రయాన్-3 ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో చంద్రుడిపైకి చంద్రయాన్-3 మిషన్‌ను వచ్చే ఏడాది ఆరంభంలోనే ప్రయోగించనున్నట్లు భారత అంతరిక్ష శాఖకు చెందిన సహాయమంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. ఈ వ్యవహారంపై జితేంద్ర సింగ్ మీడియాతో మాట్లాడుతూ.. చంద్రయాన్-2తో పోలిస్తే చంద్రయాన్-3 భిన్నంగా ఉంటుందన్నారు. చంద్రయాన్-3లో ఆర్బిటర్ ఉండదన్నారు. కానీ ఆ ప్రాజెక్టులో ల్యాండర్, రోవర్ ఉన్నాయన్నారు. 2021 మొదట్లోనే చంద్రయాన్-3ను ప్రయోగించనున్నట్లు వెల్లడించారు.

# సంపాదకీయం

## పరిహారపు సుంకం

వస్తు,సేవల పన్ను (జిఎస్‌టి) పరిహారం సమస్య కేంద్ర–రాష్ట్ర సంబంధాల సమస్యగా రూపం తీసుకున్నది. కేంద్ర ప్రభుత్వం గత వారం చేసిన ప్రతిపాదనలకు వ్యతిరేకత ప్రధానంగా ప్రతిపక్ష ప్రభుత్వాల నుంచే వస్తున్నందున, ఇది రాజకీయ రూపం కూడా తీసుకుంటున్నది. జిఎస్‌టి బిల్లును ఆమోదించే విషయంలో, తక్కిన రాష్ట్రాల కంటె ముందుగా ఉత్సాహం ప్రదర్శించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ఇప్పుడు, పన్ను పరిహారం విషయంలో కేంద్రం వైఖరిని, ప్రతిపాదనలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. ఢిల్లీ, చత్తీస్‌గఢ్, బెంగాల్, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాలు ఇప్పటికే తమ వ్యతిరేకతను ప్రకటించాయి. జిఎస్‌టి పరిహారం రాష్ట్రాలకు చెల్లించవలసిందే అన్న వైఖరితో జిఎస్‌టి కౌన్సిల్ సమావేశానికి వెళ్లినా, మంత్రి చేసిన ప్రతిపాదనలపై మాత్రం ఇంకా స్పందించనే లేదు. కేంద్రం చెప్పిన షరతులకు అంగీకరించి, రుణసామర్థ్యాన్ని పెంచుకుంటే చాలునన్న ధోరణి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో కనిపిస్తున్నది. పాత పన్నుల వ్యవస్థ స్థానంలో వస్తు, సేవల పన్నును ప్రవేశపెట్టినప్పుడు, కొత్త వ్యవస్థలోకి మారే దశలో రాష్ట్రాలకు పరిహారం చెల్లించాలని భావించారు. జిఎస్‌టిలో 42 శాతం రాష్ట్రాల పన్ను ఆదాయమే. రాష్ట్రాల మొత్తం ఆదాయంలో 60 శాతం దాకా ఆ పన్నుల నుంచే లభించేది. జిఎస్‌టి వచ్చిన తరువాత, పెట్రోలియం, ఆల్కహాల్, స్టాంప్ డ్యూటీ మినహా తక్కిన పన్ను విధింపు అధికారాలన్నీ పోయాయి. జిఎస్‌టి (రాష్ట్రాలకు నష్టపరిహారం) చట్టం, 2017 ప్రకారం, కొత్త పన్నుల వ్యవస్థలోకి మారే సంధికాలం ఐదేళ్లలో, అంటే 2022 దాకా, రాష్ట్రాలు తాము నష్టపోయే పన్ను ఆదాయానికి పరిహారం ఖాయంగా లభిస్తుంది. 2015–16 ఆర్థిక సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకుని 14 శాతం వార్షిక వృద్ధి రేటును లెక్కిస్తూ, జిఎస్‌టి ఆదాయానికి, రక్షిత ఆదాయానికి మధ్య ఉన్న అంతరాన్ని పన్ను నష్టంగా పరిగణిస్తారు. ఈ నష్టం చెల్లింపుల కోసం జిఎస్‌టిపై పరిహారపు సుంకం విధిస్తారు. ఆ సుంకం కూడా 2022 దాకా కొనసాగుతుంది. ఆదాయం–నష్టం మదింపు రెండు నెలలకో సారి జరుగుతుంది. ఇప్పుడు కేంద్రం ఈ పరిహారాన్ని చెల్లించను పొమ్మంటున్నది. ఆర్థికంగా ఇబ్బందులుంటే, రాష్ట్రాలే మార్కెట్ నుంచి అప్పు తీసుకోండి అంటున్నది. పరిహారాన్ని చెల్లించడంలో ఇబ్బంది ఈ కరోనా కాలంలో మొదలయిందనుకుంటే, పొరపాటు. 2019 ఆగస్టులోనే సమస్య మొదలయింది. ఆగస్టు–సెప్టెంబర్ మాసాలకు ఇవ్వవలసిన పరిహారం ఆలస్యమయింది. సెప్టెంబర్‌లో గోవాలో జరిగిన 37వ జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో ప్రభుత్వం చెల్లించలేని అశక్తతను ప్రకటించింది. ఆ రెండు నెలల బకాయిని డిసెంబర్‌లో చెల్లించారు. తరువాతి రెండు నెలల చెల్లింపులను 2020 ఫిబ్రవరిలో చెల్లించారు. డిసెంబర్–జనవరి నెలలది మొన్న జూన్‌లో చెల్లించారు. ఇంతలో కరోనా సన్నివేశం అవతరించి, మునుపే మందకొడిగా ఉన్న ఆర్థిక వ్యవస్థకు లాక్‌డౌన్‌ను రుచిచూపింది. అనేక రాష్ట్రాలు దివాలా దశలో ఉన్నాయి. జీతాలు కూడా చెల్లించే స్థితిలో లేవు. పన్ను వసూళ్లే తగ్గిపోతున్నాయి. అంతో ఇంతో డబ్బు పోగేసుకున్న కేంద్రం రాష్ట్రాలకు ఇవ్వవలసిన బకాయిలు ఇవ్వకపోతే ఎట్లా? ఆగస్టు 27 నాడు జరిగిన తాజా జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో ఆ ప్రశ్న వేద్దామనే రాష్ట్రాలు వెళ్లాయి. కానీ, కరోనా 'దైవకృత్యం' అంటూ మంత్రి నిర్మలా సీతారామన్ పిడుగుపాటు లాంటి వ్యాఖ్య చేశారు. ఈ ఉపద్రవం, గత్తర దేవుడి కార్యమా కాదా అన్నది కాదు ఇక్కడ చర్చ. ఆ వ్యక్తీకరణ పరిహారాల చెల్లింపుల విషయంలో వాడే ఒక న్యాయపరిభాష. బీమా సేవలు అందించే కంపెనీలు పెద్ద ఉపద్రవాల సందర్భంగా పరిహారం నుంచి తప్పించుకోవడానికి చెప్పే కారణం. దైవకృత్యాలకు పరిహారం లభించదు. అంటే, పన్నురాబడి నష్టానికి పరిహారం ఇవ్వబోము. కావాలంటే అప్పు తీసుకోండి, ఏర్పాటు చేస్తాము. 14 శాతం వృద్ధి రేటును లెక్కించడం కుదరదు. పదిశాతమే లెక్కిస్తాము. మొత్తం లెక్కించే జిఎస్‌టి పరిహారం మొత్తం కాదు, అందులో కొంత భాగం మాత్రమే అప్పుగా తీసుకోవచ్చు. ఇంకా అవసరమైతే, షరతులు లేకుండా 0.5 శాతం అదనంగా రుణసదుపాయాన్ని అనుమతిస్తాము. దీనికి రాష్ట్రాలు వేయవలసిన ఎదురు ప్రశ్న– రుణం మేమెందుకు తీసుకోవాలి? కేంద్రమే ఎందుకు అప్పు తీసుకుని రాష్ట్రాల బాకీ చెల్లించదు? పరిహారం ఎగవేయడం కానీ, వృద్ధి రేటు ప్రాతిపదికను తగ్గించడం కానీ అంగీకారయోగ్యం కాదని నీళ్లు నమలకుండా చెప్పేశారు. కేరళ, బెంగాల్ రాష్ట్రాలు కూడా ఈ విషయంలో ఇంతే స్పష్టమైన వైఖరి తీసుకున్నాయి. ఇది కేంద్ర– రాష్ట్ర సంబంధాలకు సంబంధించిన సమస్య. రాష్ట్రాల పరిధిని, అధికారాలను తగ్గించి, దేశమంతా ఒకే ఛత్రాన్ని విస్తరింపజేయాలని ఆశిస్తున్న కేంద్రం ఉన్న చోట, ఇది అస్తిత్వానికి సంబంధించిన సమస్య కూడా. దేశమంతటికీ మూకుమ్మడి వ్యవస్థలను సృష్టించడంలో ఉన్న ప్రమాదం ఏమిటో జిఎస్‌టి అనుభవం తెలియజేస్తున్నది. ఒకే దేశం అయినందువల్ల కొన్ని అంశాలలో ఒకే అనుసంధాన వ్యవస్థ ఉండవచ్చు. కానీ, అనేక పాలనాంశాలలో సువిశాల దేశానికి వికేంద్రీకృత విధానమే మేలయినది.

# గంగను చూసిన దేవుడు

(నిన్నటి తరువాయి)



అడుగడుగునా కన్నీటిచారికలే! ఘడియఘడియకీ గుండెలదిరే దృశ్యాలే! చూడలేనన్నట్టుగా కళ్ళు మూసుకున్నాడు రాముడు. ఏరులు వేదవతీ, గోమతులను దాటింది రథం. స్యందికానదీతీరం చేరుకుంది. కళ్ళు విప్పి చూశాడు రాముడు. అంతటా ఆనందంగా ఉంది ఆ ప్రదేశం. చిలుకలు, కోకిలలు, నెమళ్ళ ధ్వనులతో వినసొంపుగా ఉంది. "సీతా! మా వంశకర్త మనువు, కోసలదేశానికి దక్షిణపు ఎల్లగా నిర్ణయించింది ఈ నదీతీరాన్నే. ఆవలితీరం రాజ్యాలను పాలించే రాజులు, మాకు కప్పాలు చెల్లిస్తారు." అని చెబుతూ కళ్ళు చెమర్చుకున్నాడు రాముడు. "స్వామీ" ఆందోళన చెందింది సీత. "తల్లిదండ్రులతో సరయూతీరంలో సంచరించే భాగ్యం నాకిక లేదనిపిస్తోంది. ఏ పాపం చేసుకున్నానో... అడవుల పాలవుతున్నాను." అన్నాడు రాముడు. రథాన్ని ఆపమన్నట్టుగా, సుమంత్రుని భుజాన్ని నొక్కి వదిలాడు. రథం ఆగింది. ఆగిన రథంలోంచి భారంగా దిగాడు రాముడు. అయోధ్యవైపునకు తిరిగాడు. చేతులు జోడించి, ఆ నగరానికి నమస్కరించాడు. "ఇక్ష్వాకువంశానికి చెందిన ఎందరో మహాత్ములు పాలించిన ఓ నగరమా! నా వనవాసదీక్షను ఆశీర్వదించు. సీతాలక్ష్మణులతో నేను మళ్ళీ తిరిగొచ్చి నిన్నుచూసే అదృష్టాన్ని నాకు ప్రసాదించు." అన్నాడు రాముడు. దుఃఖం ఎగదన్నడంతో కన్నీరుపెట్టుకుని దగ్గుతూ రథచక్రాన్ని ఆనుకున్నాడు. ఓదార్పుగా అతన్ని దగ్గరగా తీసుకున్నాడు లక్ష్మణుడు. రథాన్ని అధిరోహింపజేశాడు. "పోనీయ్" అన్నాడు సుమంత్రునితో. రథం కదిలింది. తోటలు, తోపులు, నదులు, ఉపనదులు, తటాకాలు, వందలు వేలాదిగా ఆల మందలు, పట్టణాలు, పల్లెలుగల సర్వసౌభాగ్యవంతమైన కోసలదేశాన్ని దాటిపోయింది రథం. గంగాతీరానికి సమీపించింది. శృంగిబేరపురానికి చేరువైంది. అక్కడ గంగానదిని కనుల విందుగా చూడగలిగే ఎత్తయిన ప్రదేశంలో రథాన్ని ఆపాడు సుమంత్రుడు. మిత్రుడు గుహుడు నివసించే ప్రాంతం అది, గుండె చల్లబడింది రాముడికి. సీతాలక్ష్మణులసహా రథాన్ని దిగి నిల్చున్నాడతను. గంగను తనవితీరా చూడసాగాడు. దివ్యలోకంలో నారాయణుని పాదాల్లో జన్మించింది. పరమశివుని జటల్లోంచి పొంగి ప్రవహించింది. భాగీరథి అయింది. ఎందరినో పావనులను చేస్తూ తాను ప్రవహించిన ప్రదేశమంతా సస్యశ్యామలం చేస్తున్న నదీమతల్లి గంగను గుండెలు ఉప్పొంగగా చూసి ఆనందించాడు రాముడు. సుడులు తిరుగుతూ గంగ, ఎత్తుల నుండి కిందికి జారుతూ ఘోషిస్తూ గంగ, గంభీరంగా గంగ, నిదానంగా నిలిచి పారుతూ గంగ, ఎన్ని కళలో, ఎన్నెన్ని రూపాలో ఈ తల్లికి అనుకున్నాడు రాముడు. చేతులు జోడించి నమస్కరించాడు. సీతాలక్ష్మణ సుమంత్రులు కూడా గంగను చూసి తలలు వంచి నమస్కరించారు.

**గుహుని ఆతిథ్యం: సుమంత్రుని దైన్యం**

రామరథం కోసలదేశం దాటిపోయింది. శృంగిబేరపురం చేరింది. అది మిత్రుడు గుహుడు నివసించే ప్రాంతం. అక్కడ రథాన్ని ఆపాడు సుమంత్రుడు. సీతారామలక్ష్మణులు రథం దిగారు. గలగలా పారుతున్న గంగను చూశారు. చేతులు జోడించి ఆ నదీమతల్లికి నమస్కరించారు. ఆప్త మిత్రుడు రాముడు వస్తున్నాడన్న వార్త ముందే తెలియడంతో స్వాగత సన్నాహాలు చేశాడు గుహుడు. ఎక్కడపడితే అక్కడ తోరణాలు కట్టాడు. జెండాలు ఎగురవేశాడు. రాముడి కోసం నిరీక్షిస్తూ కూర్చున్నాడు. ఎవరో చెప్పారు, రాముడు వచ్చాడని. అంతే! మంత్రులూ, బంధువులూ, హితులతో రాముణ్ణి ఆహ్వానించేందుకు పరుగున బయల్దేరాడు. గుహుణ్ణి అల్లంత దూరంలో చూసి, రామలక్ష్మణులు ఎదురేగారతనికి. మునివేషాల్లో వస్తున్న రామలక్ష్మణులను చూసి కళ్ళు చెమర్చుకున్నాడు గుహుడు. దుఃఖంతో శరీరం కంపించడంతో ఆగిపోయాడు. అతన్ని సమీపించాడు రాముడు. "మిత్రమా" పిలిచాడు. "ప్రభూ" అన్నాడు గుహుడు. కన్నీటిని తుడుచుకున్నాడు. "నా అదృష్టం రామయ్యా! నువ్వు నా దగ్గరకు వచ్చావు. ఎంత ఆనందంగా ఉందో?" అన్నాడు. "రామయ్యా, రా" అని స్వాగతం పలికాడు. "రాజ్యం లేదని బాధపడకు రామయ్యా! నా రాజ్యం నీది కాదా? నా రాజ్యం తీసుకో, నన్నేలుకో." అన్నాడు. ఆ మాటలకి నవ్వుకున్నాడు రాముడు. "ఎప్పుడు తిన్నావో ఏమో! భోంచేద్దూగాని రా! భోంచేసి, కాసేపు పడుకుందూగాని." అన్నాడు గుహుడు. లక్ష్మణుడు గుర్రాల కేసి చూశాడు. అది అర్థం చేసుకున్నట్టుగా అన్నాడిలా గుహుడు. "గుర్రాలకు కూడా మేతలు సిద్ధంగా ఉన్నాయయ్యా." ఆ మాటలకి రామలక్ష్మణులు ఒకరిని చూసి ఒకరు నవ్వుకున్నారు. గుహుణ్ణి దగ్గరగా తీసు కున్నాడు రాముడు. గట్టిగా కౌగిలించుకున్నాడతన్ని. చేతులు పట్టి దూరంగా నిలిపి, అన్నాడిలా. "బాగుంది మిత్రమా! నిన్నూ, నీ బంధువుల్నీ, మంత్రుల్నీ చూస్తోంటే బాగుంది.

(మిగతా రేపటి సంచికలో)

చరిత్రలో సెప్టెంబర్

# త్రిపురనేని గోపీచంద్ జయంతి

**అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం**

**ప్రపంచ శారీరక చికిత్స దినోత్సవం (ఫిజియోథెరపీ డే)**

**1879 : పరిపాలనా దక్షుడు మరియు పండితుడు మొక్కపాటి సుబ్బారాయుడు జననం (మ.1918).**

**1910 : ప్రముఖ తెలుగు రచయిత, తెలుగు సినిమా దర్శకుడు త్రిపురనేని గోపీచంద్ జననం (మ.1962).**

**1931 : ఆంధ్రప్రదేశ్ స్పీకరుగా పనిచేసిన తంగి సత్యనారాయణ జననం (మ.1984).**

**1933 : ప్రముఖ హిందీ సినిమా గాయని ఆశా భోస్లే జననం.(చిత్రంలో)**


**1933 : ప్రముఖ పారిశ్రామిక వేత్త కరుటూరి సూర్యారావు జననం (మ.2011).**

**1936 : ప్రముఖ సంగీత దర్శకుడు చక్రవర్తి జననం (మ.2002).**

**1963 : తెలుగు సినిమా దర్శకుడు గరికపాటి రాజారావు మరణం (జ.1915).**

**2012 : ప్రముఖ శాస్త్రవేత్త మరియు రచయిత కొడవటిగంటి రోహిణీప్రసాద్ మరణం (జ.1949).**

**1960 : ఫిరోజ్ గాంధీ మరణం (జ.1912).**



గోపీచంద్ 1910, సెప్టెంబర్ 8న కృష్ణా జిల్లా అంగలూరు గ్రామములో జన్మించాడు. ఈయన తండ్రి ప్రముఖ సంఘ సంస్కర్త త్రిపురనేని రామస్వామి. గోపీచంద్ తన జీవితంలో చాలా సంఘర్షణను అనుభవించాడు. అనేక వాదాలతో వివాదపడుతూ, తత్త్వాలతో దాగుడుమూతలాడుతూ, సంతృప్తిలోనూ అసంతృప్తిలోనూ ఆనందాన్నే అనుభవిస్తూ జీవయాత్ర కొనసాగించాడు. తన తండ్రినుంచి గోపీచంద్ పొందిన గొప్ప ఆయుధం, ఆస్తి, శక్తి ఎందుకు? అన్న ప్రశ్న. అది అతన్ని నిరంతరం పరిణామానికి గురిచే సిన శక్తి. అతనిలోని అరుదైన, అపురూప మైన, నిత్యనూతనమైన అన్వేషణాశీలతకి ఆధారం. ఎందుకు? అన్న ప్రశ్నే అతన్ని ఒక జిజ్ఞాసువుగా, తత్త్వవేత్తగా నిలబెట్టింది. ఈ క్రమంలో అతనిలో చెలరేగిన సంఘర్షణ అతని నవలలన్నింటిలోనూ ప్రతిఫలించింది. గోపీచంద్ రచనలలో విలువల మధ్య పోరాటం ముఖ్యముగా చెప్పుకోతగినది. ఆయన వ్రాసిన అసమర్థుని జీవయాత్ర తెలుగులో మొదటి మనో వైజ్ఞానిక నవల. 1963లో పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామాకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. 8–సెప్టెంబర్–1910 నాడు గోపీచంద్ జన్మించాడు. సుప్రసిద్ధ రచయిత, హేతువాది, సంస్కరణవాది అయిన త్రిపురనేని రామస్వామి ఆయన తండ్రి, తల్లి పున్నమాంబ. హేతువాద నాస్తికత్వపు భావజాలాల వాతావరణంలో పెరిగిన గోపీచంద్ పై వాటి ప్రభావం సహజంగానే పడింది. అయితే తరువాతి కాలంలో ఆయన ఆస్తికుడిగా మారాడు. 1932 లో వివాహంబీ 1933లో బి,ఏ పట్టా, ఆ తర్వాత లా డిగ్రీ. కొంతకాలం పాటు న్యాయవాదిగా ప్రాక్టీసు పెట్టినా ఆ వృత్తిలో ఇమడలేక పోయాడు. ఈ దశలో ఆయన కమ్యూనిజం (మార్క్సిజం) పట్ల ఆకర్షితుడయ్యాడు. కానీ అందులోని అరాచకత్వం ఆయనకు నచ్చలేదు. ఆ తర్వాత ఎం.ఎన్.రాయ్ మానవతా వాదం ఆయన పై గొప్ప ప్రభావాన్ని చూపింది. ఈ కాలంలో ఆయన ఆంధ్రా రాడికల్ డెమొక్రటిక్ పార్టీ కార్యదర్శిగా పనిచేసాడు. 1928లోనే శంబుక వధ కథ ద్వారా సాహిత్యరంగంలోకి ప్రవేశించిన గోపీచంద్ 1938లో పట్టాభి గారి సోషలిజం అన్న పుస్తకాన్ని వెలువరించాడు. తొలుత కథా సాహిత్యంలో స్థిరపడ్డ గోపీచంద్ ఆ తర్వాత నవలా సాహిత్యరంగంలోకి అడుగుపెట్టాడు. ఆయన తొలి నవల పరివర్తనం (1943). 1939లో చలనచిత్ర రంగంలోకి ప్రవేశించిన గోపీచంద్ దర్శకనిర్మాతగా కొన్ని చిత్రాలను నిర్మించాడు. అయితే వాటివల్ల ఆర్థికంగా చాలా నష్టపోయారు. 1953లో ఆంధ్రరాష్ట్ర సమాచార శాఖ డైరెక్టర్ గా, 1956లో ఆంధ్ర ప్రదేశ్ సమాచార శాఖ సహాయ డైరెక్టర్ గా పనిచేసాడు. 1957–62 వరకు ఆకాశవాణిలో పనిచేసాడు. ఈ దశలో అరవిందుని భావాల పట్ల విశ్వాసం ఏర్పడడంతో ఆధ్యాత్మికవాదం వైపుకి పయనించాడు. 1962 నవంబర్ 2 నాడు గోపీచంద్ మరణించాడు. భారత ప్రభుత్వ ము 2011 సెప్టెంబరు 8న గోపీచంద్ శతజయంతి సందర్భమున తపాలా బిళ్ళ విడుదల చేసింది. గోపీచంద్ చిన్నతనములోనే తల్లిని పోగొట్టుకున్నాడు. ఇంటి పనులతో పాటు, తండ్రి నాస్తికోద్యమమునకు సహాయము చేయటం లాంటి పనులతో అతని బాల్యం చాలా గడచి పోయింది. అటు తర్వాత, మద్రాస్ లో లా చదువుకున్నాడు. అతని మీద చాలా కాలము ఆయన నాన్న ప్రభావం ఉండేది. ఆయన మొదట వ్రాసిన చాలా నవలలో మార్క్సిస్టు భావాలు మనకు పూర్తిగా కనిపిస్తాయి. ఆయన వ్రాసిన "మెరుపుల మరకలు" అనే గ్రంథంలో గాంధీరామయ్య అనే ఒక పాత్ర ఉంది.

# అనుగ్రహ సాధన మన చేతుల్లోనే!

అనుగ్రహం అనేది ఒకప్పుడు ఉండి మరొకప్పుడు లేకపోవడం లాంటిది కాదు. నిజానికి అది ఎప్పుడూ మీ వెంటే ఉంటుంది. కాకపోతే, దానిని గ్రహించడానికి మిమ్మల్ని మీరు సుముఖులు చేసుకోవడమే తరువాయి. నేను దీనిగురించి ఏం చెప్పినా దానిని మీరు అపార్థమే చేసుకుంటారు. ఎందుకంటే, తార్కిక, భౌతిక పరిమితుల్లో లేనిదానిని వాస్తవానికి మాటల్లో చెప్పలేం. మీలో ప్రధానంగా రెండురకాల 'ఆకాంక్షలు' ఉంటాయి. ఒకటి: 'ఆత్మసంరక్షణ', రెండు: 'వ్యాప్తి చెందడం'. మీలోని 'ఆత్మ సంరక్షణ' స్వభావం, మీ చుట్టూరా గోడలు కట్టుకుని మిమ్మల్ని రక్షించుకోమని చెబుతూ ఉంటుంది. ఇక, మీలోని మరో భాగమైన 'వ్యాప్తి చెందడం' అనేది ఎల్లప్పుడూ వ్యాప్తి చెందాలని (ఎదుగుదల) ఆకాంక్షిస్తూనే ఉంటుంది. నిజానికి ఈ రెండూ కూడా ఒక దానికి ఒకటి వ్యతిరేకమైన శక్తులు కూడా కావు. ఒక ఉదాహరణగా చెప్పాలంటే వీటిని 'గురుత్వాకర్షణ, అనుగ్రహం'తో పోల్చి చెప్పవచ్చు. ఐతే, ఇది కేవలం ఒక ఉపమానం మాత్రమే! అనుగ్రహం, వ్యాప్తి చెందడం అనే ఈ రెండు లక్షణాలు మీ జీవితంలోని రెండు అంశాలకు చెందినవిగా మీరు తెలుసుకోండి. 'అనుగ్రహ సాధన'కు ఏం చేయాలి?' ఇది చాలా ప్రధానమైన ప్రశ్న. చాలామందికి తెలుసుకోవాలనే ఆసక్తి ఉంటుంది. కానీ, దానికి తగిన 'ఆచరణ తప్పనిసరి' అని మరిచిపోకూడదు. 'అనుగ్రహ సాధన' వాస్తవానికి మన చేతుల్లోనే ఉందన్న విషయాన్ని ముందు మనం తెలుసుకొందాం. అందుకోసం ఏం చేయాలి? అంటే, ముందు మీరు ఈ అస్తిత్వానికి



చెందిన భౌతికశక్తుల నుంచి విముక్తులు కావాలి. అప్పుడు మీ జీవితంలో 'అనుగ్రహం' దానంతటదే వెల్లివిరుస్తుంది. అంత సహజసిద్ధంగా అది లభిస్తుంది కూడా. 'ఆత్మ సంరక్షణ' అన్నది కేవలం శరీరానికి పరిమితమై ఉండాలి. మీ శరీరానికి మాత్రమే సంరక్షణ అవసరం. ఇది తెలుసుకోం డి. మిగతావన్నీ కూడా మనం ఎలా మార్చేసినా, ఎలా కూలదోసినా, మరుసటిరోజు అవసరమైతే వాటిని పునః నిర్మించుకోవచ్చు. కావాలనుకుంటే మీరు లేచిన తర్వాత ప్రతి రోజూ ఉదయాన్నే మీరొక 'కొత్త వ్యక్తిత్వాన్ని' నిర్మించుకోనూ వచ్చు. 'ఆత్మ సంరక్షణ' (గురుత్వాకర్షణ) అన్నది మిమ్మల్ని కిందికి లాగుతుంటుంది. 'అనుగ్రహం' (ఎదుగుదల) అన్నది మిమ్మల్ని పైకి లేవనెత్తాలని చూస్తుంటుంది. మీరు ఈ అస్థిత్వపు భౌతికశక్తుల నుంచి విముక్తులయ్యారనుకోండి, అప్పుడు మీ జీవితానికి 'అనుగ్రహం' సిద్ధిస్తుంది. నిజానికి 'అనుగ్రహం' అన్నది ఎక్కడి నుంచో వచ్చేది కాదు. మీరు మీ క్యాలెండరులో చూసినట్లు, అందులోని ఫొటోలో ఉన్నట్లుగానే.. 'అనుగ్రహం అలా ఒక కాంతి పుంజంలోని కిరణాల్లాగా ఒక మనిషి వైపు రావడం, జాలు వారడం' చూస్తారు. కానీ, నిజానికి ఇది అలాంటిది కాదు. గురుత్వాకర్షణ ఎప్పుడూ ఎలాగైతే మన చుట్టూ పనిచేస్తూనే ఉంటుందో, అనుగ్రహం కూడా ఎల్లవేళలా పనిచేస్తూనే ఉంటుంది. మిమ్మల్ని మీరు, అందుకు పాత్రులుగా చేసుకోవడమే తరువాయి. అంతే! అయితే, గురుత్వాకర్షణలో మీవైన సొంత ఇష్టాయిష్టాలు లేవు, ఉండవు. ఎలా అయినా సరే, మీరు దానికి పాత్రులే! కానీ, అనుగ్రహంతో అలా కాదు మరి. మీరు అందుకు సుముఖులుగా, అది గ్రహించేందుకు అనువుగా సిద్ధం కావాలి. కనుక, అది మీ చేతుల్లోనే ఉందన్న సంగతి ఇప్పుడు అర్థమైందనుకొంటాను. ఇంకెందుకు ఆలస్యం? ప్రయత్నించండి మరి. ప్రేమాశీస్సులతో..

# అరటిపండుతో ఆరోగ్య ప్రయోజనాలెన్నో..!



ప్రతి సీజన్‌లో అందుబాటులో ఉండే అరటి పండుతో ఆరోగ్య ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయి. అందుకే దీన్ని ప్రతిరోజూ తీసుకోవా లని డాక్టర్లు సూచిస్తున్నారు. ఇందులో కార్బోహైడ్రేట్స్, ప్రొటీన్స్ పుష్కలంగా ఉంటాయి. ఇది సులభంగా జీర్ణమవుతుంది. మలబద్ధకం ఉన్నవారికి మేలు చేస్తుంది. బలవర్ధకమైన పండు. అజీర్తిని పోగొట్టి, శరీరానికి మేలు చేస్తుం ది. అందుకే హిందూ సంప్రదాయంలో ఏ శుభకార్యానికైనా ఈ పండునే ఎక్కువగా ఉపయోగి స్తారు. దీని మరిన్ని ప్రయోజనాలు తెలుసుకుం దాం.. ఇందులో పొటాషియం ఎక్కువ మోతాదులో ఉంటుంది. ఎముకలు, దంతాలకు చాలా మంచిది. శరీర కండరాల్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. అరటి పండులో ఉండే పోషకాలు మధుమేహం, ఆస్తమా, అధిక రక్తపోటు, క్యాన్సర్‌ను నివారిస్తాయి. కిడ్నీల ఆరోగ్యానికి ఇది ఉపకరిస్తుంది. వారానికి రెండు లేదా మూడు అరటి పండ్లు తినడం వల్ల మహిళలు కిడ్నీ సంబంధిత జబ్బుల బారిన పడే ముప్పు నుండి తప్పించుకోవచ్చు అని ఒక అధ్యయనంలో తేలింది. ఇందులో పీచుపదార్థం ఎక్కువగా ఉంటుంది. మలబద్ధకానికి మంచి మందు. కొవ్వులు తక్కువ మోతాదులో ఉంటాయి. బరువు తగ్గాలనుకునేవారు తినవచ్చు. ఇందులో ఉండే పిండిపదార్థం కడుపు నిండిన భావన కలిగించి, ఆకలిని తగ్గిస్తుంది. ఇది పేగులను ఉత్తేజపరుస్తుంది. దీనివల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఎయిడ్స్ వైరస్‌పై పోరాడే శక్తి ఉంది. అరటిలో ఉండే 'బాన్‌లెక్' అనే రసాయనానికి ఎయిడ్స్ వైరస్‌పై పోరాడే శక్తి ఉందని ఓ రీసెర్చ్‌లో తేలింది. ప్రస్తుతం ఈ వైరస్ నిరోధానికి వాడుతున్న 'టీ20, మారావిరాక్' మందులతో సమానంగా ఈ రసాయనం పనిచేస్తుంది. లెక్టిన్ రసాయనం వైరస్‌ను శరీరంలో ప్రవేశించనీయకుండా అడ్డుకుని ఇన్‌ఫెక్షన్‌ను నిరోధిస్తుంది. ఇందులో ఉండే ట్రిప్టోఫాన్ అనే అమైనో యాసిడ్ శరీరంలో ప్రవేశించగానే సెరటోనిన్‌గా మారుతుంది. తద్వారా ఒత్తిడి తగ్గుతుంది. మానసిక ప్రశాంతతను కలుగజేస్తుంది. రాత్రిపూట పాలతో కలిపి తీసుకుంటే నిద్ర బాగా పడుతుంది.

# ఏసీలో పనిచేయడం కష్టమే!



ఇంట్లో, బయట ఎలా ఉన్నా ఆఫీసుకు వచ్చేసరికి కొందరు ఉక్కపోస్తుందని ఏసీ వేయండంటూ హల్‌చల్ చేస్తుంటారు. ఏసీ ఎక్కువగా ఉండడం ఉండడం వల్ల వారికి బాగానే ఉంటుంది. మహిళలకు మాత్రం ఇబ్బంది కలుగుతుందని ఓ పరిశోదనలో వెల్లడైంది. ఉష్ణోగ్రత కాస్త ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో మహిళల పనితీరు మెరుగ్గా ఉన్నదని, చల్లగా ఉన్న ప్రదేశంలో పురుషుల పనీతీరు బాగుందని ఆ అధ్యయనంలో తేలింది. ఈ అధ్యయనం కోసం 500 మంది స్త్రీ, పురుషులను 24 టీమ్‌లుగా విభజింజి వివిధ గదుల్లో ఉంచారు. అందులో 61–91 ఫారెన్ డిగ్రీల మధ్య ఉష్ణోగ్రత మారుస్తూ వారి పనితీరును పరిశీలించారు. ఉష్ణోగ్రత పెరిగినప్పుడు మహిళలు చురుగ్గా పనులు చేసుకోగా చల్లగా మారినప్పుడు పురుషుల పని సామర్థ్యం పెరిగినట్లు గుర్తించారు. మహిళలు సాధారణంగా 77 ఫారెన్ డిగ్రీల వాతావరణంలో సౌకర్యంగా ఉంటున్నారు. పురుషులు 72 ఫారెన్ డిగ్రీల ఉష్ణోగ్రతను ఇష్టపడుతున్నారని తేలింది. ఈ మార్పుకు కారణం స్త్రీలు ధరించే దుస్తులు. కావచ్చని అధ్యయనకారులు భావిస్తున్నారు.

ప్రవేటుపాఠశాల ఉపాధ్యాయుల అంతరంగం
బడులులేవుగాన భత్యములే లేవు!
పనులు చేతమన్న
పనులు లేవు!తినుట
కసలు యేమి,
తిండిదొరకలేదు
జీవితమున కెంత
చేటువచ్చె!



– మల్లాది సోమేశ్వర శర్మ, 9603995769

మంచిమాట

మొదట పట్టించుకోరు. ఆ తర్వాత చూసి నవ్వుతారు. ఆపై యుద్ధానికి దిగుతారు. అంతిమంగా మీరే విజయం సాధిస్తారు

ఈ ప్రపంచం మనిషి అవసరాలని తీర్చగలదు కానీ, కోర్కెలను ఎప్పటికీ తీర్చలేదు.



– మహాత్మా గాంధీ

# మోక్షజ్ఞ సినిమా ఇప్పట్లో లేనట్లే



మొత్తానికి బాలయ్య బర్త్ డే ఓ విషయాన్ని స్పష్టం చేసింది. బాలయ్య వారసుడిగా మోక్షజ్ఞ సినిమా రంగ ప్రవేశం వుండే అవకాశం లేదని క్లారిటీ వచ్చేసింది. బాలయ్య బర్త్ డే ఫొటోల్లో మోక్షజ్ఞ ఫొటోలు చూసిన వారు, అతనిలో హీరో మెటీరియల్ వున్నట్లు అస్సలు అనిపించడం లేదని కామెంట్ చేస్తున్నారు. పైగా బాగా బొద్దుగా కనిపిస్తున్నాడు. భయంకరంగా ఎక్సర్ సైజ్ లు గట్రా చేసి, ఫేస్ ను, శరీరాకృతిని పూర్తిగా మార్చుకుంటే తప్ప, సినిమా హీరో సీన్ రాదని అర్థం అయిపోతోంది. పైగా ఇటీవల బాలయ్య ఇంటర్వ్యూలు ఇచ్చినపుడల్లా, ఆయన మనుషులు, ముందుగానే ఇంటర్వ్యూ చేసిన వారికి మోక్షజ్ఞ గురించి ఎక్కువగా అడగవద్దని ఫీడ్ బ్యాక్ ముందుగానే ఇచ్చారని జర్నలిస్ట్ సర్కిళ్లలో వినిపిస్తోంది. మోక్షజ వయస్సు ఇప్పటికే 26 ఏళ్లకు చేరుకుంది. హీరోగా ఎంట్రీ ఇవ్వడానికి ఇదే సరైన టైమ్. కానీ పరిస్థితి చూస్తుంటే మరో ఏడాది రెండేళ్ల వరకు రెడీ అయ్యే అవకాశాలు కూడా కనిపించడం లేదు. పైగా బర్త్ డే స్టిల్స్ లో మోక్షజ్ఞ ఫేస్ లో యూత్ ఫుల్ హుషారు అన్నది కనిపించలేదు. కొన్ని ఫోటొల్లో బాలయ్య కూడా కొడుకు పక్కన అంత హుషారుగా ఫేస్ పెట్టి కనిపించకపోవడం గమనార్హం. నిజానికి సినిమా ఫ్యామిలీ జనాలు ఎప్పుడెప్పుడు హీరోగా మారదామా అని చూస్తారు. గట్టిగా 20 రాకుండానే తెరంగ్రేటం చేసేయాలని చూస్తుంటారు. ఇప్పటి దాకా వచ్చిన తామర తంపర హీరోలు అంతా అలా వచ్చేసిన వారే. కానీ మోక్షజ్ఞ మాత్రం 26 వచ్చినా తెరపైకి వచ్చే ఆలోచనలే వున్నట్లు కనిపించడం లేదు. అందువల్ల మోక్షజ్ఞ పూర్తిగా మనసు మార్చుకుని, సీరియస్ గా సినిమాల్లోకి రావాలని అనుకుంటే తప్ప ఇప్పట్లో నందమూరి బాలయ్యకు నటవారసుడు రావడం కష్టమే.

# సారీ సారీ... చెంపలేసుకున్న ఖుష్బూ



సీనియర్ నటి, రాజకీయ నాయకురాలు పొరపాటైందంటూ చెంపలేసుకున్నారు. అది కూడా జర్నలిస్టుల గురించి మాట్లాడిన మాటలకు క్షమాపణ చెప్పుకోవాల్సి వచ్చింది. అసలేం జరిగిందంటే... ఏ విషయంపైనైనా ధైర్యంగా తన అభిప్రాయాలను వెల్లడించడంలో నటి ఖుష్బూ ముందు వరుసలో ఉంటారు. తాజాగా ఆమె జర్నలిస్టులకు సంబంధించి మాట్లాడిన ఆడియో టేపులు లీక్ కావడంతో వివాదంలో చిక్కుకున్నారు. టీవీ సీరియల్స్ షూటింగ్స్ తిరిగి ప్రారంభించడంపై ఆమె మాట్లాడిన ఆడియో టేప్ వాట్సాప్ గ్రూపుల్లో లీకైంది. ఈ టేప్‌లో ఖుష్బూ ...'జర్నలిస్టులకు కోవిడ్ తప్ప ఏ వార్తలూ లేవు. త్వరలో షూటింగ్స్ ప్రారంభమవుతున్నందున జర్నలిస్టులు ఫొటోలు, వీడియోల కోసం వెంటపడతారు. కానీ అస్సలు ఇవ్వొద్దు. సొంత కథలు అల్లుతూ మనల్ని చీల్చి చెండాడేందుకు జర్నలిస్టులు సిద్ధంగా ఉన్నారు. కావున జాగ్రత్తగా ఉండండి' అని ఆమె అన్నారు. ఈ మాటలు జర్నలిస్టులకు కోపం తెప్పించాయి. ఈ నేపథ్యంలో ఆమె ట్విటర్ వేదికగా స్పందిస్తూ తన వాయిస్‌ను కొంత ఎడిట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాదు, ఆ ఆడియోపై ఆమె మరింత వివరణ ఇచ్చారు. 'నిర్మాతల గ్రూప్‌లో నుంచి ఒకరు దాన్ని ఉద్దేశ పూర్వకంగానే లీక్ చేశారు. ఇలాంటి వ్యక్తుల మధ్య ఉన్నందుకు సిగ్గుపడుతున్నాను. జర్నలిస్టులను అగౌరవపర్చడం ఎంత మాత్రం నా ఉద్దేశం కాదు. కేవలం స్నేహితుల దగ్గర ఎలా మాట్లాడతామో అలాగే మాట్లాడాను. నాకు ప్రెస్‌పై ఎంత గౌరవం ఉందో పాత్రికేయులందరికీ తెలుసు. 34 ఏళ్ల సినీ జీవితంలో ఒక్కసారి కూడా వాళ్లను కించపరుస్తూ మాట్లాడలేదు. తాజాగా ఒకవేళ ఎవరినైనా బాధపెట్టుంటే వారికి నా హృదయపూర్వక క్షమాపణలు" అంటూ ఆమె సమస్యకు ముగింపు పలికేందుకు తన వంతు బాధ్యతను నిర్వర్తించారు. అయితే ఆమె కోపమంతా ఆ ఆడియో క్లిప్ లీక్ చేసిన నిర్మాతపైనే. అతనెవరో కూడా తనకు తెలుసని ఖుష్బూ అన్నారు. కానీ తన మౌనం, క్షమాగుణమే అతనికి పెద్ద శిక్ష అని పేర్కొన్నారు. ఓ పథకం ప్రకారమే ఖుష్బూ మాటల ఆడియోను లీక్ చేశారని అర్థమవుతోంది.

## 'అయ్యప్పన్' కు బాలయ్య దూరమైనట్లే?



సితార ఎంటర్ టైన్ మెంట్స్ సీరియస్‌గా ప్లాన్ చేస్తున్న సినిమా అయ్యప్పన్ కోషియమ్ రీమేక్. కోటి రూపాయలు పెట్టి హక్కుల కొన్న ఈ సినిమాను మాంచి మల్టీ స్టారర్ గా చేయాలని ప్రయత్నం. మొదటి నుంచీ బాలకృష్ణ-రానా కాంబినేషన్ అనే అనుకున్నారు. కానీ పాటలు, ఫైట్లు, హీరోయిన్లు లేకుండా కేవలం ఎమోషన్ల మీద నడిచే ఈ కథ పట్ల బాలయ్య పెద్దగా ఆసక్తి పెట్టినట్లు కనిపించడం లేదు. పైగా బాలయ్య నేరుగా డీల్ చేయడం కన్నా, ఆయనకు నిర్మాతకు మధ్యలో చాలా వుంటాయి. ఇవన్నీ కలిసి మొత్తం మీద అయ్యప్పన్ రీమేక్ కు బాలయ్యను దూరం చేసినట్లు కనిపిస్తోంది. ఇప్పుడు రెండు ఆప్షన్లను నిర్మాతలు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకటి విక్టరీ వెంకటేష్-రానా కాంబినేషన్. ఇప్పటి వరకు తెరమీదకు రాని కాంబినేషన్ ఇది. సినిమా స్టార్ట్ అవుతూనే ప్రాజెక్టుకు క్రేజ్ వస్తుంది. రెండవ ఆప్షన్ రవితేజ-రానా కాంబినేషన్. ఇది కూడా క్రేజీగానే వుంటుంది. అయితే స్టార్ కాస్ట్ మాత్రమే ఆలోచన కాదు, డైరక్టర్ ఎవరు అన్నది కూడా. సరైన డైరక్టర్ పేరు యాడ్ అయితే కానీ ప్రాజెక్టుకు సరైన జోష్ రాదు. కాస్త పేరున్న, కెపాసిటీ వున్న డైరక్టర్లు ఎవ్వరూ ఖాళీ లేరు. పవన్ సినిమాలు బాగా ఆలస్యం అయ్యేలా వున్నాయి. అందువల్ల హరీష్ శంకర్ కనుక చేస్తే బాగుంటుందనే ఆలోచన నిర్మాతల్లో వున్నట్లు బోగట్టా. లేదా ఇంకా ఈ మిడిల్ రేంజ్ డైరక్టర్లు ఎవరు వున్నారు అన్నది కూడా డిస్కషన్ లో వున్నట్లు తెలుస్తోంది.

## మళ్లీ డబుల్ యాక్షన్?



'సిరుత్తై' ('విక్రమార్కుడు' చిత్రం తమిళ రీమేక్) చిత్రంలో ద్విపాత్రాభినయం చేశారు హీరో కార్తీ. మరోసారి స్క్రీన్ మీద డబుల్ యాక్షన్ చేయడానికి రెడీ అవుతున్నారని సమాచారం. ఇరుంబుదురై (తెలుగులో అభిమన్యుడు), హీరో (తెలుగులో శక్తి) చిత్రాలకు దర్శకత్వం వహించిన పీయస్ మిత్రన్ దర్శకత్వంలో ఓ సినిమా కమిటయ్యారు కార్తీ. ఈ సినిమాలో ఆయన ద్విపాత్రాభినయం చేయనున్నారనేది తాజా వార్త. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ సినిమాలో రెండు పాత్రలు పూర్తి భిన్నంగా ఉంటాయట. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం ఈ ఏడాది చివర్లో సెట్స్ మీదకు వెళ్లనుంది. ఇది కాకుండా 'సుల్తాన్, మణిరత్నం 'పొన్నియిన్ సెల్వన్' చిత్రాలు చేస్తున్నారు కార్తీ.

# క్రైసిస్ ఎఫెక్ట్‌ని అల్లరోడు అధిగమిస్తాడా?



అల్లరి సినిమాతో టాలీవుడ్ లో ప్రవేశించి చాలా తక్కువ సమయంలో 50 సినిమాలు పూర్తి చేసిన హీరోగా నరేష్ పాపులరయ్యాడు. అర్ధ సెంచరీ తర్వాతే అసలు కష్టాలు మొదలయ్యాయి. సక్సెస్ ముఖం చాటేసింది. ఎంపికలు అభిమానులకు నచ్చలేదు. చేసిన ప్రయోగాలేవీ సత్ఫలితాలివ్వలేదు. కారణం ఏదైనా బ్యాడ్ ఫేజ్ తీవ్రంగానే ఇబ్బంది పెట్టింది. ఆ క్రమంలోనే మహేష్ నటించిన మహర్షిలో క్యారెక్టర్ రోల్ చేసి మెప్పించాడు. కానీ అదీ కెరీర్ కి ఏమంత కలిసొచ్చినట్టు లేదు. అప్పటికే అల్లరోడికి నిర్మాతల బ్యాంక్ ఉంది కాబట్టి అడపాదడపా అవకాశాలు అందుకుంటూనే ఉన్నాడు. హీరోగా నటిస్తూనే ఉన్నాడు. ప్రస్తుతం నరేష్ మళ్ళీ కం బ్యాక్ కోసం బాగానే ట్రై చేస్తున్నాడు..! ఆలస్యమైనా ఫర్వాలేదు కానీ సినిమా మొత్తం సరిగా వచ్చాకే రిలీజ్ చేద్దామని నిర్మాతలకు చెబుతున్నాడట. అలానే బ్యాక్ టు బ్యాక్ బాగానే సినిమాలు కూడా లైన్ లో పెట్టాడు..! ప్రస్తుతం నాంది.. బంగారు బుల్లోడు సినిమాలు చేస్తున్నాడు నరేష్. ఇందులో ఎలాగూ తన హోమ్ బ్యానర్ గా చెప్పుకునే ఏకే బ్యానర్ అతడికి హిట్టిస్తుందా లేదా? అన్నది సస్పెన్స్. అహనా పెళ్లంట (వీరభద్రమ్ చౌదరి డైరెక్టర్) లాంటి సక్సెస్ ఇచ్చిన ఏకే బ్యానర్ కి ఎలాంటి అడ్డు చెప్పకుండా నరేష్ ఓకే చెప్పేస్తుంటాడు. కానీ ఈ బ్యానర్ కి ఉన్న బాడ్ ఫేట్ వల్ల...ఎలాంటి రిజల్ట్ రానుందో అన్న టెన్షన్ అలానే ఉంది. బంగారు బుల్లోడు ఎలాంటి రిజల్ట్ అందుకుంటుందో కాస్త ఆగితే కానీ తెలీదు. నరేష్ సహా ఎందరో ఎన్నో ప్లాన్స్ వేసినా అన్నిటికీ కొవిడ్ చెక్ పెట్టేసింది. ప్రస్తుత సన్నివేశంలో ఎవరి ఫేట్ ఎలా ఉండాలో నిర్ణయించేది మహమ్మారీనే అనడంలో ఎలాంటి సందేహం లేదు.

# పెళ్లిపై ఫుల్ క్లారిటీ ఇచ్చేసిన మిల్కీ బ్యూటీ



మిల్కీ వైట్ బ్యూటీ తమన్నా దాదాపు పదిహేనేళ్ల కెరీర్ పూర్తి చేసింది. ఇన్నేళ్లలో ఏనాడూ తమ్మూ ఫలానా హీరోతో డేటింగ్ చేసినట్టు గాసిప్పు అయినా లేదు. గత నాలుగైదేళ్లలో మాత్రం తనపై అడపాదడపా ఎఫైర్ గాసిప్స్ షికారు చేశాయి. నయనతారకు బ్రేకప్ చెప్పేసిన ప్రభుదేవాతో వరుసగా రెండు మూడు సినిమాల్లో నటించినప్పుడు అతడితో తమన్నా డేటింగ్ చేస్తోందని.. అందుకే వరుసగా భారీ సినిమాల డీల్ కుదిరిందని తమిళ మీడియాలో కథనాలు వేడెక్కించాయి. ఆ తర్వాత అది నిజం కాదని తేలింది. కొన్నాళ్ల తర్వాత పాక్ క్రికెటర్ అబ్దుల్ రజాక్ తో కలిసి ఉన్న ఫోటో అంతర్జాలంలో వైరల్ అయ్యింది. దాంతో తమన్నా సదరు క్రికెటర్ తో జోరుగా షికార్లు చేస్తోందని కోలీవుడ్ మీడియాలో కథనాలొచ్చాయి. అయితే ఓ వాణిజ్య ప్రకటనలో సదరు క్రికెటర్ తో నటించానని దుబాయ్ లో ఉన్నప్పుడు దిగిన ఫోటో అది అని తమన్నా వివరణ ఇచ్చింది. అసలు ఈ ఎఫైర్ గోలేంటి? అంటూ చికాకు పడింది. 2017 ఇన్సిడెంట్ ఇది. ఆ తర్వాత కూడా ఓ టాప్ క్లాస్ బిజినెస్ మేన్ తో తమన్నా డేటింగ్ చేస్తోందన్న పుకార్లు షికారు చేశాయి. కానీ వాటిని కూడా తమన్నా ఖండించింది. ప్రస్తుత స్టాటస్ ఏమిటి? అంటే తమన్నా ఇంకా సింగిలేనట. క్రికెటర్ తో కానీ బిజినెస్ మేన్ తో కానీ ఎఫైర్ ఏదీ లేదు. ప్రేమా దోమా ఏదీ లేదని క్లారిటీనిచ్చేసింది. మరో రెండేళ్ల వరకూ అంటే 2022 వరకూ పెళ్లి మాటే ఎత్తదట. ప్రస్తుతం పూర్తిగా కెరీర్ పైనే దృష్టి సారించానని ఓ ఇంటర్వ్యూలో వివరణ ఇచ్చింది. అయితే పెళ్లికి సిద్ధమైతే వరుడు ఎలా ఉండాలి? అన్నది అభిమానుల డౌట్. అతడు క్రికెటరై ఉండాలా? లేక బిజినెస్ మేన్ అయితే సరిపోతుందా? అంటూ ఫ్యాన్స్ లో చర్చ మొదలైంది. తమన్నా ప్రస్తుతం గోపీచంద్ సరసన సీటీమార్ లో నటిస్తోంది. సంపత్ నంది ఈ చిత్రానికి దర్శకుడు. అటు తమిళంలోనూ పలు చిత్రాలతో బిజీగా ఉంది.

# రామ్‌తో సురేందర్ ?




సైరా తరువాత సరైన సినిమా చేతిలోకి రాకుండా వుంది దర్శకుడు సురేందర్ రెడ్డి. ధృవ లాంటి సక్సెస్ ఇచ్చినా, సైరా సినిమా అదంతా డెబిట్ చేసేసి మళ్లీ మొదటికి తెచ్చింది. దీంతో రకరకాల గ్యాసిప్ లు వినిపిస్తున్నాయి. వరుణ్ తేజ్ తో సినిమా అని మొన్నటి వరకు వినిపించింది. మధ్య మధ్యలో కాదు అఖిల్ తో సినిమా వుండొచ్చు అని వినిపించింది. ప్రస్తుతం వరుణ్ తేజ్ బాక్సర్ సినిమా చేయాలి. ఆ తరువాత ఎఫ్ 3 సినిమా చేయాలి. అంటే ఓ ఏడాది టైమ్ పడుతుంది. మరి అంత వరకు సురేందర్ ఏం చేస్తారు? అందుకే ఆయన ఇప్పుడు తన చూపు వేరే హీరో వైపు తిప్పినట్లు తెలుస్తోంది. ఇస్మార్ట్ శంకర్ తో మాంచి హిట్ కొట్టిన రామ్ పోతినేని ప్రస్తుతం రెడ్ సినిమా చేస్తున్నారు. ఆ తరువాత ప్రస్తుతానికి ఏ కమిట్ మెంట్ లేదు. అందుకే సురేందర్ దృష్టి రామ్ మీద పడినట్లు తెలుస్తోంది. ఇప్పటికే రామ్ తో సినిమా చేయాలని దర్శకుడు మారుతి కూడా ప్రయత్నాల్లో వున్నారు. మరి రామ్ ఎవరి వైపు మొగ్గుతారో? ఫ్లాప్ ఇచ్చినా, కమర్షియల్ డైరక్టర్ అని సురేందర్ వైపు చూస్తారో? మాంచి ఫ్యామిలీ సినిమాల డైరక్టర్ అని హిట్ ఇచ్చిన మారుతి వైపు మొగ్గుతారో?

# మహేష్‌కు విలన్‌గా కన్నడ స్టార్ హీరో!




పరశురామ్ దర్శకత్వంలో సూపర్ స్టార్ మహేష్ బాబు చేస్తోన్న సినిమాలో విలన్‌గా కన్నడ స్టార్ హీరోను తీసుకున్నట్లు సమాచారం. ఆయనైతే ఈ పాత్రకు కరెక్ట్ అని చిత్ర యూనిట్ గట్టిగా నమ్ముతోందట. 'సరిలేరు నీకెవ్వరు' లాంటి బ్లాక్ బస్టర్ తరవాత మహేష్ బాబు ఎలాంటి సినిమా చేస్తారో అని ఎదురు చూసిన అభిమానులకు అదిరిపోయే ఫీస్ట్ ఇవ్వబోతున్నారు దర్శకుడు పరశు రామ్. మహేష్ బాబుతో పరశురామ్ సినిమా అని ప్రకటించగానే అది క్లాసా, మాసా అనే అనుమానం చాలా మందిలో కలిగింది. అయితే, 'సర్కారు వారి పాట' ఫస్ట్ లుక్ పోస్టర్ వచ్చిన తరవాత ఇది కచ్చితంగా పక్కా మాస్ అని అర్థమైపోయింది. ఈ టైటిల్ పోస్టర్ మహేష్ అభిమానులతో పాటు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. సగం చూపించిన మహేష్ బాబు లుక్ కూడా కొత్తగా ఉంది. మహేష్ బాబును దర్శకుడు పరశురామ్ కచ్చితంగా కొత్తగా చూపిస్తారు అనే భరోసా ఒక్క పోస్టర్‌తో కలిగింది. అయితే, మహేష్‌తో సినిమా చేయడం తన డ్రీమ్ అని చెప్పిన పరశురామ్.. ఈ చిత్రానికి సంబంధించి ప్రతి అంశంలోనూ ఎంతో జాగ్రత్త తీసుకుంటున్నారట. అందుకే, విలన్ ఎంపిక విషయంలోనూ ఆయన చాలా కసరత్తు చేశారని సమాచారం. మొత్తానికి కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్ పేరును ఫైనల్ చేశారని ఇండస్ట్రీ టాక్. ఇప్పటికే సుదీప్‌కు పరశురామ్ కథ చెప్పడం, దానికి సుదీప్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం జరిగిపోయాయని అంటున్నారు. సుదీప్ తెలుగు ప్రేక్షకులకు కొత్తమేకాదు. 'ఈగ' సినిమాతో తెలుగు ఆడియన్స్‌ను కట్టిపడేసిన సుదీప్.. ఆ తరవాత 'బాహుబలి', 'సైరా' చిత్రాల్లో కీలక పాత్రలు పోషించారు. కేవలం కన్నడ, తెలుగులో మాత్రమే కాకుండా తమిళం, హిందీ సినిమాల్లోనూ సుదీప్ నటిస్తున్నారు. కిందటేడాది, సల్మాన్ ఖాన్ హీరోగా వచ్చిన 'దబంగ్ 3'లో విలన్‌గా నటించి సత్తా చాటారు. అలాంటి బహుబాషా నటుడు మహేష్‌కి విలన్ అంటే కచ్చితంగా తెరపై పోటాపోటీగా ఉంటుంది. మరి, ఈ రూమర్‌లో నిజమెంతో తెలియాలంటే చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించేవరకు ఆగాల్సిందే.

# 'పుష్ప' కోసం భారీ ప్లాన్!




తెలుగు రాష్ట్రాల్లో సినిమా షూటింగ్‌లు కొద్ది రోజుల్లో ప్రారంభం కాబోతున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పాటిస్తూ దర్శక, నిర్మాతలు షూటింగ్‌లను ప్లాన్ చేసుకోవాలి. కరోనా మహమ్మారి కారణంగా తాత్కాలికంగా ఆగిపోయిన సినిమా షూటింగ్‌లు మరికొద్ది రోజుల్లో పునర్ ప్రారంభంకానున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు జూన్ 15 నుంచి షూటింగ్‌లకు అనుమతులు ఇవ్వడంతో దర్శక నిర్మాతలు షూటింగ్‌లకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. అయితే, కరోనా నుంచి మనం సంపూర్ణంగా కోలుకోలేదు కాబట్టి ఇకపై షూటింగ్స్ అంత తేలికైన విషయం కాదు. దర్శక నిర్మాతలు తమకు ఇష్టం వచ్చిన ప్రదేశానికి వెళ్లి షూటింగ్స్ జరుపుకోడం జరిగే పనికాదు. అందుకు అనుమతులు కూడా దొరకని పరిస్థితి. ప్రభుత్వాలు జూన్ 15 నుంచి షూటింగ్స్ జరుపుకోవడానికి అనుమతులు ఇచ్చినా తాము నిర్దేశించిన విధివిధానాలను అనుసరించక తప్పదు. అలాగే, తెలుగు రాష్ట్రాల ఆవలకు వెళ్లి షూటింగ్‌లు జరపడం కూడా సాధ్యపడదు. ఈ నేపథ్యంలో పెద్ద చిత్రాల నిర్మాతలు తమ సినిమాల షూటింగ్‌లను వీలైనంత వరకు సెట్స్‌లోనే జరిపేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. సినిమా కోసం దర్శకధీరుడు రాజమౌళి ఇప్పటికే భారీ సెట్ నిర్మిస్తున్నట్లు సమాచారం. ఆ సెట్‌లోనే చాలా వరకు షూటింగ్ పూర్తి చేయనున్నారట. అయితే, దర్శకుడు సుకుమార్ కూడా రాజమౌళిని ఫాలో అవుతున్నారని అంటున్నారు.

స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ 'పుష్ప' పేరిట పాన్ ఇండియా మూవీని సుకుమార్ తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఇది ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో రూపొందుతోన్న చిత్రం. అటవీ ప్రాంతంలో షూటింగ్ జరపాలి. నిజానికి లాక్‌డౌన్‌కు ముందు సుకుమార్ పలు లొకేషన్లను చూసుకున్నారు. కానీ, ఇప్పుడు ఆయా లొకేషన్లకు వెళ్లలేని పరిస్థితి. అందుకే, ఆ సన్నివేశాలు మినహా మిగిలిన సన్నివేశాల కోసం హైదరాబాద్‌లోనే సెట్స్ వేసి చిత్రీకరణ జరుపుతారట. దీనికి సంబంధించి ఇప్పటికే సుకుమార్ ప్లాన్స్ మొదలుపెట్టారని అంటున్నారు. గతంలో 'రంగస్థలం' సినిమా కోసం బంజారాహిల్స్‌లోనే సుకుమార్ భారీ సెట్ వేశారు. పల్లెటూరు వాతావరణాన్ని సిటీలో క్రియేట్ చేశారు. మరి ఇప్పుడు ఎలాంటి సెట్స్ వేస్తారో చూడాలి.

# తిరుపతి, గుంటూరు, కడప, కర్నూలు, నెల్లూరు వార్తలు



వైయస్ఆర్ సంపూర్ణ పోషణ కార్యక్రమంలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి శ్రీ కె.నారాయణ స్వామి., ఎంపీ శ్రీ రెడ్డెప్ప తిరుపతి ఎమ్మెల్యే శ్రీ భూమన కరుణాకర్ రెడ్డి .,జిల్లా కలెక్టర్ డా.నారాయణ భరత్ గుప్త .,జెసి(డి) వీరబ్రహ్మం ., తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీ గిరిషా తదితరులు...(తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయం)

**– వార్తావళి, తిరుపతి**



విజయవాడలో శ్రీ దుర్గమల్లేశ్వర స్వామి అమ్మవారిని దర్శించుకున్నా గౌరవ శాసనసభ్యులు శ్రీ పెట్ల ఉమా శంకర గణేష్ గారి దంపతులు

**– వార్తావళి, విజయవాడ**

## టిడిపి నాయకులను అడ్డుకున్న పోలీసులు

**కృష్ణా,** ఐనంపూడికి బయలుదేరిన టీడీపీ నేతలను పామర్రు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దళితులపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో దళితులను పరామర్శించేందుకు టీడీపీ నేతలు ఛలో ఐనంపూడి కార్యక్రమానికి బయలుదేరారు. వర్ల రామయ్య ఆధ్వర్యంలో విజయవాడ నుంచి టీడీపీ, దళితనేతలు బయలుదేరారు. మైలవరం, రెడ్డిగూడెం మండలం వద్ద వారిని పోలీసులు అడ్డుకున్నారు. వెనక్కి వెళ్లాలంటూ పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఘటనకు కారణమైన వారిని అరెస్ట్ చేసేవరకు వెనక్కి వెళ్లేదిలేదని వర్ల రామయ్య స్పష్టం చేశారు. నిందితులను అరెస్టు చేయాలనడం తప్పా? ప్రతిపక్షంగా తమ బాధ్యతని అన్నారు.

## 15 నుంచి శ్రీవారి ప్రవేశ దర్శనం టిక్కెట్లు



**తిరుపతి, వార్తావళి, సెప్టెంబర్ 7 :** ఈ నెల 15వతేదీ, 19 నుంచి 27వ తేదీలవరకు తిరుమల శ్రీవారి దర్శనం కోసం రూ 300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను టీటీడీ ఆన్లైన్‌లో విడుదల చేయనున్నారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఈ రోజులకు రూ 300 టికెట్లు కేటాయించలేదు. అయితే శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఏకాంతంగా నిర్వహించాలని నిర్ణయించినందువల్ల 15వ తేదీ అంకురార్పణ, 19 నుంచి 27వ తేదీ దాకా బ్రహ్మోత్సవాల సమయంలో కూడా ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు ఇవ్వాలని టీటీడీ నిర్ణయించింది. సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి ఆన్లైన్‌లో టికెట్లు అందుబాటులోకి వస్తాయి.

## సిక్కోలుకు ఏమైంది?

శ్రీకాకుళం జిల్లా అంటే వలసల జిల్లాగా పేరు. అదే ఇపుడు సలసల మరిగిస్తోంది. కరోనాను ఎగదోసి మరీ చిగురుటాకులా విలవిలలాడిస్తోంది. కరోనా వ్యాపిస్తున్న కొత్తలో జీరో కేసులు నమోదు అయిన ఈ జిల్లా లాక్ డౌన్ సడలింపుల తరువాత బాగా చిక్కుకుంది. అది మొదలు రోజుకు రెండు మూడు వందల కేసులుగా పెరుగుతూ వచ్చాయి. ఇపుడు ఏకంగా రోజుకు వేయి దాకా కేసులు వస్తున్నాయి. దాంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఇతర రాష్ట్రాలకు, ప్రాంతాలకు వెళ్లిన కార్మికులు ఇంటి ముఖం పట్టడంతో కేసులు పెరిగాయని ఒక అంచనా. ఇక ఎంత కంట్రోల్ చేసినా ప్రతీ ఆదివారం లాక్ డౌన్ ప్రకటిస్తున్నా కూడా కేసులు కొలిక్కి రావడంలేదు, దానికి కారణం ప్రజలు బేఖాతరుగా రోడ్ల మీదకు వచ్చేయడం అంటున్నారు, అదే విధంగా సోషల్ డిస్టెన్స్ పాటించడంలేదు, కరోనా కారణంగా ఎందరో ప్రముఖ వ్యాపారులను, ప్రజా నేతలను ఈ జిల్లా ఇప్పటికే కోల్పోయింది. నాలుగు దశాబ్దాలుగా శ్రీకాకుళం పట్టణ రాజకీయాలను శాసించిన మునిసిపాలిటీ మాజీ చైర్మన్ వరం కరోనా బారిన పడి తాజాగా అసువులు బాయడం వైసీపీ తీరని లోటుగా భావిస్తోంది. ఇవన్నీ చూసిన జిల్లా యంత్రాంగం కనీసం 45 రోజుల పాటు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచిస్తోంది. ఇది పరీక్షాసమయం అని కూడా హెచ్చరిస్తోంది. అంటే అక్టోబర్ నెలాఖరు వరకూ సిక్కోలు కరోనా కోరల్లోనే ఉంటుందని అర్థమట. చూడాలి మరి ఎపుడు కేసులు తగ్గుముఖం పడతాయో.



# పేదల జీవితాలలో వెలుగులు నింపుతున్న మదరసాలు

### ఎన్నారై ఆన్సర్ వారి సిబ్బంది ఒంటిమిట్ట మదరసాకు 25 వేలు ఆర్థిక సాయం

### రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు ఎస్ బి. అంజాద్బాష



**కడప, వార్తావళి, సెప్టెంబర్ 7 :** తల్లిదండ్రులు లేని పేద పిల్లల జీవితాలలో మదరసాలు వెలుగులు నింపుతున్నాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్బి అంజాద్బాష పేర్కొన్నారు. సోమవారం ఉప ముఖ్యమంత్రి వర్యుల నివాసం నందు ఎన్నారై ఆన్సర్ వారి సిబ్బంది ఉప ముఖ్యమంత్రి వర్యుల చేతుల మీదుగా ఒంటిమిట్ట మదరసాకు 25 వేల రూపాయలు నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి వర్యులు మాట్లాడుతూ ఒంటిమిట్టలో అనేక సంవత్సరాలుగా మౌలానా సుభాన్ మధరస ఏ జామియా నూరుల్లా ఇస్లామి అనే పేరుతో మధురస నడపబడుతుందన్నారు. పేద ముస్లిం విద్యార్థినీ విద్యార్థులు ఇక్కడ ఖురాన్ చదవడం నేర్చుకోవడం, ఇస్లాం ఎలా చదవాలి, అనే విద్యను పిల్లలకు నేర్పించడం జరుగుతుందన్నారు. మధురసాలలో విద్యార్థులకు మూడు పూటలా భోజనం వసతి కల్పించడం జరుగుతుందన్నారు. భారత దేశ వ్యాప్తంగా వున్న మదరసాలు దాతల సహకారంతో నడుస్తున్నాయన్నారు. దాతల సహకారంతో అనేకమంది పేద విద్యార్తుల జీవితాలలో మదరసాలు వెలుగులు నింపుతున్నాయని ఇలాంటి మదరసాలకు ఎన్ఆర్ఐ ఆన్సర్ వారి బృందం ఆర్థిక సహాయం అందించడం ప్రతి ఒక్కరు గర్వించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై ఆన్సర్ వారి సిబ్బంది, 31వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి అజ్మతుల్లా, నగర మైనార్టీ సెల్ అధ్యక్షులు షఫీ, పాల్గొన్నారు.

## వైసిపి నాయకులు ఓబుల్ రెడ్డి హఠాన్మరణం



**కడప, వార్తావళి, సెప్టెంబర్ 7 :** కడప పట్టణం రూకవారిపల్లి కి చెందిన వైయస్ఆర్సిపి సీనియర్ నాయకులు రూక ఓబుల్ రెడ్డి (68) సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు గుండెపోటుతో మరణించారు. దీంతో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు ఎస్ బి. అంజాద్బాష, సోమవారం రూకవారిపల్లెకు వెళ్లి రూక ఓబుల్ రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో 50 వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి అశోక్ రెడ్డి, 31 వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి అజ్మతుల్లా, నగర మైనార్టీ సెల్ అధ్యక్షులు షఫీ, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత విద్యుత్ రద్దు చేసేందుకే జీవో నెంబర్ 22



**కడప, వార్తావళి, సెప్టెంబర్ 7 :** కేంద్ర ప్రభుత్వం విద్యుత్ ప్రైవేటీకరణ ముసాయిదా బిల్లు 20 20 అంతర్భాగంగా రాష్ట్రంలో వ్యవసాయ విద్యుత్ కు స్మార్ట్ మీటర్లు బిగించి రాయితీని నగదు బదిలీ పథకం ద్వారా చేపట్టి ఉచిత విద్యుత్తు కు మంగళం పాడాలని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 22 ను తక్షణం ఉపసంహరించుకోకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని అఖిలపక్ష నాయకులు హెచ్చరించారు. సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయం వద్ద జరిగిన ఆందోళన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి జి.ఈశ్వరయ్య, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి హరి ప్రసాద్, ఆర్ సీపీ నాయకులు రవి శంకర్ రెడ్డి, బి ఎస్ పి నాయకులు గురప్ప, సిపిఎం జిల్లా నాయకులు రామ్మోహన్ రెడ్డి, బీసీ మహాసభ నాయకులు అవ్వారు మల్లికార్జున, సంగటి మనోహర్, రైతు సంఘం నాయకులు గాలి చంద్ర,దస్తగిరి రెడ్డి, శివారెడ్డి, ఏఐటీయూసీ, బి కే ఎన్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి సీఐ సుబ్రహ్మణ్యం, ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి పి చంద్రశేఖర్, హేతువాద సంఘం నాయకులు సి ఆర్ వి ప్రసాద్, డి హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు కే మునయ్య, రైతు సంఘం నాయకులు మాట్లాడారు. విద్యుత్ సంస్కరణల ప్రభావం గత పాలకుల గద్దె దించిన ఘటనలను గుర్తు చేసుకొని స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, నగదు బదిలీ పథకం తక్షణం ఉపసంహరించుకోకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు టి మనోహర్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, శంకర్ రెడ్డి, బాల చంద్రయ్య నాయుడు, చంద్రశేఖర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

## భారతదేశంలో సరికొత్త పానిగేల్ వి2 విడుదల చేసిన డుకాటి



విలాసవంతమైన మోటార్ సైకిల్ బ్రాండ్ డుకాటీ నేడు తన సరికొత్త పానిగేల్ వి2 భారతదేశంలో ఐఎన్ఆర్ 16.99లక్షలకు (ఎక్స్-షోరూం భారతదేశం) విడుదల చేసింది. ఈ సరికొత్త పానిగేల్ వి2 సదృఢమైన మరియు కాంప్యాక్ట్ బైక్ కాగా, క్లాసిక్ డుకాటీ సూపర్ బైక్ శక్తిలో రాజీపడని శక్తిని ప్రతిబింబించే స్పష్టమైన లైన్ల అవసరాన్ని కలిగిన డిజైన్ బైక్‌గా తయారైంది. పానిగేల్ వి2 955 ట్విన్ సిలిండర్ సూపర్ క్వాడ్రో ఇంజిన్‌ను కలిగి ఉండగా, ఇప్పుడు అది బిఎస్-6 కాంప్లియెంట్‌తో, ఎక్కువ శక్తి (o5 హెచ్.పి) మరియు టార్క్ (o2 ఎన్ఎం) అందిస్తుండగా, దానికి నూతన ఇంజెక్టర్లు మద్దతుగా నిలుస్తున్నాయి (విభిన్న పని కోణపు పెద్ద పరిమాణం) మరియు ఎక్కువ దక్షత కలిగి స్నోర్కెల్ కలిగి ఉండగా, అది ఒత్తిడి నష్టాన్ని తగ్గిస్తుంది. వి2 నూతన కాంప్యాక్ట్ ఎగ్జాస్ట్ కలిగి ఉండగా, ఇది పూర్తిగా ఇంజిన్ దిగువ ఉంటూ పానిగేల్ కుటుంబపు యువ సభ్యునిగా సుందరమైన లైన్స్‌తో స్వచ్ఛమైన రూపాన్ని అందిస్తుంది. దీని గురించి డుకాటీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ బిపుల్ చంద్ర మాట్లాడుతూ "పానిగేల్ పోర్ట్‌ఫోలియో డుకాటీ సూపర్ బైక్ ప్రయాణంలో గమనార్హమైన మైలురాయి కాగా, అది ఈ బ్రాండ్‌కు అసాధారణ గుర్తింపును తీసుకు వచ్చింది. పానిగేల్ వి2 విడుదలతో మేము వాస్తవమైన డుకాటీ అనుభవాన్ని అందించడంతో పాటు రూపం మరియు లభ్యతల కుటుంబాన్ని వినియోగదారుల చెంతకు తీసుకు వస్తున్నాము. ప్రభావాన్ని చూపించేలా తయారు చేసిన ఇది నిర్ణయాత్మకమైన లక్షణాలు కలిగిన సూపర్ బైక్‌గా మరియు ప్రారంభ దశలో ఉన్న వారికి అలానే పరిణితి కలిగిన వారికి కూడా ఇందులో అపరిమిత ఆనందం లభిస్తుంది.

# అధ్యక్ష ఎన్నికల్లో హెూరాహెూరీ..

### ఫ్లోరిడా వాసుల చూపు ఎవరివైపు?



ప్రపంచం మొత్తం ఇప్పుడు కరోనా వ్యాక్సిన్ కోసం ఎదురుచూస్తుంది. కరోనా టీకా ఎప్పుడు వస్తుంది కరోనా మహమ్మారి పీడ ఎప్పుడు విరగడ అవుతుంది అని ఎదురుచూస్తున్నారు. దీనితో పాటు ఇప్పుడు ప్రపంచం మొత్తం అమెరికా ఎన్నికల కోసం ఆతృతగా ఎదురుచూస్తుంది. నవంబర్ లో అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు జరగబోతున్నాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలుపెవరిది. రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ డెమొక్రాట్ల అభ్యర్థి జో బైడెన్ మధ్య హెూరాహెూరీ పోరు సాగుతోంది. దీంతో స్వింగ్ స్టేట్స్ ఎటువైపు మొగ్గు చూపిస్తాయన్న దానిపై అభ్యర్థుల గెలుపు ఆధారపడి ఉంది. ఎన్నికల ప్రచారం జోరందుకున్న నేపథ్యంలో స్వింగ్ స్టేట్స్ ఎటు వైపు మొగ్గుతాయన్న ఉత్కంఠ రేగుతోంది. గత ఎన్నికల్లో ట్రంప్ కంటే పాపులర్ ఓట్లు 30 లక్షలు అధికంగా హిల్లరీ క్లింటన్ సాధించినప్పటికీ ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు ట్రంప్కి ఎక్కువ రావడంతో ఆయన అ్యధ్యక్ష పీఠాన్ని దక్కించుకున్నారు. నవంబర్ 3న జరిగే ఎన్నికల్లో ప్రజలు తమకు నచ్చిన అభ్యర్థి పార్టీకి ఓటు వేయబోతున్నారు. ఆ ఓటింగ్ రాష్ట్రాల స్థాయిలోనే ఉంటుంది. అక్కడ ఎన్నికైన ప్రతినిధులంతా కలిసి అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. దేశం మొత్తమ్మీద 50 రాష్ట్రాలు డిస్ట్రిక్ట్ కొలంబియాలో జనాభా ప్రాతిపదికన ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు ఉంటాయి. దేశవ్యాప్తంగా 538 ఎలక్టోరల్ కాలేజీ ఓట్లకిగాను 270 ఓట్లు సాధించిన వారే అధ్యక్షుడిగా ఎన్నికవుతారు. ఈసారి ఎన్నికల్లో మొత్తం 14 రాష్ట్రాల్లో ఎవరి వైపు ప్రజలు మొగ్గు చూపుతారో తెలీని పరిస్థితి నెలకొంది. ఇప్పటివరకు అమెరికా ఎన్నికల చరిత్రలో ఈ స్థాయిలో జనం నాడి తెలియకుండా ఎప్పుడూ లేదు. కానీ ఈసారి జనం నాడి పసిగట్టడం చాలా కష్టం అవుతుంది. టెక్సాస్ (38 ఎలక్టోరల్ ఓట్లు) ఫ్లోరిడా (29 ) పెన్సిల్వేనియా (20) ఒహియో (18) మిషిగాన్ (16) జార్జియా (16 ) నార్త్ కరోలినా (15) వర్జీనియా (13) అరిజోనా (11) విస్కాన్సన్ (10) మిన్నెసోటా (10) నెవడా (6) అయోవా (6) న్యూ హ్యాంప్షైర్ (4) రాష్ట్రాల్లో ప్రతీ నెల జనం మూడ్ మారిపోతున్నట్టుగా సర్వేలు చెబుతున్నాయి. తాజా సర్వేల్లో జార్జియా అయోవా టెక్సాస్ రాష్ట్రాల్లో ట్రంప్ కి మొగ్గు కనిపిస్తూ ఉంటే మిగిలిన స్వింగ్ స్టేట్స్ లో బైడెన్ కి స్పష్టమైన ఆధిక్యత వచ్చేలా ఉంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో 1964 నుంచి ఫ్లోరిడాలో నెగ్గిన వారికే అధ్యక్ష పదవి దక్కుతూ వస్తోంది. ఒక్క 1992 లో అది రివర్స్ అయింది. గత ఎన్నికల్లో ట్రంప్కి 48.6% ఓట్లు వస్తే హిల్లరీకి 47.4% ఓట్లు వచ్చాయి. అంతకు ముందు ఎన్నికల్లో బరాక్ ఒబామా 51% ఓట్లను సాధించి అవలీలగా అధ్యక్ష పదవిని అందుకున్నారు. ఈ రాష్ట్రంలో ప్రజల ఆలోచనా ధోరణి వినూత్నంగా ఉంటుంది. యువ ఓటర్లు ఎక్కువ మంది ఉన్నారు. ఇక్కడ ఓటర్లు అధ్యక్ష అభ్యర్థుల మధ్య జరిగే డిబేట్లను విన్నాక ఓటుపై నిర్ణయం తీసుకుంటారు. ఎన్నికలకి ముందు మూడు సార్లు సెప్టెంబర్ 29 అక్టోబర్ 7 అక్టోబర్ 15న అధ్యక్ష అభ్యర్థుల మధ్య బిగ్ డిబేట్స్ జరుగుతాయి. ఈ డిబేట్స్లో ట్రంప్ బైడెన్ తాము అధికారంలోకి వస్తే ఏం చేస్తారో వివరిస్తారు. ఆ తరువాత వారు ఎవరికీ ఓటు వేయాలో నిర్ణయం తీసుకుంటారు. ఈ డిబేట్స్లో ట్రంప్ గెలుస్తారని 47% మంది అమెరికన్లు భావిస్తూ ఉంటే బైడెన్ వైపు 41% మంది ఉన్నారు. అమెరికాలో కరోనా కట్టడి లో ట్రంప్ చేతులెత్తేయడంతో ట్రంప్ పై వ్యతిరేకత వచ్చి ఉంటుంది అని కొందరు భావిస్తున్నారు. చూడాలి మరి .. స్వింగ్ రాష్ట్రాల చూపు ఎవరిపై ఉంటుందో.

## స్పా ముసుగులో వ్యభిచారం



వాళ్లు జస్ట్ ఓ డయల్ నంబర్ పెట్టారు. కాల్ చేస్తే నిర్వాహకులు ప్యాకేజీ బేరాలు చేస్తారు. పెట్టే అమౌంట్ ను బట్టి చెప్పిన అడ్రస్ కు వెళ్తే అక్కడ కావాల్సిన అమ్మాయిలు ఉంటారు. విజయవాడలో స్పా సెంటర్ పేరుతో వ్యభిచారం జరుగుతుండగా పోలీసులు బట్ట బయలు చేశారు. ఒకప్పుడు వ్యభిచార గృహాలు ప్రత్యేకంగా నడిచేవి. ఎక్కడ వ్యభిచారం జరిగినా ఇరుగు పొరుగుకు ఇట్టే తెలిసి పోయేది. వారి సమాచారంతో పోలీసులకు ఇట్టే తెలిసి పోయేది.ఆ తర్వాత రైడింగ్ లు జరిగేవి. ఇప్పుడు వ్యభిచార నిర్వాహకులు రూటు మార్చారు. వ్యభిచారం అంటే అంతా ఆన్లైనే.. అసలు ఎక్కడ వ్యభిచారం జరుగుతుందో కనిపెట్టడం కాస్త కష్టమే. నిర్వాహకులు ఆన్ లైన్ సోషల్ మీడియా యాప్స్ ద్వారా విటులను గుర్తించి ఆకర్శిస్తారు. ప్యాకేజీలను బట్టి అమ్మాయిని ఎంపిక చేసుకోవచ్చు. అమ్మాయికి ఓకే చెప్పి పేమెంట్ చెల్లిస్తే అడ్రస్ ఇస్తారు. వ్యభిచార గృహాలు మాత్రం ఇళ్ల మధ్య నిర్వహిస్తున్నారు. బైట నుంచి చూడ్డానికి మామూలుగా ఉన్నా లోపలే అంతా తతంగం జరుగుతుంటుంది. తాజాగా విజయవాడలో స్పా ముసుగులో నిర్వహిస్తున్న వ్యభిచారాన్ని పోలీసులు బట్ట బయలు చేశారు. నిర్వాహకులు యువతులు విటులను అరెస్టు చేశారు. విజయవాడలో కే9 బ్యూటీ స్పా. అందరికీ ఇది మసాజ్ సెంటర్ గానే తెలుసు. కానీ లోపల మాత్రం వివిధ రాష్ట్రాల నుంచి యువతులను రప్పించి గుట్టుగా వ్యభిచారం నిర్వహిస్తున్నారు. పైకి ఇంద్ర భవనాన్ని తలపించే ఆ సెంటర్ ని చూస్తే ఎవరికీ రవ్వంత అనుమానం కూడా రాదు. అయితే ఆ భవనంలో వ్యభిచారం సాగుతున్నట్లు పోలీసులకు కొందరు సమాచారం ఇచ్చారు. దీంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు కే9 బ్యూటీ స్పా సెంటర్ పై దాడులు చేశారు. స్పా ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఢిల్లీ మిజోరాం సిక్కిం హైదరాబాద్ లకు చెందిన ఏడుగురు యువతులు పట్టుబడ్డారు. వ్యభిచార కేంద్రం నడుపుతున్న స్వీటీ అలియాస్ నందిని కిరణ్ లను పోలీసులు అరెస్టు చేశారు.

## ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు

### విజయనగరం జిల్లా ఎస్పీ బి. రాజకుమారి

**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 7 :**జిల్లా ఎస్పీని కలవడానికి జిల్లా పోలీసు కార్యాలయానికి విచ్చేసిన ఫిర్యాదుదారులను విజయనగరం జిల్లా ఎస్పీ శ్రీమతి బి.రాజకుమారి, ఐ.పి.ఎస్., కార్యాలయం బయట ఏర్పాటు చేసిన సోమవారం నాడు నేరుగా కలిసి ఫిర్యాదుదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారుల సమస్యలను విన్న జిల్లా ఎస్పీ, వాటిని పరిష్కరించేందకు సంబంధిత పోలీసు అధికారులతో నేరుగా ఫోనులో మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలపై వెంటనే విచారణ జరిపి, న్యాయం చేయాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీగారికి సమస్యలను తెలియజేసేందుకుగాను సుమారు 20 మంది ఫిర్యాదుదారులు జిల్లా పోలీసు కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన టెంటులో వేచి ఉండడంతో, జిల్లా ఎస్పీ రాజకుమారి కార్యాలయానికి చేరుకొని, నేరుగా వారి వద్దకు వెళ్ళి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అప్పుడే పోలీసు కార్యాలయం వచ్చిన జిల్లా ఎస్పీ శ్రీమతి బి. రాజకుమారి గమనించి, వాహనం దిగినవెంటనే ఫిర్యాదుదారుల వద్దకు వెళ్ళి వారితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని, వెంటనే వారి సమస్యలపై విచారణ జరిపించి, న్యాయం చేయాల్సిందిగా సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ వి.వి.అప్పారావు మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గన్నారు.

## మేం లేచిపోవడం తప్పా! కోర్టుకెక్కిన ఇద్దరమ్మాయిలు..



వాళ్లిద్దరూ అమ్మాయిలు.. అయితేనేం మనసులు కలిశాయి. ఒకరికొకరు ఎంతో నచ్చారు. ఇద్దరి అభిరుచులు. అభిప్రాయాలు ఒక్కటే. ప్రేమించుకున్నారు.. పెళ్లి చేసుకుందామనుకున్నారు. కానీ ఈ పాడు సమాజం.. ఈ పెద్దాలున్నారే.. వాళ్లను అస్సలు అర్థం చేసుకోలేదు. దీంతో విధిలేని పరిస్థితుల్లో ఈ జంట కోర్టుకెక్కింది. స్వలింగ సంపర్కం తప్పు కాదని మనదేశంలోని అత్యున్నత న్యాయస్థానమే తీర్పు చెప్పినప్పుడు మమ్మల్ని ఎందుకు అర్థం చేసుకోవడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. గుజరాత్కు చెందిన పాయల్ కాంచన 2017లో పోలీస్ ట్రైనింగ్ తీసుకుంటున్న సమయంలో ఒకరినొకరు ప్రేమించుకున్నారు. 2018 నుంచి కలిసే ఉంటున్నారు. కానీ వారికి ఈ సమాజం నుంచి చిత్కారమే ఎదురయ్యిందట. ఇరువురి కుటుంబసభ్యులు వాళ్లను ఎంతో బెదిరిస్తున్నారట. చంపుతామని హెచ్చరికలు కూడా జారీచేశారట దీంతో విధిలేని సమయంలో కోర్టుకెక్కారు. దీంతో ఈ జంటకు సాయుధ బలగాలతో రక్షణ కల్పించాలని కోర్టు పోలీసులను ఆదేశించింది. గుజరాత్లోని మారుమూల గ్రామానికి చెందిన పాయల్ కాంచన్ చిన్నప్పటి నుంచే ధైర్యం కలవారు. అందుకే పోలీస్రంగాన్ని ఎంచుకున్నారు. పోలీస్ అకాడమీలో వీళ్లద్దరూ ఒకే గదిలో కలిసిఉండేవారు. బయటకొచ్చాక కలిసి బతుకుదామనుకున్నారు. కానీ ఇరు కుటుంబాలు ఒప్పుకోలేదు. అయితే ప్రస్తుతం వీళ్లు ఏమంటున్నారంటే.. ఎవరు అడ్డుచెప్పినా మేం మనసు మార్చుకోము. మేం కలిసే బతుకుతాం. ఓ అమ్మాయిని దత్తత తీసుకుంటాం. ఈ కరోనా తగ్గాక దక్షిణభారతదేశం వెళ్లి అక్కడే జీవనం సాగిస్తాం. అంటున్నది ఈ జంట.

# విశాఖ రూరల్

## మోదకొండమ్మకి ప్రత్యేక పూజలు



**మాడుగుల, వార్తావళి, సెప్టెంబర్ 7 :** స్థానిక మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువజాము 6 గంటల నుంచి అమ్మవారికి అలంకరణ చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మాడుగుల ప్రాంతీయులు ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు కూడా అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తగు చర్యలు తీసుకున్నారు. కోవిడ్ నిబంధనల ఈ కారణంగా గత నెల రోజులుగా మూతపడిన ఆలయం ఎట్టకేలకు తెరచుకోవడంతో భక్తుల తాకిడి మొదలైందని చైర్మన్ ఈ సందర్భంగా తెలిపారు ఆది, మంగళవారాల్లో భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు విధిగా రావొచ్చని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## నూతన్ నాయుడు అరెస్టు హర్షణీయం



**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 7 :** శిరో మండనం కేసులో సూత్రధారి నూతన్ నాయుడు అరెస్టు హర్షణీ యం అని మాలమహానడు అనకా పల్లి నియోజకవర్గ అధ్యక్షులు రేబాక రామారావు. సీఎం వై స్ జగన్మోహన్ రెడ్డి గారికి ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటివరకు దళితులుకు విశాఖపట్నం లో ఇంత వరకు ఇంత త్వరగా స్పందిచి సత్వరం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు అని. ఇంత త్వరగా చర్యలు తీసుకునందుకు పోలీసు వారికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే దళిత అధికారులను మోసగించి నూతన్ నాయుడు పై మరో అట్రాసిటీ కేసు నమోదు చేయాలి అని. శ్రీకాంత్‌కు ప్రభుత్వం తరపున పూర్తి స్థాయిలో సహకారం అందించాలని కోరారు. దళితులుపై దాడులలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఇది దళిత ప్రభుత్వం అని జగన్మోహన్ రెడ్డి గారితో దళితులు అభ్యున్నతి అని నమ్ముతున్నామని రేబాక రామారావు తెలిపారు.

## జీవో549ని వెంటనే అమలు చేయాలి

### ఏఐటియుసి జిల్లాకార్యదర్శి కోన లక్ష్మణ



**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 7 :** కరోనా కష్టకాలంలో ప్రాణాలు సైతం లెక్క చేయకుండా కోవిడ్ సెంటర్ లలో ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు జివోనెంబర్ 549ని అమలు పరచి రూ 16,000లు వేతనాలు వెంటనే చెల్లించాలని ఏటియుసిజిల్లా కార్యదర్శి కోన.లక్ష్మణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళారీ వ్యవస్థ నిర్మూలనలో భాగంగా ఔట్ సోర్సింగ్ , శానిటేషన్, సెక్యూరిటీ పెస్ట్ కంట్రోల్ సిబ్బంది అందరిని ఆప్కోస్ కార్పొరేషన్ పరిధిలోకి తీసుకోవాలని, బకాయిపడ్డ జీతాలు చెల్లించాలని, అలాగే ప్రభుత్వ ఉత్తర్వులు నెంబర్ 101 ప్రకారం ప్రతి నెల ఒకటో తేదీన బ్యాంక్ ద్వారా కార్మికుల వేతనాలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ మినహాయింపులు ఆయా సంస్థల్లో జమ చేయాలని కోరారు అదేవిధంగా కోవిడ్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి క్వారంటైన్ సెలవలు, డ్యూటీ లో ఉండి చనిపోయిన కాంట్రాక్ట్ .ఔట్ సోర్సింగ్, శానిటేషన్ ,సెక్యూరిటీ పెస్ట్ కంట్రోల్ సిబ్బందినికి ప్రధానమంత్రి గరభ్ కళ్యాణ్ యోజన పథకం కింద 50 లక్షల బీమా సౌకర్యం కల్పించి నిరాశ్రయన కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని లక్ష్మణ డిమాండ్ చేశారు.

## అంతర్వేదిలో అపశృతిపై సి.బి.ఐ.విచారణ జరిపించాలి

### బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు బొట్టా చిన్ని యాదవ్



**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 7 :** నవ నరసింహ క్షేత్రంలో ఒకటిగా ప్రసిద్ధి గాంచిన తూర్పుగోదావరి జిల్లా, సఖినేటి పల్లి మండలంలో ,అంతర్వేది లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయం ఆవరణలో స్వామి వారి ఊరేగింపు దివ్యరథం మంటల్లో దగ్ధం అవ్వడం దురదృష్టకరమని, ఇది ప్రమాదవశాత్తుతో జరిగిందా, లేదా ఏదైనా కుట్రకోణం దాగి ఉందా అని సమగ్ర దర్యాప్తు జరిపించాలని యాదవ్ అన్నారు, రథం కాలిపోయిన విధానాన్ని నిశితంగా పరిశీలిస్తే అనుమానాలకు దారి తీస్తుందని, కింద నుంచి పైదాక ఒకేసారి రథం తగల పడడం అనుమానాస్పదంగా ఉందని, ఒకవేళ కరెంటు షార్ట్ సర్క్యూట్ జరిగి ఉంటే ఈ విధంగా రథం పూర్తిగా బూడిదయ్యే అవకాశం లేదని అన్నారు, ఇది ఒక మతం పై జరిగిన దాడిల కనిపిస్తుందని హిందువుల విశ్వాసాలను దెబ్బతీయాలనే కోణంలో ఎవరైనా ప్రయత్నిస్తున్నారు ఏమో అని భక్తులు భయ ఆందోళన చెందుతున్నారని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఈ దుర్ఘటనపై స్పందించి సిబిఐ ఎంక్వైరీ వేసి సమగ్ర విచారణ జరిపించాలని, దోషులను పట్టుకొని, వారి వెనక ఉన్న వారు ఎంత పెద్ద వారైనా వదిలిపెట్ట వద్దని కఠినంగా శిక్షించి హిందువుల మనోభావాలను కాపాడాలని యాదవ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు.

## జి.ఓ.నెంబర్ 22 తక్షణం రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలి

### కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జ్ ఐ.ఆర్.గంగాధర్



**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 7 :** రైతులకు ఉచిత విద్యుత్ పథకాన్ని నిర్వీర్యం చేసే జి.ఓ.నెంబర్ 22 తక్షణం రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని అనకాపల్లి అసెంబ్లీ నియ్జెజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జ్ ఐ.ఆర్.గంగాధర్ డిమాండ్ చేసారు.రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు సోమవారం అనకాపల్లి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం అనకాపల్లి ఆర్.డి.ఓ. కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్బంగ గంగాధర్ మాట్లాడుత్ను..2004లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఉచిత విద్యుత్ పథకాన్ని అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి అమలులోనికి తీసుకు వచ్చారని గంగాధర్ గుర్తు చేసారు.అప్పటి నుండి రైతులకు మేలు చేస్తున్న పథకాన్ని కొనసాగుతుందని గంగాధర్ అన్నారు.ఈ పథకానికి గండి కొట్టే విధంగ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ.నెంబర్ 22 ని తీసుకొచ్చి రైతుల సాగుభ్నుమి నుండి భారీగ రుసుములు వస్నులు చేసే విధంగ కుట్ర చేస్తుందని గంగాధర్ ఆరోపించారు.రైతుల జీవితాలతో ఆడుకోవటం మంచి పద్ధతి కాదని గంగాధర్ అన్నారు.అనంతరం సమస్యలతో క్నుడిన వినతి పత్రాని ఆర్.డి.ఒ.గారికి అందజేసారు.ఈ కార్యక్రమంలో అనకాపల్లి పట్టణ కాంగ్రెస్ కమిటీ కన్వీనర్ తుట్టా రమణ,మండల కాంగ్రెస్ కమిటీ కన్వీనర్ ఎగ్గాడ భాస్కరరావు,జిల్లా య్నుత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి సంతోష్,జిల్లా కాంగ్రెస్ బి.సి.సెల్ నాయకుడు గౌరీపట్నపు గున్నబాబు, జిల్లా కాంగ్రెస్ నాయకురాలు ఏడువాకల దేముడమ్మ, కొల్లి కనకరావు, కనరదుర్గారావు, నాయుడు మ్నెదలగు వారు పాల్గొన్నారు.

## శ్రీవారి భక్తులకు టీటీడీ క్షమాపణలు చెప్పాలి!!

### టిడిపి మాజీ దేవస్థాన చైర్మన్ మళ్ళ సురేంద్ర



**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 7 :** టిటిడి అధికారుల తొందరపాటు నిర్ణయాల కారణంగా భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని, ప్రభుత్వ ప్రతిష్ట మసకబారుతోందని మాజీ దేవస్థాన చైర్మన్ మళ్ల సురేంద్ర విమర్శించారు. ఆయన మాట్లాడుతూ టీటీడీ ఇచ్చిన పత్రికా ప్రకటనలో తిరుమల కొండపై కోవిడ్ ఇన్ఫెక్షన్ ను అరికట్టేందుకు శ్రీవారి సర్వ దర్శనం టైం స్లాట్ దర్శనాలను సెప్టెంబర్ 30 వరకు నిలుపుదల చేస్తున్నాం అని ప్రకటించారు సరే!!...మరి తిరుమలకు సర్వ దర్శనం టైం స్లాట్ సామాన్య భక్తులు ఎక్కువగా వస్తే కోవిడ్ ఇన్ఫెక్షన్ ఎక్కువ అవుతుందా?? మరి శ్రీ వాణి ట్రస్ట్ టికెట్లు అలాగే ప్రముఖుల సిఫార్సు లేఖలు తెచ్చే విఐపి భక్తుల ద్వారా తిరుమల కొండపై కొవిడ్ ఇన్ఫెక్షన్ రాధా?? తిరుమలలో కోవిడ్ ఇన్ఫెక్షన్ పూర్తిగా అరికట్టాలంటే అన్ని దర్శనాలకు సేవలకు భక్తులను అనుమతించడం పూర్తిగా రద్దు చేస్తారా?? అని సురేంద్ర ప్రశ్నించారు.

## సుజల స్రవంతి ప్రాజెక్టును త్వరతిగతిన పూర్తిచేయండి

### మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ




**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 7 :** వెనుకబడిన ఉత్తారాంధ్రా జిల్లాల రైతుల జీవనాడీ ఐన బాబు జగజీవన్ రామ్ ఉత్తారాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టును త్వరతిగతిన పూర్తి చేయాలని ఆదివారం మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ ఇంచార్జ్ "శ్రీ పీలా గోవింద సత్యనారాయణ గారు" ప్రభుత్వాన్ని కోరారు.గత ప్రభుత్వంలో మంజూరుఐన కేంద్రీయ విద్యాలయం నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. తుమ్మపాల ఆనకట్టు నిర్మాణాన్ని "వైకాపా ప్రభుత్వం విస్మరించిందని" ఆయన ఆరోపించారు. ఈ రోజు గవరపాలెం లోని స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలోమాట్లాడారు. ఉత్తారాంధ్రా రైతుల వెనుకబాటు తనాన్ని దృష్టిలో పెట్టుకొని గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు సుమారు 2500కోట్ల రూపాయల వ్యయంతో శంకుస్థాపన చేసి, కశింకోట మండలం, జమ్మాదుల పాలెం-ఉగ్గినపాలెం మధ్యన లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు,చదరం శివ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని సద్వినియోగం చేసుకొండి

### ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిని అనంతలక్ష్మి



**మాడుగుల, వార్తావళి, సెప్టెంబర్ 7 :** రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని గర్భిణీలు, బాలింతలు సద్వినియోగపర్చుకోవాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిని జి.అనంతలక్ష్మి అన్నారు. సోమవారం మాడుగుల సచివాలయం-2లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ప్రారంబించిన ఆమె గర్భిణిలు, బాలింతలతో నిర్వహించిన సమావేశంలో, ప్రతీనెల పౌష్టికాహారం ఏ విధంగా అందుతుందని అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని అన్నారు. రక్తహీనతను అరికట్టి ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిచ్చే విధంగా అంగన్వావాడీ అందిస్తున్న పౌష్టిక ఆహారాన్ని వాడాలని అన్నారు. అలాగే లాక్‌డౌన్ నేపధ్యంలో పౌష్టిక ఆహారం నేరుగా గర్భిణీలకు, బాలింతకు అందించడం జరుగుతుందని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో పనిచేస్తున్న కార్యకర్తలు అన్ని విధాలుగా సమయపాలన పాటించి గర్భిణీ, బాలింతలకు పౌష్టిక ఆహారాన్ని అందిస్తున్నారని అన్నారు. కొన్ని అంగన్వాడీ కేంద్రాలలో నిర్వాహణ కుంటిపడుతుందనే వదంతులు వస్తున్నాయని, అలా రాకుండా ప్రతీ ఒక్కరూ విధులను సక్రమంగా నిర్వర్తించాలని అన్నారు. అలా కాకుండా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని కార్యకర్తలకు సూచించారు. ఈ వైయస్ఆర్ సంపూర్ణ పథకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సోమవారం లాంఛనంగా ప్రారంభించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు డి పద్మావతి, హెచ్ టెల్మా, శ్రీలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు నారం కొండాజీ, లంక వరలక్ష్మి, తుమ్మలపూడి జయలక్ష్మి, గండిం దేవి, గాడి ఉమ, పావని, అంగార దేవి, సరోజని తదితరులు పాల్గన్నారు.

## ఆర్అండ్‌బి ఏఈఈగా పద్మిని

**మాడుగుల, వార్తావళి, సెప్టెంబర్ 7 :** ఆర్అండ్‌బి శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) గా పద్మిని ఇక్కడ నియమించబడ్డారు. ఇప్పటి వరకూ మూడేళ్ల పాటు ఇక్కడ డిప్యూటీగా ఏఈఈగా పని చేసిన వెంకట గౌరీ ప్రసాద్ తిరిగి కె.డి.పేట యథాస్థానానికి వెళ్లారు. పద్మినిని ఆర్అండ్‌బి ఏఈఈగా పబ్లిక్ సర్వీస్ కమీషన్ ద్వారా నియమించారు.

## లంచగొండుల భరతం పడుతున్న ఏసీబీ..

లంచం .. దేశంలో ప్రతి ఒక్కరిని పట్టి పీడిస్తున్న అతి పెద్ద మహమ్మారి. చిన్న పని నుండి పెద్ద పని వరకు ప్రభుత్వ ఆఫీసుల్లో పని జరగాలంటే లంచం ఇవ్వాల్సిందే. అసలు కొన్ని చోట్ల ప్రభుత్వ అధికారులని కలవాలన్న కూడా లంచం ఇవ్వాల్సిందే. ఈ లంచాలు ఇవ్వలేక ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరగలేక కొంతమంది ఆత్మహత్యకి పాల్పడుతుంటారు. ఈ తరహా ఘటనలు చాలా జరిగాయి. అయితే ఈ పరిస్థితులు మళ్లీ కనిపించకూడదు అని లంచం అన్న మాట కూడా ప్రభుత్వ ఆఫీసుల్లో వినిపించకూడదు అని సీఎం వైఎస్ జగన్ చేసిన ఆదేశాలతో అవినీతి నిరోధక విభాగం లంచ గొండుల పై ఉక్కుపాదం మోపుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాల్లో పెద్ద ఎత్తున దాడులకు శ్రీకారం చుట్టింది. అలాగే అవినీతి నిరోధానికి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన '14400' కాల్ సెంటర్లకు పెద్దఎత్తున కాల్స్ వస్తుండడంతో వాటిపై ఏసీబీ వేగంగా స్పందిస్తోంది. ఇప్పటికే ఈ కాల్సెంటర్ పై ప్రజల్లో అవగాహన బాగా పెరిగినప్పటికీ సీఎం ఆదేశాల మేరకు మరింతగా ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు దీనికి విస్తృత ప్రచారం కల్పించాలని నిర్ణయించింది. అలాగే లంచగొండులపై నిఘాను ముమ్మరం చేసింది. గత ఏడాది నవంబర్లో '14400' కాల్ సెంటర్ ను ప్రారంభించారు. అప్పటి నుండి ఇప్పటివరకు ఈ కాల్ సెంటర్ కు 44999 కాల్స్ రాగా ఇందులో అవినీతికి సంబంధించిన కాల్స్ 1747 ఉన్నాయి. ఇందులో 1712 ఫిర్యాదులను పరిష్కరించారు. మరో 161 కాల్స్ పై చర్యలు తీసుకుంటున్నారు. ఈ కాల్ సెంటర్ ద్వారా వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా 13 ట్రాప్ కేసులను కూడా ఏసీబీ నమోదు చేసింది. మూడు కేసుల్లో క్రిమినల్ దుష్ప్రవర్తన చర్యలను చేపట్టింది. మరో 67 ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. అలాగే 46 రెగ్యులర్ విచారణలు.. 32 డిస్ట్రిక్ట్ విచారణలను చేపట్టారు. దీంతో ఈ కాల్ సెంటర్ సూపర్ హిట్ అయ్యిందని అధికార వర్గాలు చెబుతున్నాయి. అలాగే వస్తున్న కాల్స్ ద్వారా ఏఏ శాఖల్లో ఏఏ అంశాలపై అక్రమార్కులు ప్రజలను లంచాలు డిమాండ్ చేస్తున్నారో ఏసీబీ గుర్తించింది. దీని ద్వారా ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన వారి పై ప్రత్యేక దృష్టి పెట్టారు. ముఖ్యంగా రెవెన్యూ పంచాయతీరాజ్ పోలీసు మున్సిపల్ వైద్య ఆరోగ్య విద్య విద్యుత్ శాఖల్లో అక్రమార్కులపై ప్రధానంగా నిఘా పెట్టనుంది.

## 10న ఉద్యోగ నియామక ఎంపిక: డి.ఆర్.డి.ఏ పి.డి బి.నగేష్

**శ్రీకాకుళం, వార్తావళి, సెప్టెంబర్ 7 :** హనర్ ల్యాబ్, శ్రీసిటీ మరియు గ్రీన్ టెక్ ఇండస్ట్రీలలో ఉద్యోగ నియామకాల కొరకు ఈ నెల 10న ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు బి.నగేష్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేసారు. సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్ ప్రైజ్ డెవలప్ మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ( సిడాప్ ) మరియు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా హైదరాబాద్ లోని హనర్ ల్యాబ్, నెల్లూరు లోని శ్రీసిటీ,గ్రీన్ టెక్ ఇండస్ట్రీలలో ఉద్యోగ నియామకాల కొరకు ఈ నెల 10న ఎచ్చెర్ల టి.టి.డి.సిలో ఉదయం 09.30గం.ల నుండి మధ్యాహ్నం 01.00గం. వరకు ఎంపిక ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. హనర్ ల్యాబ్ లో పనిచేయుటకు బి.టెక్ కెమికల్ ఇంజినీరింగ్ అభ్యర్థులకు నెలకు రూ.20 వేలు, బి.యస్.సి పురుష అభ్యర్థులకు రూ.17 వేల 500 వేతనంతో పాటు కంపెనీ నిబంధనల మేరకు భోజన సదుపాయం కల్పించబడునని ఆయన చెప్పారు. నెల్లూరు జిల్లా శ్రీసిటీ నందు గల మొబైల్ తయారీ కంపెనీలో పనిచేయుటకు పదో తరగతి పాసై 18 ఏళ్లు పూర్తిచేసుకున్న మహిళా అభ్యర్థులకు రూ.10వేలు జీతంతో పాటు భోజన, వసతి సౌకర్యం కల్పించబడుతుందని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా నెల్లూరు జిల్లా నాయుడుపేట నందు గల గ్రీన్ టెక్ ఇండస్ట్రీలో పనిచేయుటకు బి.టెక్ మెకానికల్ 2017-19 సం.లలో పాసైన పురుష అభ్యర్థులు, పదో తరగతి, ఇంటర్ , ఐ.టి.ఐ, డిప్లొమాలలో పాసైన పురుష అభ్యర్థులకు రూ.10వేల నుండి రూ.12 వేల వరకు జీతంతో పాటు భోజన వసతి సదుపాయం కల్పించడం జరుగుతుందని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువత ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పై ఉద్యోగాల కొరకు ఇంటర్వ్యూనకు హాజరగు అభ్యర్థులు తమ విద్యార్హత ధృవపత్రాలతో పాటు బయోడేటా, ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని ఆయన ఆ ప్రకటనలో స్పష్టం చేసారు.

## బాలు కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి



**మాడుగుల, వార్తావళి, సెప్టెంబర్ 7 :** స్థానిక టీడీపీ సీనియర్ కార్యకర్త వాలంకి బాలు మాతృమూర్తి వాలంకి వరలక్ష్మి ఇటీవల అకాల మరణం చెందింది. ఆమె సంతాప సభ స్థానిక జగ్నచావిడి ఇంటివద్ద ఏర్పాటు చేశారు. ఈ సంతాప సభకు మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు హాజరయ్యారు. ఆమె కుటుంబాన్ని పరామర్శించి, హొూదార్చరు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ పార్టీ ఆవిర్భావం నుంచి కార్యకర్త, నాయకుడు అన్న తారతమ్యం లేకుండా ఒక కుటుంబ సభ్యుల్లా కలసిమెలసి పనిచేసిన పరిస్థితి ఉందని అన్నారు. ఎక్కడ ఏ కార్యకర్తకు, నాయకులకు ఆపద వచ్చిన పరామర్శించి ధైర్యం చెప్పాల్సిన బాధ్యత ఉందని ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గండి శ్రీను, త్రినాద్ పలువురు టీడీపీ కార్యకర్తలు ఉన్నారు.

## ట్రంప్ వ్యాక్సిన్ వ్యాఖ్యలపై కమల మార్క్ చురకలు



అమెరికా చరిత్రలో ఎప్పుడూ చోటు చేసుకోని ఒక పరిస్థితి ట్రంప్ హయాంలో చోటు చేసుకుందని చెప్పాలి. వైరస్ కావొచ్చు.. యుద్ధం కావొచ్చు.. మరేదైనా కావొచ్చు.. ఒక ఎపిసోడ్ కు సంబంధించిన అత్యధిక అమెరికన్లు ప్రభావితం కావటం.. ప్రాణాలు కోల్పోవటం అన్నది కరోనా వేళలోనే అని చెప్పాలి. తనకు నచ్చని దేశంపై కాలు దువ్వే అగ్రరాజ్యం.. తన ఆగ్రహావేశాలకు సదరు దేశాలు దారుణమైన మూల్యం చెల్లించే పరిస్థితి. అందుకు భిన్నంగా అక్కడెక్కడో చైనాలోని వూహాన్ లో పుట్టిన కొవిడ్ -19 మాత్రం.. అమెరికాను అతలాకుతులం చేసిందన్నది మర్చిపోకూడదు. కరోనా మహమ్మారి కారణంగా అమెరికన్లు కిందామీదా పడుతున్న వేళలోనే.. అమెరికా అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగటం దేశాధ్యక్షుడు ట్రంప్ కు ఇప్పుడో తలనొప్పిగా మారింది. కరోనాతో దారుణమైన అనుభవాల్ని చూసిన అమెరికన్లు.. తాజాగా జరిగే అధ్యక్ష ఎన్నికల్లో ఎలాంటి తీర్పు ఇవ్వనున్నారన్నది ఆసక్తికరంగా మారింది. ఇదిలా ఉంటే.. ట్రంప్ కు వైరిపక్షంగా నిలిచిన డెమొక్రాట్లు.. అనూహ్యంగా ఉపాధ్యక్ష పదవికి భారత-ఆఫ్రికన్ మూలాలు ఉన్న కమలా హ్యారీస్ ను అభ్యర్థిగా ప్రకటించటం తెలిసిందే. ఈ నిర్ణయంపై ట్రంప్ ఎంతలా విరుచుకుపడ్డారో.. మరెంతటి తీవ్ర వ్యాఖ్యలు చేశారో తెలిసిందే. ఇదిలా ఉంటే.. ఎన్నికల గడువు దగ్గర పడుతున్న కరోనా వ్యాక్సిన్ పై అమెరికన్లలో కొత్త ఆశలు పుట్టించేలా ప్రయత్నిస్తున్నారు ట్రంప్. ఈ అక్టోబరు నాటికి వ్యాక్సిన్ వచ్చేస్తున్నట్లేనని చెబుతున్నారు. ఇలాంటి వ్యాఖ్యలతో ఓట్లు రాల్చుకోవాలన్న ఆలోచనలో ట్రంప్ ఉన్నట్లుగా చెప్పాలి. దీనికి ఘాటైన కౌంటర్ ఇచ్చారు కమలా హ్యారీస్. కరోనా వ్యాక్సిన్ అక్టోబరులో అందుబాటులోకి రావొచ్చని ట్రంప్ చెబుతున్న మాటల్ని తాను నమ్మనని.. ఆమె వెల్లడించారు. వ్యాక్సిన్ సమర్థత.. పనితీరుపై విశ్వసనీయ సమాచారం ఉంటే తప్పించి.. ట్రంప్ మాటల్ని తాను నమ్మనని చెప్పిన ఆమె.. కరోనా కారణంగా అమెరికాకు జరిగిన నష్టాన్ని ఏకరువు పెట్టారు. ఈ మహమ్మారి కారణంగా ఇప్పటివరకూ 1.91 లక్షల మందికి పైనే అమెరికన్లు మరణించారని.. 63 లక్షల మంది ఈ వైరస్ బారిన పడిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. నవంబరు 3న జరిగే అధ్యక్ష ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకునే వ్యాక్సిన్ పై ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. తానేదో చేశానని చెప్పటానికే ట్రంప్ ప్రయత్నిస్తున్నారని.. ఆయన మాటల్ని పట్టించుకోవద్దని ఆమె చెబుతున్నారు. మరి.. అమెరికన్లు ఎవరి మాటలు విన్నారు? ఎవరి మాట ప్రభావానికి లోనయ్యారన్న విషయం అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలు తేలుస్తాయని చెప్పక తప్పదు.

# విశాఖపట్నం

## గోద్రేజ్ జెర్సీగా మారిన జెర్సీ..




**విశాఖపట్నం, వార్తావళి, సెప్టెంబర్ 7:** క్రీమ్ లైన్ డెయిరీ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (సీడీపీఎల్) తమ జెర్సీ బ్రాండను గోద్రేజ్ జెర్సీగా మార్చింది. మాస్టర్ బ్రాండ్ గోద్రేజ్‌తో ఏకీకరణ ద్వారా, గత 84 సంవత్సరాలుగా నిర్మించుకున్న నమ్మకాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. ప్రతిష్టాత్మకమైన బ్రాండ్ గోద్రేజ్‌తో తమ అనుబంధాన్ని దృష్టిలో పెట్టుకుని నూతన, మెరుగైన బ్రాండ్ గుర్తింపును సృష్టించడం ఆరంభించింది. ఈ క్రమంలోనే జెర్సీ ఇప్పుడు గోద్రేజ్ జెర్సీ అయింది. పునరావిష్కరణ గురించి రాజ్ కన్వర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, క్రీమ్స్ లైన్ డెయిరీ ప్రొడక్ట్స్ లిమిటెడ్ మాట్లాడుతూ ఆరోగ్యం కోసం పోషకాలకు అత్యవసరమైన పదార్థాలుగా పాలు, పాల ఉత్పత్తులు నిలుస్తుంటాయి. జీవితంలో విజయం సాధించడానికి అవసరమైన నమ్మకాన్ని నిర్మించే అత్యవసర పోషక ప్రదాతగా గోద్రేజ్ జెర్సీని నిలిపే రీతిలో దీనిని ఆవిష్కరించాం. ఈ బ్రాండ్ వాగానాన్ని నూతన ట్యాగ్ లైన్ 'మీలోని విజేతను పోషించండి' ద్వారా వెల్లడించనుంది. ఈ నూతన లోగో చిరునవ్వుకు ప్రతిరూపంగా నిలువడంతో పాటుగా విభిన్నమైన ఉత్పత్తి విభాగాల వ్యాప్తంగా వాటాదారులను ప్రతిఫలిస్తుందని అన్నారు.

## మంత్రి, జిల్లా కలెక్టర్‌లను మర్యాదపూర్వకంగా కలసిన ద్యాన్ చంద్ అవార్డు గ్రహీత ఉష



**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, సెప్టెంబర్ 7:** ద్యాన్ చంద్ అవార్డు గ్రహీత, అంతర్జాతీయ క్రీడాకారిణి (బాక్సింగ్, మహిళా విభాగం) ఎన్. ఉష, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్ లను కలక్టరు చాంబర్ లో మర్యాద పూర్వకంగా కలిసారు. మరిన్ని అవార్డులు తీసుకువచ్చి భవిస్యత్ తో మరింత ప్రతిభ కనపరచాలని మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మరియు జిల్లా కలక్టరు వి. వినయ్ చంద్‌లు అభిలషించారు. ఈ కార్యక్రమంలో సెట్విస్ సిఇఓ బి. శ్రీనివాసరావు, జిల్లా క్రీడా అధికారి ఎన్. సూర్యారావు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత, బాక్సింగ్ కోచ్ ఐ. వెంకటేశ్వరరావు, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి బి. అప్పన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యకర సమాజ నిర్మాణమే వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ లక్ష్యం

### పాడేరు శాసన సభ్యురాలు శ్రీమతి కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



**పాడేరు, వార్తావళి, సెప్టెంబర్ 7:** ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే వై ఎస్ ఆర్ సంపూర్ణ పోషణ లక్ష్యమని పాడేరు శాసన సభ్యురాలు శ్రీమతి కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం ఐటిడి ఏ సమావేశ మందిరంలో వై ఎస్ ఆర్ సంపూర్ణ పోషణ ప్రారంభోత్సవానికి ఆమె ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు సంపూర్ణమైన పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన రెడ్డి వై ఎస్ ఆర్ సంపూర్ణ పోషణ, వై ఎస్ ఆర్ సంపూర్ణ పోషణ ప్లస్ కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. భారత దేశంలో మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా ఆంధ్ర ప్రదేశ్ లో సంక్షేమ పధకాలు అమలు చేస్తున్నారన్నారు. గిరిజన ప్రాంతంలో బాలింతలకు , గర్భిణీలకు సంపూర్ణ పోషణ సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పోషకాహారానికి ముఖ్య మంత్రి అదనపు పోషకాహారాన్ని జోడించి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. సకాలంలో పోషకాహారాన్ని లబ్దిదారులకు పంపిణీ చేయాలని సూచించారు. లబ్దిదారులకు పంపిణీ చేసిన పాలు, గుడ్లు లబ్దిదారులు సక్రమంగా వినియోగించేలా అవగాహన కల్పించాలని, బంధువులు ఇంటికి వచ్చినపుడు, టీలు, కాఫీలకు వినియోగించకూడదన్నారు. ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు సమన్వయంతో గర్భవతులకు రెగ్యులర్ గా వైద్యపరీక్షలు చేయించాలన్నారు. పాడేరు నియోజక వర్గంలో ఏడు నుంచి 6 సంవత్సరాల పిల్లలు 35,548 మంది, గర్భవతులు, బాలింతలు 8677 మంది లబ్ధిదారులు వై ఎస్ ఆర్ సంపూర్ణ పోషణ ప్లస్ పథకం ద్వారా ప్రయోజనం పొందుతారన్నారు. పాడేరు సిడిపి ఓ కార్యాలయంలో సమావేశాలు నిర్వహించడానికి సమావేశ మందిరం, మరుగుదొడ్లు నిర్మాంచాలని పి. ఓను కోరారు. ప్రాజెక్టు అధికారి సానుకూలంగా స్పందించి నిర్మిస్తామని పేర్కొన్నారు.

## బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధికి ప్రభుత్వం పలు కార్యక్రమాలు

### రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు



**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, సెప్టెంబర్ 7:** బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం పలు కార్యక్రమాల ను అమలు చేస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు.. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఆవరణంలో ఎస్.సి. కార్పొరేషన్ ద్వారా లబ్దిదారులకు వాహనాలను మంత్రితో పాటు జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్, రెల్లి కార్పొరేషన్ అధ్యక్షులు మధుసూధనరావు పాల్గొని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎస్.సి., ఎస్.టి., బి.సి., మైనారిటీలు, మహిళలు సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కట్టుబడి, అహర్నిశలు శ్రమమిస్తున్నారని తెలిపారు. మొత్తం ఖరీదు రూ.2.91 కోట్లతో 17 ఇన్నోవా (బిఎస్6-మోడల్) వాహనాలను 17 మంది లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఇందులో ఒక కారు ఖరీదు రూ.17,14,747/-లని, ఇందులో ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ రూ.6,00,161/-లని, ఎన్.ఎస్.ఎఫ్.డి.సి. ఋణంగా రూ.10,74,586/-లని ఆయన వివరించారు. మొత్తం సబ్సిడీ రూ.1.02 కోట్లు, ఋణంగా రూ.1.82/- కోట్లని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోవిందరావు, ఎస్.సి. కార్పొరేషన్ కార్యనిర్వహక అధికారి ఎం.ఎస్. సోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

## 'ముత్యాల జల్లు' పుస్తకావిష్కరణ



**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, సెప్టెంబర్ 7:** ప్రముఖ రచయిత్రి దామారాజు విశాలాక్షి రచించిన ముత్యాల జల్లు బాలల గేయ సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రపంచా క్షరీ సాంకేతిక వేదిక ఆధ్వర్యంలో ఆన్లైన్లో నిర్వహించిన ఈ సభలో రచయిత్రి మనుమడు శౌర్య సాయి చేతులమీదుగా కెనడా నుండి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్ర విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు మలయ వాసిని మాట్లాడుతూ విశాలాక్షి గారి రచనలలో బాలలకు మంచి విలువలను నేర్పించే గేయాలు సరళమైన భాషలో అందించారని దీనివలన వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన బీజాలు పసితనంలోనే మనసులో నాటు కుంటాయని అన్నారు. పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ ఫోను ద్వారా అందించిన సందేశంలో ముత్యాల జల్లులో పలు గేయాలు పాడుకోవడానికి వీలుగా మంచి ఆలోచనలు పెంచేవిగా వున్నాయని అభినందించారు. కెనడా, స్వీడన్, అమెరికా భారత దేశాలనుండి పలువురు సాహితీ ప్రముఖులు పాల్గొన్న ఈ సమావేశానికి ప్రముఖ కవి గరిమెళ్ళ నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా పుస్తక సమీక్ష పీ. కే.జయలక్ష్మి, కొంపెల్ల కామేశ్వరరావు చేశారు. రచయిత్రిని కార్యక్రమం చివరిలో ఘనంగా సత్కరించారు.

## వంట మాస్టర్ల ఆకలి కేకలు




**విశాఖపట్నం, ఉత్తరం, వార్తావళి, సెప్టెంబర్ 7:** కరోనా వైరస్,లాక్ డౌన్ కారణంగా దాదాపు నూట ఎనభై రోజులుగా నరకయాతన అనుభవిస్తున్నామని ఉత్తరాంధ్ర వంట మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జీ.వెంకటరమణ ఆవేదనగా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వంట మాస్టర్ లను ఆదుకోవాలని కోరుతూ ఈ రోజు విశాఖ కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో వెంకటరమణ మాట్లాడుతూ లాక్ డౌన్ నేపథ్యంలో ఎటువంటి శుభకార్యాలు లేక ఉపాధి కోల్పోయామని, ఆర్ధికంగా ఎన్నో ఇబ్బం దులు పడుతున్నామని అన్నారు. ఉత్తరాంధ్ర వంట మాస్టర్ల అసోసియేషన్లో 361మంది సభ్యులు ఉన్నారన్నారు. అప్పులు దొరక్క, తీసుకున్న అప్పులకు వడ్డీలు కట్టలేక, కుటుంబా లతో అనేక ఇబ్బందులు పడుతున్నామని, ఒకపూట తింటే ఇంకొక పూట పస్తులుంటున్నామన్నారు. శుభకార్యాల్లో అందరికీ వంటచేసి పెట్టే తాము ఇప్పుడు ఆకలికి తాళలేక మంచినీరు తాగి బతుకుతున్నామన్నారు. అన్ని వర్గాలవారికి సహాయమందిస్తున్న జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం తమకు కూడా సహాయంచేసి ఆదుకోవాలని వెంకట రమణ కోరారు. ఈ ధర్నాలో ఉపాధ్యక్షుడు నరసింగరావు,కార్యదర్శి గోపి, కోశాధికారి భీమరాజు, సభ్యులు రాంబాబు, ఈశ్వరరావు, రామలక్ష్మి, అప్పాయమ్మ పాల్గొన్నారు.

## కోవిడ్ రోగులకు మెరుగైన కార్పొరేట్ సేవలు: పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు




విశాఖపట్నం, సెప్టెంబరు 7: కింగ్ జార్జి ఆసుపత్రిలో నిర్మించిన సి.ఎస్.ఆర్. బ్లాక్ లో కరోనా రోగులకు మెరుగైన కార్పొరేట్ సేవలు అందజేస్తారని పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన సి.ఎస్.ఆర్. బ్లాక్ ను సందర్శించారు. విభాగంలో నున్న గదులు, పరికరాలు, అందుబాటులో వున్న సేవలను పరిశీలించారు. కరోనా రోగులకు అందజేసే సౌకర్యాలు, చికిత్సలను గూర్చి అడిగి తెలుసుకున్నారు. కె.జి.హెచ్. పర్యవేక్షకులు డాక్టర్ పి.వి. సుధాకర్ అక్కడ గల సౌకర్యాలను గూర్చి తెలిపారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పేదలందరికీ విద్య, వైద్య సేవలు కార్పొరేట్ స్థాయిలో అందించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. కరోనా నియంత్రణకు వైద్యులు, సిబ్బంది తమ ప్రాణాలకు తెగించి సేవలు చేస్తున్నారని, వృత్తిలోని నిబద్ధత, నిజాయితీలను ప్రదర్శిస్తున్నారని ప్రశంసించారు. సిఎస్ఆర్ నిధులతో నిర్మించిన విభాగంలో ప్రస్తుతం కోవిడ్ రోగులకు మెరుగైన కార్పొరేట్ స్థాయి చికిత్స అందించ నున్నట్లు వెల్లడించారు. ఆసుపత్రిలో 500 పడకలు, 175 వెంటిలేటర్లు వున్నాయని చెప్పారు. దీనితో నగరంలో మొత్తం 1200 పడకలతో కరోనా బాధిత పేదలకు ఉచిత సేవలు అందుబాటులోనికి రానున్నట్లు చెప్పారు. నగరంలో ఛాతీ ఆసుపత్రి,ఈఎన్ టీ ఆసుపత్రులు, ఉత్తరాంధ్ర నాలుగు జిల్లాలకు సంబంధించి విమ్స్ ఆసుపత్రిలో ప్రభుత్వ సేవలు అందుబాటులో వుండగా అదనంగా సిఎస్ఆర్ బ్లాక్ చేరిందన్నారు. జిల్లాలోని అన్ని పిహెచ్ సిలలో కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.జి.హెచ్. సూపరింటెండెంట్, ఎ.ఎమ్.సి. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.సుధాకర్, డాక్టర్ శాస్త్రి, పర్యాటకశాఖ ఆర్.డి. ఇతర వైద్యులు పాల్గొన్నారు.

# కొల్హాపూర్ శ్రీ మహాలక్ష్మి స్థల పురాణం

(త్యాగరాజన్ ఒంగోలు)

పురాణాలలో పేర్కొన్న ప్రకారం ఈ ఆలయం భారతదేశంలో శక్తి నివాసముండే 108 శక్తి పీఠాలలో ఒకటిగా విరాజిల్లుతోంది. మహాలక్ష్మిని ప్రేమగా అంబా బాయి అనికూడా పిలుస్తారు, ప్రతి సంవత్సరం లక్షల మంది భక్తులు ఈ చారిత్రక దేవాలయాన్ని సందర్శించి ఆమె దీవెనలను కోరుకుంటారు. ఈ మహాలక్ష్మి దేవాలయం కారణంగా, కొల్హాపూర్, భారతదేశంలోని ఒక ప్రసిద్ధ ఆధ్యాత్మిక కేంద్రంగా భావించబడుతుంది. 7 వ శతాబ్దం లోని ఈ దేవాలయాన్ని చాళుక్య వంశ రాజైన కరన్దేవ్ తిరిగి చాలాకాలం తరువాత దీని నిర్మాణాన్ని చేపట్టారు. ఈ పవిత్ర స్థల నిర్మాణ శైలి హేమండ్ పతి ప్రేరణతో చేయబడింది. ఈ ఆలయాన్ని యాదవ వంశీయులు 8 వ శతాబ్దంలో మరింత అందంగా తీర్చిదిద్దారని నమ్మబడింది. ఇక్కడ ఒక ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, సూర్యకిరణాలు ప్రతిరోజూ దేవతా విగ్రహానికి బంగారు సొగసులు అందిస్తూ తాకే విధంగా ఈ ఆలయం నిర్మించబడింది. నవరాత్రి వంటి పండుగల సమయంలో స్థానికులు, భారతదేశం అంతటా ఉన్న భక్తులు అంబాదేవి దర్శనం కోసం కొల్హాపూర్ కి తండోపతండాలుగా వస్తారు. ఈ సమయంలో ఈ ప్రాంతం ప్రకాశవంతమైన రంగులతో, సంగీతంతో ప్రతిధ్వనిస్తుంది. ఒక రాతి పీఠం మీద నాలుగు చేతులతోనూ, 40 కిలోగ్రాముల వజ్రాలతో తయారైన కిరీటంతోనూ మహాలక్ష్మీ కొలువై ఉంటుంది. 3 అడుగుల ఎత్తుగల నల్లరాతిపై మహాలక్ష్మీ ప్రతిమను చెక్కడం జరిగింది. ఆలయంలోని ఒక గోడపై శ్రీ యంత్రం చెక్కబడి ఉంది. దేవత యొక్క వాహనం రాతితో చేయబడిన సింహం ప్రతిమ వెనుక భాగంలో ఉంటుంది. కిరీటంపై విష్ణువు తల్పం అయిన శేషనాగు యొక్క చిత్రం ఉంటుంది. ఆమె నాలుగు చేతులలో గుర్తింపు కలిగిన నాలుగు వస్తువులు ఉంటాయి. కుడివైపు క్రింది చేతిలో మాలుంగ (సిట్రస్ జాతి ఫలం), ఎడమవైపు కింది చేతిలో పాత్ర ఉంటుంది. హిందూ పవిత్ర చిత్రాలలో ముఖం ఉత్తరవైపు లేదా తూర్పు వైపు చూసే విధంగా ఉంటుంది. ఈ దేవతా విగ్రహం




పశ్చిమవైపు చూసే విధంగా ఉంటుంది. చిన్న తెరిచిఉన్న కిటికీ పశ్చిమవైపు గోడకు ఉంటుంది. సూర్యాస్తమయం అయినపుడు సూర్యుని కిరణాలు ఈ కిటికీ గుండా ప్రతి సంవత్సరం 21 మార్చి మరియు 21 సెప్టెంబరు లలో మూడురోజులపాటు విగ్రహంపై పడతాయి. ఆలయ పరిసరాల్లో నవగ్రహాల, సూర్యుని, మహిసాసుర మర్ధని, విఠల్-రఖ్మయి, శివుడు, విష్ణువు, తుల్జా భవాని మరియు యితర విగ్రహాలు ఉంటాయి. వీటిలోకొన్ని విగ్రహాలు 11వ శతాబ్దానికి ముందువి కొన్ని కొత్తగా ప్రతిష్ఠించినవి. ఆలయం వద్ద మణికర్ణికా కుండం అనే కొలను ఉంది. ఆ కొలను ఒడ్డున విశ్వేశ్వర మహాదేవ్ విగ్రహం ఉంది. అమ్మవారికి రోజూ అయిదు సార్లు అర్చన జరుగుతుంది .ఉదయం అయిదు గంటలకు శ్రీ మహా లక్ష్మీ దేవికి సుప్రభాత సేవ చేస్తారు. కాకడ హారతి ఇస్తారు. ఉదయం ఎనిమిది గంటలకు షోడశోపచార పూజ నిర్వహిస్తారు. మధ్యాహ్నం, సాయంత్రాలలో పూజ, శేజ్ హారతి జరుపుతారు. అమ్మవారికి ప్రతి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. చైత్రమాసంలో వచ్చే పౌర్ణమితో పాటుగా నవరాత్రులపుడు అమ్మవారికి వేడుకలు జరుపుతారు. ప్రతి శుక్రవారం సాయంత్రాలలో, పౌర్ణమి నాడు, అమ్మవారిని ఆలయం వెలుపల ఊరేగిస్తారు.

**నిర్మాణ శైలి ....**

మహాలక్ష్మి దేవాలయం 'హేమాడ్ పంతి' నిర్మాణశైలిలో కట్టబడింది. ఇది చాలా విశాలమైన ప్రాంగణంలో చుట్టూ ఎత్తైన ప్రహరీ గోడతో ఉంటుంది. ప్రాంగణం మధ్యలో ఉన్న అమ్మవారి ఆలయం ఒక అద్భుత కళాసృష్టి అని చెప్పవచ్చు. ఆలయమంతా మనోహరమైన శిల్పాలతో నిండి ఉంటుంది. పశ్చిమాభిముఖంగా ఉండే గర్భగుడి ముందుగా సుమారు వందడుగుల పొడవు గల విశాలమైన మండపం ఉంటుంది. గర్భగుడి చుట్టూ సన్నని ప్రదక్షిణ మార్గం వుంది. గర్భగుడిలో సుమారు ఆరడుగుల చదరంగా ఉన్న ఎత్తైన వేదిక మీద రెండడుగుల పీఠం, దానిమీద మహాలక్ష్మి విగ్రహం కూర్చొని ఉన్న భంగిమలో ఉంటుంది. మూడడుగుల ఎత్తున్న మూర్తి చాలా అందంగా ఆకర్షణీయంగా ఉంటుంది. మహారాష్ట్రీయులకు కొల్హాపూర్ మహాలక్ష్మి అత్యంత పవిత్ర యాత్రాస్థలం. వీరు అమ్మవారిని 'అంబాబాయి' అని పిలుస్తారు. ఇక్కడ జరిగే ప్రధాన ఉత్సవం నవరాత్రి ఉత్సవం. ముఖ్యంగా ఆశ్వయుజ శుద్ధ పంచమి నాడు విశేషంగా గొప్ప ఉత్సవం జరుగుతుంది. ఆ రోజున అమ్మవారి ఉత్సవమూర్తిని నగరానికి తూర్పుగా ఐదు కి.మీ. దూరంలో ఉన్నటెంబ్లాయి అమ్మవారి ఆలయం దగ్గరికి ఊరేగింపుగా తీసుకొని వెళ్తారు. ఇదిగాక చైత్ర పూర్ణిమ రోజున జరిగే ఉత్సవంలో అమ్మవారిని నగరమంతా ఊరేగిస్తారు. గుడి ప్రాంగణంలో ఉన్న అనేక ఆలయాలలో విఠోబా ఆలయం కూడా చాలా పురాతనమైనది.

పూర్వకథ ....

అగస్త్య మహాముని అచంచల శివభక్తుడు. ఏటా కాశీ వెళ్లి విశ్వనాథుణ్ణి దర్శించుకునేవాడు. అయితే వృద్ధాప్యంలో అగస్త్యుడికి సుదూరంలో ఉన్న కాశీనగరాన్ని దర్శించుకోవడం కష్టమనిపించి, శివుడి గురించి తపస్సు చేశాడు. శివుడు ప్రత్యక్షమై, వరం కోరుకోమన్నాడు. అగస్త్యుడు తాను వయోభారంతో ఏటా కాశీలో ఉన్న విశ్వనాథుణ్ణి దర్శించుకోలేకపోతున్నానని, కాశీకి ప్రత్యామ్నాయంగా తనకో క్షేత్రాన్ని చూపిస్తే, అక్కడే తాను శివుణ్ణి దర్శిస్తానని కోరాడు. కాశీతో సమానమైన ప్రాశస్త్యం గల నగరం కొల్హాపురమని, అక్కడ శ్రీ మహాలక్ష్మి అమ్మవారు కొలువై ఉన్న క్షేత్ర సందర్శనం తనను కాశీలో దర్శించుకున్నంత పుణ్యఫలాలనిస్తుందని చెప్పాడట. శివుని ఆనతిమేరకు అగస్త్యుడు కొల్హాపూర్‌లో మహాలక్ష్మిని, అతిబలేశ్వరస్వామిని దర్శించి పునీతుడయ్యాడని ఇక్కడి స్థలపురాణాల ద్వారా అవగతమవుతోంది. అమ్మవారు వెలసిన తర్వాత ఈ నగరానికి కరవీరపురమనే పేరు సార్థకమైంది. ఈ నగరాన్ని కోల్‌పూర్ అని కోల్‌గిరి అని, కొలదిగిరి పట్టణ్ అని పిలిచేవారు. 'కొల్లా' అంటే 'లోయ'అని, 'పూర్' అంటే పట్టణమనే అర్థంలో ఈ క్షేత్రం విలసిల్లిందని చెబుతారు. కొల్హాపూర్ క్షేత్రాన్ని 1359వ సంవత్సరం వరకు శివాజీ మహారాజు పూర్వీకులు పాలించగా, 17వ శతాబ్దంలో ఛత్రపతి శివాజీ ఏలుబడిలో దినదిన ప్రవర్థమానమైందని తెలుస్తోంది. కరవీరపుర నివాసిని శ్రీ మహాలక్ష్మి దివ్య దర్శనం

**సర్వ దేవ కృత లక్ష్మీ స్తోత్రం**

సర్వదేవకృత లక్ష్మీ స్తోత్రం కనీసం 41 రోజులు క్రమంతప్పకుండా పారాయణ చేసి ప్రతీ శుక్రవారమూ అమ్మవారికి ఆవుపాలతో చేసిన పరమాన్నము నైవేద్యముగా పెట్టిన వారికి ఎంత కష్టములో ఉన్ననూ ఆ కష్టములు తొలగి సమస్త సంపదలూ లభిస్తాయి.

అయితే ఎన్నిసార్లు చేయాలి ? అనేది సహజంగా ఉద్భవించే ప్రశ్న ... బేసి సంఖ్యలో మనకు వీలైనన్ని సార్లు చదివితే ఉత్తమ ఫలితం ఉంటుంది, అమ్మవారి అనుగ్రహం తప్పక కలుగుతుంది. పెద్దలు మనకు " యథా శక్తి , శక్తి మేరకు , శక్తి వంచన లేకుండా ... " అని చెబుతుంటారు ... వీటిని సరిగ్గా అర్థం చేసుకోవాలి, అనుభవిస్తున్న కష్టాల తీవ్రతను బట్టి, మనకున్న సమయాన్ని బట్టి, వయసును బట్టి మనకు ఎంత వీలవుతుందో అంత శ్రమా తీసుకుని ప్రార్థించాలి. వివాహము ఆలస్యమవుతున్న అబ్బాయిలకి అతి త్వరలో సౌందర్య వతి అయిన, అనుకూల వతి అయిన కన్యతో వివాహము అవుతుంది. లక్ష్మీ దేవి వంటి భార్య లభిస్తుంది. ఇందు సంశయము లేదు. ఇంకా దీని వలన కలుగు సంపదలు అన్నీ ఇన్నీ అని చెప్పనలవి కాదు.

Printed, Published and Owned by B.V.Subrahmanyam, RK Printers, 49-23-27-1 Lalitha Nagar, Flot No: 101, Sai Tirumala Enclave, Visakhapatnam - 530016 Andhra Pradesh.
Editor B.V.Subrahmanyam, RK Printers, 49-23-27-1 Lalitha Nagar, Flot No: 101, Sai Tirumala Enclave, Visakhapatnam - 530016 Andhra Pradesh. Email : bulusu009@gmail.com, Cell : 8500159006